www.vaarthavedhikasurya.com

RNI NO :TGTEL/25/A0305

# వార్త వేదిక సూర్య

తెలుగు దినపత్రిక

VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

విలేకరులు కావలెను:

వార్త వేదిక సూర్య దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణలోని అన్ని జిల్లాల బ్యూరో, స్టాఫ్ రిపోర్టర్స్ మరియు నియోజక వర్గాల నుండి పనిచేయుటకు రిపోర్టర్లు కావలెను.

అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును

పొల్లేటి గోవర్ధనాచారి 9848246781

పోలోజు శ్రీనివాసాచారి 9985389183

| తెలంగాణ TELANGANA | సంపుటి : 1 VOLUME : 1 | సంచిక : 251 ISSUE : 251 | గురువారం, ఫిబ్రవరి 5, 2026 THURSSDAY, FEBRUARY 05, 2026 | ఎడిటర్ : పోలోజు శ్రీనివాస చారి EDITOR : POLOJU SRINIVASA CHARY | పేజీలు : 8 PAGES : 8 | వెల : 5-00 RS : 5-00 |
|---|---|---|---|---|---|---|

# అనర్హత పిటిషన్ కొట్టివేత అర్ధరహితం




## ఇది రాజ్యాంగానికి గొడ్డలిపెట్టు

- స్వయంగా సీఎం సంజయ్‌కు కండువాకప్పి కాంగ్రెస్ లో చేర్చుకున్నారు
- ఆధారాలు ఉన్నా లేవని పిటిషన్ తిరస్కరించారు
- స్పీకర్ పదవి గౌరవాన్ని దెబ్బతీస్తున్నారు
- ప్రజాగ్రహాన్ని చూసి రేవంత్ సర్కార్ వణికిపోతుంది
- మున్సిపల్ ఎన్నికల్లోనూ గుణపాఠం తప్పదు
- మాజీ మంత్రి కేటీఆర్ ఫైర్

హైదరాబాద్ ఫిబ్రవరి 4 :;జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌పై అనర్హత పిటిషన్‌ను స్పీకర్ గడ్డం ప్రసాద్ కొట్టివేశారని తెలిసిందే. బీఆర్ఎస్ గుర్తుపై గెలిచిన ఆయన కాంగ్రెస్‌లో చేరాడనడానికి ఎలాంటి ఆధారాలు లేవని తేల్చి చెప్పిన స్పీకర్ అనర్హత వేటు పిటిషన్‌ను తిరస్కరించారు.ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందిస్తూ.. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లను స్పీకర్ వరుసగా కొట్టివేస్తున్నతీరు రాజ్యాంగానికే గొడ్డలిపెట్టు అని అన్నారు. సాక్షాత్తూ ముఖ్యమంత్రే స్వయంగా జగిత్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్‌కు కండువా కప్పి కాంగ్రెస్‌లో చేర్చుకున్న ఫోటోలు, వీడియోలు కళ్లముందు కనిపిస్తున్నా ఆధారాలు లేవని అనర్హత పిటిషన్‌ను తిరస్కరించడం అర్ధరహితమన్నారు.అటు సుప్రీంకోర్టు తీర్పును, ఇటు ప్రజాతీర్పును కాలరాసి గోడదూకిన ఎమ్మెల్యేలపై రాజ్యాంగబద్ధంగా చర్య తీసుకోకుండా ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నడుచుకోవడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని కేటీఆర్ మండిపడ్డారు. ఓ వైపు జగిత్యాలలో మున్సిపల్ ఎన్నికల వేళ అసలు కాంగ్రెస్ నేత జీవన్ రెడ్డి దుమ్మెత్తిపోస్తున్నతరుణంలోనే ఫిరాయింపు ఎమ్మెల్యేకు క్లీన్ చిట్ ఇవ్వడం స్పీకర్ పదవికున్న గౌరవాన్ని దెబ్బతీయడమేనన్నారు. పంచాయతీ ఎన్నికల్లో తగిలిన ఘోరమైన ఎదురుదెబ్బతో కోలుకోని కాంగ్రెస్ పార్టీ బైఎలక్షన్స్ అంటే భయపడుతోందని అర్థమైపోయిందన్నారు.

**ఈ వికృత రాజకీయ క్రీడకు ప్రజాక్షేత్రంలోనే గుణపాఠం..**

మున్సిపల్ ఎన్నికల్లోనూ ముఖ్యమంత్రి వైఫల్యాలు, మోసాలపై పట్టణ ప్రజల్లో పెద్దఎత్తున వెల్లువెత్తుతున్న ఆగ్రహాన్ని చూసి రేవంత్ సర్కారు వణికిపోతుందని తేలిపోయింది. పార్టీ ఫిరాయింపుల సూత్రధారి ఢిల్లీకి పంపే మూటలకు ఆశపడి మౌనం వహిస్తున్న రాహుల్ గాంధీకి ఇకనుంచి రాజ్యాంగాన్ని పట్టుకుని తిరిగే నైతిక హక్కు లేదు. పట్టపగలే పది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించినా ఒక్కరిపై కూడా చర్య తీసుకోకుండా సీఎం నడిపిస్తున్న ఈ వికృత రాజకీయ క్రీడకు ప్రజాక్షేత్రంలోనే గుణపాఠం తప్పదని హెచ్చరించారు.



## జమ్మూకశ్మీర్‌లో ఎన్‌కౌంటర్

### భద్రతా బలగాలు, ఉగ్రవాదుల మధ్య ఫైరింగ్

### ఇద్దరు ఉగ్రవాదులు హతం

**శ్రీనగర్ ఫిబ్రవరి 4 :**

జమ్మూకశ్మీర్‌లో భద్రతా బలగాలు, ఉగ్రవాదుల మధ్య ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. ఈ ఎన్‌కౌంటర్‌లో భద్రతా బలగాలు ఇద్దరు ఉగ్రవాదులను హతం చేశాయి. ఉదంపూర్‌లో జైషే మహ్మద్‌కు చెందిన ఉగ్రవాదులు నక్కినట్లు సమాచారం అందింది. దీంతో భద్రతా బలగాలు, సిఆర్‌పిఎఫ్ బలగాలు సంయుక్తంగా గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలో ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డాయి. దీంతో ఎన్‌కౌంటర్ ప్రారంభమైంది. అనంతరం అక్కడి నుంచి పారిపోయిన ఉగ్రవాదులు ఓ గుహలో దాక్కున్నారు. ఉగ్రవాదులు గుహలో ఉన్నట్లు సమాచారం అందడంతో మరోసారి గాలింపు చర్యలు చేపట్టారు. స్థానికులకు ఎలాంటి హానీ జరగకుండా ఈ ఆపరేషన్‌ను ముందుకు తీసుకెళ్లారు. ఉగ్రవాదులను గుర్తించి ఎన్‌కౌంటర్‌లో హతమార్చారు. హతమైన ఇద్దరు ఉగ్రవాదుల్లో ఒకరు పాక్ జాతీయుడు కాగా, మరొకరు స్థానికుడు. వారి నుంచి ఎం4 కార్బైన్ రైఫిల్స్, ఎకె-47 రైఫిల్స్, మందు గుండు సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు.



## మణిపూర్ కొత్త సీఎంగా కేమ్‌చంద్

- ముగియనున్న రాష్ట్రపతి పాలన
- బీరేన్ సింగ్ సహా ఐదుగురి పేర్లు పరిశీలించిన బీజేపీ
- వచ్చే ఏడాది ఎన్నికలు

**ఇంపాల్, ఫిబ్రవరి 4 :**

మణిపూర్‌లో ఏడాదిగా కొనసాగుతున్న రాష్ట్రపతి పాలన త్వరలో ముగియనుంది. ఈ ఈశాన్య రాష్ట్రానికి కొత్త ముఖ్యమంత్రిగా బీజేపీ నేత యుమ్నమ్ కేమ్‌చంద్ సింగ్ ఎన్నికయ్యారు. కుకీ, మైతీ జాతుల మధ్య ఘర్షణలతో అట్టుడికిన రాష్ట్రంలో, బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేయాలని నిర్ణయించుకుంది. బీరేన్ సింగ్ సహా ఐదుగురి పేర్లు పరిశీలించిన తర్వాత కేమ్‌చంద్‌ను అధిష్ఠానం ఎంపిక చేసింది. దీంతో ఆయన మణిపూర్‌కు రెండో బీజేపీ సీఎం కానున్నారు. వచ్చే ఏడాది ఎన్నికలు జరగనున్నాయి.ఈశాన్య రాష్ట్రంలో మణిపూర్‌లో ఏడాదిగా కొనసాగుతోన్న రాష్ట్రపతి పాలన త్వరలోనే ముగిసి, ప్రజాస్వామ్య ప్రభుత్వం అధికారం చేపట్టనుంది. ఆ రాష్ట్ర కొత్త ముఖ్యమంత్రిగా యుమ్నమ్ కేమ్‌చంద్ సింగ్ (62) ఎన్నికయ్యారు. మంగళవారం జరిగిన బీజేపీ శాసనసభాపక్ష సమావేశంలో కేమ్‌చంద్‌ను తమ నాయకుడిగా బీజేపీ ఎమ్మెల్యేలు ఎన్నుకున్నారు. రెండేళ్లకుపైగా కుకీ, మైతీ తెగల మధ్య ఘర్షణలతో అట్టుడికిన మణిపూర్‌లో ఏడాది కిందట ముఖ్యమంత్రి పదవికి బీరేన్ సింగ్ రాజీనామా చేయడంతో అప్పటి నుంచి రాష్ట్రపతి పాలన కొనసాగుతోంది. మరో ఏడాదిలో ఎన్నికలు జరగనుండగా.. ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయాలని బీజేపీ నిర్ణయించుకుంది. ఈ క్రమంలో ముఖ్యమంత్రిగా కేమ్‌చంద్‌కు అవకాశం కల్పించింది. మణిపూర్ రాష్ట్రానికి రెండో బీజేపీ సీఎం కాబోతున్నారు. సీఎం రేసులో బీరేన్ సింగ్ సహా ఐదుగురు పేర్లు వినిపించగా.. కేమ్‌చంద్‌వైపు అధిష్ఠానం మొగ్గుచూపింది. మే 2023లో మైతీ, కుకీ తెగల మధ్య ఘర్షణలతో మణిపూర్‌లో హింస చెలరేగి

మిగతా 2 లో



## ఆరుగంటల్లోనే.. బెంగళూరుకు

- స్పీడందుకున్న నంద్యాల 167కే హైవే పనులు
- తగ్గనున్న 65 కిలోమీటర్ల దూరం
- నిర్మాణం కోసం 691.81 కోట్లు విడుదల
- జిల్లాలోని ఆరు మండలాల మీదుగా రహదారి ఏర్పాటు
- త్వరితగతిన పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశం

**కర్నూలు, ఫిబ్రవరి 4, (వార్త వేదిక సూర్య) :**

ఏపీలో నేషనల్ హైవే ప్రాజెక్టుల పనులు వేగవంతం అయ్యాయి. స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు రంగంలోకి దిగి ఇటీవల ప్రాజెక్టుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నైకు కనెక్టివిటీకి సంబంధించి ప్రాజెక్టులపై ఆరా తీశారు. ఈ క్రమంలో నంద్యాల జిల్లాలో 167కే హైవే పనులు వేగవంతం చేశారు. ఈ నేషనల్ హైవే అందుబాటులోకి వస్తే బెంగళూరు తర్వగా వెళ్లొచ్చు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారుల నిర్మాణంపై ఫుల్ ఫోకస్ పెట్టింది. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు.. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ప్రాజెక్టులకు సంబంధించిన పనుల్ని వేగవంతం చేయాలని సూచించారు. ఈ క్రమంలో బెంగళూరుకు కనెక్ట్ చేసే కీలకమైన నేషనల్ హైవే (167కే) పనులు స్పీడ్ అందుకున్నాయి. ప్రస్తుతం నంద్యాల నుంచి కోవెలకుంట్ల మీదుగా నొస్సం వరకు 62 కిలో మీటర్ల హైవే పనులు చేపట్టారు.. అక్కడి నుంచి జమ్మలమడుగు కడప రోడ్డుకు కనెక్ట్ చేయనున్నారు. ఈ హైవే అందుబాటులోకి వస్తే.. 60 నుంచి 65 కిలో మీటర్ల దూరం తగ్గుతుందని.. బెంగళూరుకు 6 గంటల్లోపు వెళ్లొచ్చంటున్నారు.ఈ జాతీయ రహదారి 167కే నిర్మాణం కోసం 691.81 కోట్లు విడుదల చేశారు.. మొత్తం 486 ఎకరాల భూమిని సేకరించారు. నంద్యాల జిల్లాలోని

మిగతా 2 లో



## అధికారం ఉంటే అభివృద్ధి చేయగలం..

- మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆశీర్వదించండి
- పార్టీ అభ్యర్థులను అధిక మెజార్టీతో గెలిపించాలి
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**ఖమ్మం, ఫిబ్రవరి, వార్తవేదిక సూర్య :**

సమస్యలు పరిష్కరించాలంటే ఎవరితో అవుతుంది, ఎవరు చేయగలరు, ఎవరి చేతులో ఉంది అనేది మనం తెలుసుకుని ఓటు వేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా 28వ వార్డులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నూకల రామ్మోహన్ రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మన ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకునే అవకాశం మీరు నాకు కల్పించారని, అధికారం ఉన్నది కాబట్టే ఏదులాపురం మున్సిపాలిటీగా ఏర్పాటు చేసుకోగలిగామని, ఇంకా అన్ని విధాలుగా అభివృద్ధి కూడా చేసుకోగలమన్నారు. ప్రత్యర్థుల మాయమాటలు నమ్మి మోసపోవద్దని, వారికి అధికారం లేదని, పనిచేసే చిత్తశుద్ధి అసలే లేదని విమర్శించారు. గత పది సంవత్సరాల్లో వారి చిత్తశుద్ధి బయటపడ్డదని పేర్కొన్నారు. ఈనెల 11న జరగబోయే మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మీ దీవెనలు, ఆశీస్సులు అందించి చేతి గుర్తుపై ఓటు వేసి హస్తం పార్టీని గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

## కాంగ్రెస్ రాజకీయ వ్యభిచారి



- గాంధీభవన్ లో పార్టీ ఫిరాయింపుల సంసారం
- ఓట్ల కోసం వచ్చే ఫిరాయింపు ఎమ్మెల్యేలను ప్రజలు నిలదీయాలి
- సిరిసిల్లలో కేటీఆర్ ఓటుకు రూ.10 ఇస్తున్నారు
- కేంద్రమంత్రి బండి సంజయ్
- రాజన్న సిరిసిల్ల జిల్లాలో మున్సిపల్ ఎన్నికల ప్రచారం

**సిరిసిల్ల, ఫిబ్రవరి 4 (వార్త వేదిక సూర్య):**

రాష్ట్ర ప్రభుత్వంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. కాంగ్రెస్ రాజకీయ వ్యభిచారి అంటూ మండిపడ్డారు. గాంధీ భవన్‌లో పార్టీ ఫిరాయింపుల సంసారం పెట్టారని.. అది కనిపించడం లేదా అని స్పీకర్‌ను సంజయ్ ప్రశ్నించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో జరిగిన మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్, కాంగ్రెస్‌లపై విమర్శలు గుప్పించారు. ప్రచారంలో బండి సంజయ్ మాట్లాడుతూ.. గాంధీ భవన్‌కు ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఎందుకు వెళ్తున్నారని.. జిల్లా కాంగ్రెస్ ఆఫీసు మీటింగుల్లో.. వాళ్లే బీఫాంలు పంచుతున్నారని అన్నారు. "స్పీకర్ గారు అయినా మీ కళ్లకు కనిపించడం లేదా? స్పీకర్ పదవికి మచ్చ తేవడం న్యాయమేనా? ప్రజలారా.. ఓట్ల కోసం వచ్చే ఫిరాయింపు ఎమ్మెల్యేలను నిలదీయండి. వాళ్లు ఏ పార్టీలో ఉన్నారు.. ఎందుకు ఓటు వేయాలో అని అడగండి" అని సంజయ్ పేర్కొన్నారు. తమకు భయపడి కెటిఆర్ సిరిసిల్లలోనే అడ్డాపెట్టి ఓటుకు రూ.10 వేలు ఇస్తున్నారని ఆరోపించారు. "కెటిఆర్.. నా జోలికొస్తే రోడ్డుకీడుస్తా. కేంద్రం నిధులిస్తే.. ఆ నిధులను తినేసి సిరిసిల్లను వరదల్లో ముంచుతున్నారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో సిరిసిల్లకు నయా పైసా ఇవ్వలేదు. కాంగ్రెస్ వద్దనే పైసలు లేవు. వాళ్లకి ఎందుకు ఓటేయాలి? అందుకే ఆరు గ్యారంటీలను అమలు చేయలేకపోతున్నారు. మళ్లీ ఓట్ల కోసం మోసపూరిత హామీలతో మీ ముందుకు వస్తున్నారు. కాంగ్రెస్ దొంగ హామీలను నమ్మి మోసపోతే ఐదేళ్ల అరిగోస తప్పదు" అని సంజయ్ అన్నారు.

## ఈనెల 6,7 తేదీల్లో తెలంగాణ గ్లోబల్ సోలార్ ఎక్స్పో

2 లో..



# తెలంగాణలో భారీగా టైఫాయిడ్ మరణాలు

### దేశంలో ప్రతి ఐదుగురిలో ఒకరు తెలంగాణకు చెందిన వ్యక్తి



**హైదరాబాద్, ఫిబ్రవరి 4, (వార్త వేదిక సూర్య ):** టైఫాయిడ్ మరణాల్లో దేశంలోనే తెలంగాణ రెండో స్థానంలో ఉండటం ఇప్పుడు పెను సంచలనంగా మారింది. దేశంలో టైఫాయిడ్‌తో ప్రాణాలు విడిచే ప్రతీ ఐదుగురిలో ఒకరు తెలంగాణకు చెందిన వారు అని ఆ నివేదిక వెల్లడించింది. 2023లో దేశంలో మొత్తం 1,075 మంది టైఫాయిడ్ కారణంగా చనిపోగా.. అందులో 202 మరణాలు ఒక్క తెలంగాణలోనే నమోద య్యాయని పేర్కొంది.దేశవ్యాప్తంగా టైఫాయిడ్‌కు సంబంధించిన గణాంకాలు.. తెలంగాణను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. దేశంలో నమోదు అవుతున్న ప్రతీ 5 మరణాల్లో ఒకటి తెలంగాణ నుంచే ఉందని తాజాగా రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన రిపోర్ట్ వెల్లడించడం తీవ్ర కలకలం రేపుతోంది. 2023లో టైఫాయిడ్ బారినపడి 202 మంది చనిపోయినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా దేశంలోని అన్ని టైఫాయిడ్ మరణాల్లో 19 శాతం తెలంగాణ నుంచి ఉన్నట్లు ఆ రిపోర్ట్ చెబుతోంది. టైఫాయిడ్ వ్యాప్తికి ప్రధాన కారణాలు.. కలుషితమైన ఆహారం, నీరు, పారిశుద్ధ్య సమస్యలు అని నిపుణులు చెబుతున్నారు.

అయితే టైఫాయిడ్ బారిన పడ్డ వారికి.. చికిత్సలో ఆలస్యం చేయడం వల్ల పేగులు దెబ్బతినడం వంటి ప్రాణాంతక సమస్యలు తలెత్తుతున్నాయని ఆ నివేదిక హెచ్చరించింది.2023కు సంబంధించి రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన మెడికల్ సర్టిఫికేషన్ ఆఫ్ కాజ్ ఆఫ్ డెత్ రిపోర్ట్ ప్రకారం.. మన దేశంలో టైఫాయిడ్, పారాటైఫాయిడ్ కారణంగా మొత్తం 1,075 మరణాలు నమోదైనట్లు తెలుస్తోంది. ఇక భారతదేశంలోనే రెండో అత్యధికంగా 202 మరణాలతో తెలంగాణ రెండో స్థానంలో నిలిచింది. ఇక 377 మరణాలతో మొదటి స్థానంలో ఉత్తర్‌ప్రదేశ్ ఉంది. అయితే దేశంలోని జనాభాలో తెలంగాణ జనాభా కేవలం 2.5 శాతం మాత్రమే కాగా.. టైఫాయిడ్ సంబంధిత మరణాల్లో మాత్రం 19 శాతం వాటాను కలిగి ఉండటం.. రాష్ట్రంలో పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో తెలుపుతోంది.మూడో స్థానంలో 118 మరణాలతో పంజాబ్.. 36 మరణాలతో ఢిల్లీ నాలుగో స్థానాల్లో నిలిచాయి.సాల్మొనెల్లా టైఫీ అనే బ్యాక్టీరియా కారణంగా టైఫాయిడ్ సోకుతుంది. కలుషిత ఆహారం, నీటి ద్వారా ఈ సాల్మొనెల్లా టైఫీ బ్యాక్టీరియా వ్యాప్తి చెందుతుంది. అపరిశుభ్రమైన నీరు.. పైపులైన్లు వేసేటపుడు, మరమ్మతుల సమయంలో అందులో మురుగునీరు కలిస్తే.. వాటిని తాగడం వల్ల ఈ టైఫాయిడ్ విస్తృతంగా వ్యాప్తి చెందుతోంది. పరిశుభ్రత లేకుండా తయారు చేసే స్ట్రీట్ ఫుడ్, దాని తయారీలో ఉపయోగించే కలుషితమైన నీటిని వాడటం వల్ల.. ఎక్కువగా ఈ టైఫాయిడ్ బారిన పడుతున్నారు.

నగరాల్లో నాలాలు, రోడ్లపై మురుగునీరు పొర్లడం, మురికివాడల్లో వ్యర్థాల నిర్వహణ సరిగా లేకపోవడం వల్ల ఈ సాల్మొనెల్లా టైఫీ బ్యాక్టీరియా అతి వేగంగా వ్యాప్తి చెందుతుంది.అయితే టైఫాయిడ్ సోకిన చాలామంది.. దాన్ని ఒక సాధారణ జ్వరం అని భావించి నిర్లక్ష్యం చేస్తారు. మరికొందరు సొంతంగా మెడిసిన్ వేసుకుని తగ్గించుకుందామనే ప్రయత్నం చేస్తారు. కానీ ఇలాంటి నిర్ణయాల వల్లే వారి పరిస్థితి విషమించి ప్రాణాల మీదికి తెస్తోందని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. సరైన సమయంలో ట్రీట్‌మెంట్ తీసుకోకపోతే.. ఈ టైఫాయిడ్ వల్ల పేగులకు రంధ్రాలు పడటం, రక్తంలో ఇన్ఫెక్షన్ రావడం, అవయవాలు చెడిపోయే ప్రమాదం ఉందని చెబుతున్నారు. సరైన సమయంలో సరైన మెడిసిన్ వాడకపోవడం, సాధారణ యాంటీబయాటిక్స్ పని చేయకపోవడం టైఫాయిడ్ రోగులకు మరో పెద్ద సవాలుగా మారిందని డాక్టర్లు తెలిపారు.నిపుణుల సూచించిన వివరాల ప్రకారం.. నీటిని కాచి చల్లార్చి తాగడం.. వేడి వేడి ఆహారాన్ని తినడం, జ్వరం వచ్చిన తర్వాత డాక్టర్‌ను సంప్రదించి సరైన సమయంలో ట్రీట్‌మెంట్ తీసుకోవడం వల్ల మరణాలను అరికట్టవచ్చని చెబుతున్నారు. టైఫాయిడ్ కేసులు ఎక్కువగా నమోదయ్యే ప్రాంతాలను హాట్‌స్పాట్‌లుగా గుర్తించి అక్కడ పారిశుద్ధ్య చర్యలను పూర్తిగా చేపట్టాలని సూచిస్తున్నారు.

# సర్వశక్తులు ఒడ్డుతున్న హస్తం పార్టీ



**హైదరాబాద్, ఫిబ్రవరి 4, (వార్తవేదిక సూర్య):** మున్సిపల్ ఎన్నికల్లో హస్తం పార్టీ సర్వేలతో సర్వం పసిగట్టిందా.. అసలు ఈ సర్వేలు తమకి అనుకూలంగా ఉన్నాయా..? ప్రతికూలంగా ఉన్నాయా..? ఓ వైపు ప్రయివేట్ సంస్థల సర్వేలు,మరోవైపు ప్రభుత్వ ఇంటిలిజెన్స్ సర్వేలలో ఎక్కడ ద్విముఖ పోరు ఉండనుంది? ఎన్ని స్థానాల్లో త్రిముఖ పోరు ఉంటుంది...కొన్ని స్థానాల్లో నేతలకు సీఎం డైరెక్ట్ కాల్ చేసి భరోసా ఇవ్వడంలో మతలబు ఏంటి..? ఇంతకీ మున్సిపోల్స్ హస్తంపార్టీ హస్తగతం అయ్యేనా..?.. కాంగ్రెస్ నేతలు మున్సిపల్ ఎన్నికలపై ఫోకస్ పెంచుతున్నారు. హస్తం నేతలు నాలుగు ప్రయివేట్ సంస్థలతో చేయించిన సర్వే రిపోర్టులు అందినట్లు సమాచారం. ప్రయివేట్ సంస్థల రిపోర్టులతో పాటు ప్రభుత్వ ఇంటిలిజెన్స్ రిపోర్టులను అధ్యయనం చేసిన హస్తం నేతలు తాము అనుకున్న టార్గెట్ రీచ్ అయ్యే అవకాశం ఉందని ధీమాగా ఉన్నారు. విదేశీ పర్యటనలో బిజీబిజీగా గడిపిన సీఎం రేవంత్ సైతం తెలంగాణకి రావడంతోనే సర్వే రిపోర్టులు పరిశీలించినట్లు సమాచారం. రిపోర్టులు తమకి అనుకూలంగా ఉన్నాయని, ఎలాంటి పొరపాట్లు చేయకుండా ఉంటే తొంబై శాతం స్థానాలు కాంగ్రెస్ కైవసం చేసుకోవచ్చని నేతలకు దిశానిర్దేశం చేసినట్లు సమాచారం..
సర్వే రిపోర్టులు తమకి అనుకూలంగా ఉన్నప్పటికీ పలు విషయాల్లో హస్తం నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ఉత్తర తెలంగాణలో బీజేపీకి అనుకూలంగా ఉన్నట్లు సర్వేల్లో వెల్లడైనట్లు తెలుస్తోంది. బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ఉన్న ప్రాంతం కావడంతో పాటు అర్బన్ ప్రాంతంలో హిందుత్వ ప్రభావం ఉండడంతో ఉత్తర తెలంగాణలోని పలు మున్సిపాలిటీలలో బీజేపీకి అనుకూలంగా ఉంది. ఆ స్థానాల్లో త్రిముఖ పోరు ఉండనున్నట్లు హస్తం నేతలు అంచనా వేస్తున్నారు. త్రిముఖ పోటీ ఉన్న దగ్గర ఏవిధంగా ప్రచారం చేయాలో సీఎం రేవంత్ నేతలకు దిశా నిర్దేశం చేసినట్లు సమాచారం. మైనార్టీ ఓటు బ్యాంకు కాంగ్రెస్‌కు పడే విధంగా చూడడంతో పాటు, హిందుత్వ ఓటు బ్యాంకు చీలకుండా ఉండేందుకు సీఎం రేవంత్ కొత్త ప్లాన్ వేసినట్లు తెలుస్తోంది. ఈ విషయాలను నేతలకు వ్యక్తిగతంగా కాల్ చేసి వివరించడానికి సీఎం సిద్ధమైనట్లు సమాచారం..
దక్షిణ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్నట్లు సర్వేల్లో వెల్లడించింది. ఈ ప్రాంతంలో దాదాపుగా ద్విముఖ పోరు ఉంటుందని హస్తం నేతలు అంచనా వేశారు. ఈ స్థానాల్లో గత పదేళ్లలో కేసీఆర్ చేసిన వైఫల్యాలను ఎండగట్టేలా ప్రచార వ్యూహాలను సిద్ధం చేయాలని సీఎం సూచించారు. ఇక పార్టీకి ఇబ్బందిగా ఉన్న నియోజవర్గాల లిస్ట్ కూడ సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఆయా ప్రాంతాల్లో లోకల్ గా ఉన్న సమస్యలను గుర్తించి దానికి అనుగుణంగా మేనిఫెస్టో సిద్ధం చేయాలని సీఎం రేవంత్ సూచించినట్లు సమాచారం.

నాయకుల మధ్య అంతర్గత పోరు, ఆధిపత్య ఇబ్బందులున్న నియోజకవర్గాలను సైతం ప్రత్యేకంగా గుర్తించినట్లు తెలుస్తోంది. ఆయా నియోజవర్గాల నాయకుల మధ్య సమన్వయం కుదిర్చే బాధ్యతను పలువురు సీనియర్ నేతలకు సీఎం రేవంత్ అప్పగించారు. ఆ నేతలు సీఎం రేవంత్ దూతగా ఆయా నియోజకవర్గాలకు వెళ్లి నేతలతో మాట్లాడి వారి మధ్య సమన్వయం కుదిర్చి రావాలని సీఎం రేవంత్ ఆదేశించారు. సర్వేలు అనుకూలంగా ఉన్నాయి కదా అని నేతలు రిలాక్స్ అయితే ఊరుకునేది లేదని సీఎం వార్నింగ్ ఇచ్చినట్లు సమాచారం. ఎన్నికలు ముగిసి మున్సిపల్ చైర్మన్ల, మేయర్ల ఎన్నిక జరిగేదాక కీలక నేతలంతా నియోజకవర్గాల పరిధిలోనే ఉండాలని సీఎం ఆదేశించారు. ఇక తొంబై శాతం టార్గెట్ పెట్టుకున్న కాంగ్రెస్ ఎంత శాతం సక్సెస్ అవుతుందో వేచి చూద్దాం...

# ఐటీ కారిడార్ లో స్కైవాక్...



**హైదరాబాద్, ఫిబ్రవరి 4, (వార్త సూర్య వేదిక):** హైదరాబాద్‌లోని ఐటీ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. ఐటీ కారిడార్‌లో సరికొత్త స్కైవాక్ నిర్మించేందుకు చర్యలు చేపట్టింది. రాయదుర్గ్–టీహబ్ మార్గంలో ఈ కొత్త స్కైవాక్ నిర్మించాలని భావిస్తున్నారు. స్కైవాక్ నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదిత మార్గంలో.. ఉన్నతాధికారులతో కలిసి సైబరాబాద్ సీపీ క్షేత్ర స్థాయిలో పర్యటించారు. రోడ్లు దాటేవారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు ఫిర్యాదులు రావడంతో ఆ మార్గంలో స్కైవాక్ నిర్మించేందుకు ప్రతిపాదనలు రెడీ చేశారు.ఐటీ హబ్‌గా దూసుకెళ్తున్న హైదరాబాద్‌లో రోజురోజుకూ జనాభా భారీగా పెరిగిపోతోంది. ఐటీ కారిడార్‌లో నిత్యం లక్షల మంది టెకీలు రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో ఉదయం, సాయంత్రం ఆ మార్గాల్లో ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయి. ఈ ట్రాఫిక్‌ను తగ్గించేందుకు ప్రభుత్వం.. ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, రోడ్డు విస్తరణ పనులను ఎప్పటికప్పుడు చేపడుతూనే ఉంది. అయినప్పటికీ జనం, వాహనాల రద్దీతో.. నగరంలో జనం ట్రాఫిక్ ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. అదే సమయంలో ట్రాఫిక్ సమయంలో పాదచారులు నడిచేందుకు, రోడ్డు దాటేందుకు కూడా చాలా కష్టంగా మారుతోంది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం రద్దీగా ఉండే కీలక ప్రాంతాల్లో స్కైవాక్‌లను ఏర్పాటు చేస్తోంది. విశాలమైన రోడ్లు దాటలేక ఇబ్బంది పడేవారికి.. ట్రాఫిక్ ఉన్న సమయంలో.. పాదచారులు ఈ స్కైవాక్‌లను ఉపయోగించి.. సులువుగా గమ్యాన్ని చేరుకోవచ్చు.ఇప్పటికే నగరంలోని ప్రధాన కూడళ్లు, కీలక ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన స్కైవాక్‌లపై నగరవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సంబంధించిన మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది.

సైబరాబాద్‌లోని రాయదుర్గ్–టీ హబ్ వద్ద కొత్త స్కైవాక్ నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది.హైదరాబాద్‌లోని రద్దీగా ఉండే ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ సమస్యలు, పాదచారుల భద్రత, మరింత సౌకర్యంగా నడిచి వెళ్లడం కోసం ఈ స్కైవాక్‌ను నిర్మించనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. దీనికి సంబంధించి పోలీస్, ట్రాఫిక్ ఉన్నతాధికారులతో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఎం రమేష్.. క్షేత్రస్థాయిలో పర్యటించి పర్యవేక్షించారు.ఈ స్కైవాక్.. రాయదుర్గ్ నుంచి ప్రారంభమై మెట్రో స్టేషన్, ఐకియా ఫ్లైఓవర్, ఐటీసీఎల్ జంక్షన్ మీదుగా టీ–హబ్ వరకు నిర్మించనున్నారు. మెట్రో ప్రయాణికులు, ఆఫీసులకు వెళ్లే ఉద్యోగులు, నగరవాసులతో కిక్కిరిసిపోయి ఉండే ట్రాఫిక్, పాదచారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని.. ఈ స్కైవాక్ ప్రాజెక్టును అధికారులు ప్రతిపాదించారు.ఈ స్కైవాక్ నిర్మాణంతో దాదాపు 30 శాతం ట్రాఫిక్ రద్దీని తగ్గించాలని అధికారులు ప్రణాళికలు వేశారు. సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ సహాయంతో ఈ స్కైవాక్ ప్రతిపాదనను అధికారులు రూపొందించారు. ఈ స్కైవాక్ ఫేజ్–1లో భాగంగా 500 మీటర్ల మేర నిర్మించనున్నారు. ఇక టీ–హబ్, మైండ్ స్పేస్ సీ–గేట్‌ను కలుపుతూ 400 మీటర్ల అండర్‌పాస్ నిర్మించేందుకు కూడా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

# ఆరుగంటల్లోనే.. బెంగళూరుకు

మొదటి పేజీ తరువాయి
ఆరు మండలాల్లోని (కోవెలకుంట్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు, నంద్యాల, సంజామల, గోస్పాడు) 22 గ్రామాల మీదుగా వెళుతోంది. మూడుచోట్ల బ్రిడ్జిలు.. అలాగే 158 చోట్ల కల్వర్టుల నిర్మాణం చేపట్టారు. ఈ హైవేలో నాలుగు ప్రాంతాల్లో బైపాస్‌లు (కోవెలకుంట్ల, రైతునగరం, నొస్సం, గోస్పాడు) కూడా నిర్మిస్తున్నారు. ఈ ఏడాది మార్చి నాటికి ఈ బైపాస్‌లు, కల్వర్టుల నిర్మాణ పనులు పూర్తవుతాయని భావిస్తున్నారు. బైపాస్‌లు అందుబాటులోకి వస్తే నంద్యాల నుంచి నొస్సం గంటలోపే వెళ్లొచ్చు.ఈ హైవే పూర్తిచేస్తే కర్నూలు, నంద్యాల జిల్లాల ప్రజలకు బెంగళూరుతో కనెక్టివిటీ పెరుగుతుంది. ఎందుకంటే రెండు జిల్లాల నుంచి బెంగళూరుకు వెళ్లేవారిలో.. ఐటీ ఉద్యోగులు, ఉపాధి కోసం వెళ్లేవారు, వ్యాపారులు ఉంటారు. వారందరికి ప్రయాణ సమయం తగ్గుతుంది. గతంలో బెంగళూరు వెళ్లాలంటే అవుకు, కొలిమిగుండ్ల మీదుగా తాడిపత్రి, అనంతపురం మీదుగా వెళ్లేవారు. అదే 167కే జాతీయ రహదారి అందుబాటులోకి వస్తే.. జమ్మలమడుగు, ముద్దనూరు మీదుగా తాడిపత్రి హైవేలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా బెంగళూరుకు త్వరగా వెళతారు. అలాగే ఆర్ అండ్ బీ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిది కూడా కర్నూలు జిల్లా కావడంతో ఆయన కూడా ఈ హైవే పనుల్ని వేగవంతం చేయాలని అధికారుల్ని ఆదేశించారు. మొత్తం మీద బెంగళూరు వెళ్లేవారికి కీలకమైన హైవే పనులు ఊపందుకున్నాయి.

# వేములవాడలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి

### కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి గోటికార్ కిషన్ జీ

వేములవాడ, వేములవాడ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను పట్టణ ప్రజలు ఆదరించి గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ పెద్దపెల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి గోటికార్ కిషన్ జీ విజ్ఞప్తి చేశారు. వేములవాడ దేవస్థానం అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ చెప్పినట్లు నిధులు వెచ్చించి పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం వల్ల వేములవాడ పట్టణానికి భక్తుల తాకిడి పెరిగి పట్టణవాసులకు ఆర్థిక వెసులుబాటు కలిగిందన్నారు.

ప్రతి కుటుంబానికి ఉచితంగా సన్న బియ్యం, రేషన్ కార్డు లేని వానికి రేషన్ కార్డులు మంజూరు చేశారని, సన్న వడ్లకు 500 బోనస్, రైతు భరోసా ను న్యాయంగా రావలసిన వారికి వర్తింపజేయడం, దాదాపు 75 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వడం లాంటి కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టిందన్నారు. ప్రతి నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు ఏర్పాటు చేస్తూ అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకువచ్చింది అన్నారు. ప్రజా ప్రభుత్వాన్ని బలోపేతం చేయాలంటే మున్సిపాలిటీలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉండాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వేములవాడ శాసన సభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సహకారంతో వేములవాడను మరింత అభివృద్ధి చేసేందుకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని గోటికార్ కిషన్ జీ కోరారు.

# తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవం

**హైదరాబాద్, ఫిబ్రవరి 4, (వార్త సూర్య వేదిక) :** "తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవం" సందర్భంగా ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు శుభాకాంక్షలు తెలియజేశారు. అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం, సామాజిక సాధికారత కల్పించేందుకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. బడుగు, బలహీన వర్గాలు, మైనారిటీల సంక్షేమానికి ప్రభుత్వం ఒక బాధ్యతగా, 'సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల సర్వే' ను ఎంతో నిబద్ధతతో శాస్త్రీయ పద్ధతిలో పూర్తి చేసిందని గుర్తుచేశారు. అంతే కాకుండా, దశాబ్దాల నుంచి అపరిష్కృతంగా ఉన్న ఎస్సీ ఉపకులాల వర్గీకరణకు పరిష్కారం చూపించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని తెలిపారు.

అన్ని వర్గాలకు సమాన, సముచిత న్యాయం కల్పించాలనే ఆశయంతో తీసుకున్న నిర్ణయాల నేపథ్యంలో, ప్రతి ఏటా ఫిబ్రవరి 4వ తేదీని తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవంగా జరుపుకోవాలని నిర్ణయించిన విషయాన్ని గుర్తుచేశారు. సామాజిక న్యాయం కోసం ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని పునరుద్ఘాటించారు.

# ఈ నెల 6,7 తేదీలలో తెలంగాణ గ్లోబల్ సోలార్ ఎక్స్పో

**హైదరాబాద్, ఫిబ్రవరి 4, (వార్త సూర్య వేదిక):** ఫిబ్రవరి 6,7వ తేదీలలో హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ వేదికగా గ్లోబల్ సోలార్ ఎక్స్పో తెలంగాణ 2026 ను నిర్వహించనున్నది.ఈ కార్యక్రమం సోలార్ అండ్ డీకార్బొనైజేషన్ మార్కెట్ ప్లేస్ సహకారంతో నిర్వహిస్తున్నామని సంస్థ సిఎండి కొఫౌండర్ ఆనంద్ గుప్త వారి బిజినెస్ డెవలప్మెంట్ మేనేజర్ యషిక చెబరా,ఆదిత్య మెహనలతో కలిసి తెలియజేశారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన కార్యక్రమ సన్నాహక సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ ఎక్స్పోలో ముఖ్య అతిథులుగా తెలంగాణ పునరుత్పాదక శక్తి రంగానికి చెందిన ప్రముఖ ప్రభుత్వ అధికారులు పాల్గొనను న్నారు అని తెలియజేశారు. ఎక్స్పోలో ఫిమర్, డేయి,సెనింగ్ ఎలక్ట్రిక్,నోవాసిస్, కలర్ షైన్,ఏయూ స్మాల్ ఫైనాన్స్,ఏరేమ్ తదితర ప్రముఖ జాతీయ అంతర్జాతీయ బ్రాండ్లు పాల్గొనున్నాయని అన్నారు తాము నిర్వహించబోయే ఈ సోలార్ ఎక్స్పో వేదికగా అన్ని ప్రాంతాల నుండి డెవలపర్లు,ఈపీసీ సంస్థలు, కార్పొరేట్లు,ఎం.ఎస్.ఎం.ఈ లు, పెట్టుబడిదారులు ఎలాంటి మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా నేరుగా కలుసుకొని తమ భవిష్యత్తు ఒప్పందాలు కుదుర్చుకునే అపూర్వ అవకాశం లభిస్తుంది అని అన్నారు.10వేల పై చిలుకు మంది పాల్గొనే ఈ ఎక్స్పోలో సి.ఎక్స్.ఓ స్థాయి నాయకుల హాజరు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల బలమైన మద్దతుతో పునరుత్పాదక శక్తి రంగాన్ని కొత్త దిశగా పరుగులు పెట్టించే ప్రయత్నం తాము చేస్తున్నామని అన్నారు.

# జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ అనర్హత పిటిషన్ కొట్టివేత

**హైదరాబాద్, ఫిబ్రవరి 4, (వార్త సూర్య వేదిక) :** జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ మీద దాఖలైన అనర్హత పిటీషన్ ను ఇచ్చిన అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కొట్టివేసారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్కు క్లిన్ చిట్ ఇచ్చారు. ఆయన పార్టీ మారారు అనడానికి ఆధారాలు లేవని స్పీకర్ తేల్చి చెప్పారు. సంజయ్ బీఆర్ఎస్ టికెట్ పై గెలిచి తరువాత కాంగ్రెస్ లో చేరారు. నేను బీఆర్ఎస్ ఎమ్మెల్యేనే కానీ కాంగ్రెస్ పార్టీతో పనిచేస్తున్నాను. కేవలం నియోజకవర్గ అభివృద్ధి కోసమే కాంగ్రెస్ పార్టీతో కలిసి పనిచేస్తున్నానని సంజయ్ అంటున్నారు. సంజయ్ పార్టీ ఫిరాయించారని అయనపై అనర్హత వేటు వేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి పిటిషన్ దాఖలు చేసారు.

## 27నేను బీఆర్ఎస్ ఎమ్మెల్యేనే

జగిత్యాల ఫిబ్రవరి 4, (వార్త సూర్య వేదిక) : నేను బీఆర్ఎస్ పార్టీ గుర్తు మీద గెలిచిన.. ఇప్పుడు కూడా నేను బీఆర్ఎస్ ఎమ్మెల్యేనేనని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ స్పష్టం చేసారు. బుధవారం అయన మీడియాతో మాట్లాడారు. జగిత్యాల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి శాలువ కప్పుకున్నా. అంతే. కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు నేను ఎక్కడా చెప్పలేదు.. రేవంత్ రెడ్డి ఎక్కడా చెప్పలేదని అన్నారు. నేను బీఆర్ఎస్ పార్టీకి నెలకు రూ.5 వేలు కడుతున్నా.. బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నట్లు అఫిడవిట్ ఇచ్చానని అన్నారు.

# మణిపూర్ కొత్త సీఎంగా కేమ్‌చంద్

**మొదటి పేజీ తరువాయి**
వందల మంది ప్రాణాలు కోల్పోయారు. వేల మంది నిరాశ్రయులు కాగా.. ఆస్తులు భారీ ఎత్తున ధ్వంసమయ్యాయి.న్యూఢిల్లీలో బీజేపీ అగ్ర నేతలు సమావేశమై మణిపూర్ కొత్త సీఎం ఎంపికపై చర్చించారు. అనంతరం ఇంఫాల్‌లో జరిగిన బీజేపీ లేజిస్లేటివ్ పార్టీ సమావేశంలో మాజీ స్పీకర్ అయిన కేమ్‌చంద్‌ను తమ నేతగా ఎన్నుకున్నారు. ఇక, కేమ్‌చంద్ సింగ్జామై నియోజకవర్గం నుంచి వరుసగా రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. తొలిసారి 2017 ఎన్నికల్లో గెలిచిన ఆయనకు స్పీకర్ పదవి వరించింది. ఐదేళ్ల పాటు పూర్తికాలం స్పీకర్‌గా కొనసాగారు. మళ్లీ 2022 మణిపూర్ అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ విజయం సాధించారు.మణిపూర్‌లో ప్రస్తుతం పరిస్థితులు చక్కబడినట్టు పైకి కనిపిస్తున్నా.. పది రోజుల కిందట తన భార్యను చూసేందుకు నేపాల్ నుంచి వచ్చిన మైతీ వ్యక్తిని దారుణంగా కాల్చి చంపారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. భార్యతో సంతోషంగా గడుపుతున్న అతడ్ని.. ముసుగులు ధరించి వచ్చిన కొందరు దుండగులు విచక్షణారహితంగా కాల్చి చంపారు.

# ఉద్యోగాలిస్తామని మోసం చేసిన ప్రభుత్వం

**హైదరాబాద్, ఫిబ్రవరి 4, (వార్త సూర్య వేదిక) :** రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీనిచ్చి రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందని నిరుద్యోగ జేఏసీ నేతలు ధ్వజమెత్తారు. బుధవారం నాడు ఇందిరా పార్క్ వద్ద ఉద్యోగ నోటిఫికేషన్ సాధనకై హలో నిరుద్యోగి చలో ఇందిరా పార్క్ మహా ధర్నా కార్యక్రమాన్ని నిరుద్యోగులు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతితులుగా బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ హేమ సుదర్శన్ జిల్లోజు హాజరై మద్దతు నిచ్చారు. ఈ సందర్భంగా జేఏసీ నిరుద్యోగులు మాట్లాడుతూ గత ప్రభుత్వం మాదిరిగానే రేవంత్ ప్రభుత్వం కూడా నిరుద్యోగులను నిండా మోసం చేస్తుందని వాపోయారు. రాహుల్ గాంధీ చిక్కడపల్లికి వచ్చి నిరుద్యోగులకు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ గెలుపుకు నిరుద్యోగులంతా కలసి ఉద్యోగాలు కల్పిస్తారని ఆశ చూపిస్తే ఈ రోజు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. లక్ష ఉద్యోగాలు ఇచ్చామని బుకాయించడమే తప్ప చేసింది ఏమీ లేదని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులను పట్టించుకోకపోతే రాబోయే రోజుల్లో మున్సిపల్ ఎన్నికలలో మా సత్తా ఏమిటో చూపిస్తామని హెచ్చరించారు.

# అసెంబ్లీ స్పీకర్ న్యాయ బద్ధంగా ప్రవర్తించడం లేదు

### మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 4, (వార్త సూర్య వేదిక) :** జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ పార్టీ మారిన ఫిర్యాదును డిస్మిస్ చేసిన స్పీకర్ నిర్ణయం పై మాజీమంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి స్పందించారు.
తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ న్యాయ బద్ధంగా ప్రవర్తించడం లేదని అన్నారు. బహిరంగంగా పార్టీ మారి కాంగ్రెస్ సమావేశాల్లో పాల్గొంటున్నా.. స్పీకర్ కి కనపడకపోవడం విచారకరం, చర్య తీసుకోకపోవడం దురదృష్టకరం. స్పీకర్ ఏకపక్ష నిర్ణయం ప్రజలు గమనిస్తున్నారు. కాంగ్రెస్ చర్యల పట్ల ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయం. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నది కనబడటం లేదా అని ప్రశ్నించారు.
ఫిరాయించిన ఎమ్మెల్యేలు బహిరంగంగా సభలకు, కాంగ్రెస్ కార్యక్రమాలకు హాజరువుతున్నారు.. అది స్పీకర్ కి కనపడలేదు అంటా . స్పీకర్ ఆత్మసాక్షిగా, చట్ట పరంగా నిర్ణయం తీసుకోలేక పోతున్నారు. స్పీకర్ పిటిషన్ను డిస్మిస్ చేయడం చట్టవిరుద్ధమే. స్పీకర్ వదిలినా కోర్టుల్లో శిక్ష తప్పదు.. వాళ్లను డిస్మిస్ చేయడం ఖాయమని అన్నారు.

# వైసీపీకి వరుస షాక్‌లు

నెల్లూరు, ఫిబ్రవరి 4,: ఏపీలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలకు వరుస షాకులు తగులుతున్నాయి. తాజాగా మరో ఇద్దరు నేతలపై కేసులు నమోదయ్యాయి. మాజీ మంత్రి విడదల రజిని, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి పోలీసులు నోటీసులు అందించారు. సీఎం చంద్రబాబు, సోమిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాకాణిపై కేసులు నమోదు కాగా.. పోలీసులు నోటీసులు ఇచ్చారు. కాకాణి ఇంటికి వెళ్లి నోటీసులు అందజేశారు.ఏపీ రాజకీయాలు హాట్ హాట్‌గా సాగుతున్నాయి. తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి కేసు అధికార, విపక్ష పార్టీల మధ్య నిప్పు రాజేసింది. దీంతో మాటల తూటాలు, ఇళ్లపై దాడులు, కేసులు.. ఇలా ఏపీ రాజకీయం మొత్తం వేడెక్కిపోయింది. ఈ క్రమంలోనే విపక్ష వైసీపీ నేతలకు వరుస షాకులు తగులుతున్నాయి. ఇప్పటికే మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేష్ మీద కేసులు నమోదు కాగా.. తాజాగా మరికొందరు మాజీ మంత్రులు కూడా కేసులు, నోటీసులతో ఉక్కిరిబిక్కిరయ్యే పరిస్థితి.తాజాగా మాజీ మంత్రి విడదల రజినీపై కేసు నమోదైంది. జనవరి 30వ తేదీన విడదల రజిని అనుచరులు, టీడీపీ నాయకుల మధ్య గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో టీడీపీ నేతలు విడదల రజినీపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా యడ్లపాడు పోలీసులు విడదల రజినితో పాటుగా 21 మంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలపై కేసు నమోదు చేశారు.మరోవైపు వైసీపీ నేత, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి పోలీసులు నోటీసులు ఇచ్చారు. కాకాణి ఇంటికి వెళ్లిన పోలీసులు.. ఆయనకు నోటీసులు అందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ టీడీపీ నేతలు చేసిన ఫిర్యాదు ఆధారంగా.. కాకాణిపై కేసులు నమోదయ్యాయి. నెల్లూరు గ్రామీణం, మనుబోలు, పొదలకూరులో కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలోనే విచారణకు రావాలంటూ కాకాణి గోవర్ధన్ రెడ్డికి పోలీసులు నోటీసులు ఇచ్చారు.అటు వినుకొండ మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత బొల్లా బ్రహ్మనాయుడుపైనా కేసు నమోదైంది. వినుకొండ పోలీసులు బొల్లా బ్రహ్మనాయుడు మీద కేసు నమోదు చేశారు. జనవరి 31వ తేదీ వినుకొండలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో బొల్లా బ్రహ్మనాయుడు, ఇతర వైసీపీ నేతలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తోపులాట జరగ్గా.. ఓ కానిస్టేబుల్‌ను వైసీపీ నేతలు తోసేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనలో కానిస్టేబుల్ గాయపడినట్లు చెప్తున్నారు. ఈ కానిస్టేబుల్ ఫిర్యాదు ఆధారంగానే బొల్లా బ్రహ్మనాయుడుతో పాటుగా 27 మంది వైసీపీ నేతలపై వినుకొండ పోలీసులు కేసు నమోదు చేశారు.

**ప్లాన్ వర్కౌటవుతుందా**

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆశించిన స్థాయిలో ప్రజల నుంచి స్పందన రావడం లేదు. తమ పార్టీ నేతలపై దాడులకు తెగబడుతున్నారని జగన్మోహన్ రెడ్డి చెప్పుకొచ్చారు. అయితే గతంలో జగన్ ఇలాంటి దాడుల విషయంలో వ్యవహరించిన తీరును ఇప్పటికీ ప్రజలు గుర్తు చేస్తున్నారు. వారికి గుర్తు లేకపోతే సోషల్ మీడియా గుర్తు చేస్తోంది. బీపీలు వస్తే పార్టీ కార్యకర్తలు, అభిమానులు దాడి చేస్తారు అన్న జగన్ మాటను ఎక్కువ మంది గుర్తు చేస్తున్నారు. అప్పట్లో టిడిపి నేత ఒక్కరూ బోస్ డీకే అనే పదాన్ని వాడారు. దానిని విచిత్రమైన బూతుగా మార్చారు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు. చివరకు జగన్మోహన్ రెడ్డి అదే మాటను వక్రీకరిస్తూ.. తనను అంత మాట అంటే అభిమానులకు బీపీ వచ్చి ఆ టిడిపి నేత ఇంటిపై పడ్డారని.. అందులో ఎంత మాత్రం తప్పు లేదని తేల్చేశారు. ఇప్పుడు మాజీ మంత్రి అంబటి రాంబాబు మీడియా సమక్షంలో, పోలీసుల సమక్షంలో చంద్రబాబుపై బూతు పదం ప్రయోగించారు. ఇప్పుడు కూడా బీపీ వచ్చింది అని చంద్రబాబు ప్రకటించలేదు. ఎంతవరకు ఆయన సంయమనం పాటించమని పార్టీ శ్రేణులను కోరేరే తప్ప ఇలా సమర్థించలేదు. అయితే తాజా పరిణామాలతో జగన్ వైఖరిని మరోసారి ప్రజల ముందు ఉంచుతోంది సోషల్ మీడియా. అయితే ఈ ఘటనతో పొలిటికల్ సెంటిమెంటు రగిలించాలని వైసీపీ భావించింది. కానీ దానికి ఎంత మాత్రం ప్రజలు అవకాశం ఇవ్వడం లేదు.మొన్నటికి మొన్న కల్తీ మద్యం వ్యవహారం జరిగింది. ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చేలా వైసీపీ నేతలే ప్లాన్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ప్రధానంగా మాజీ మంత్రి జోగి రమేష్ పేరు బయటకు వచ్చింది. ఈ కుట్రలో ఆయన భాగస్వామ్యం అయ్యారని నిర్ధారణ కావడంతో కోర్టు రిమాండ్ విధించింది. ఆ కేసు విచారణ అలా కొనసాగుతుండగానే ఆయన బెయిల్ పై బయటకు వచ్చారు. ఇప్పుడు అదే నేత నిత్యం లోకేష్ పై విరుచుకు పడుతూనే ఉన్నారు. అంబటి రాంబాబు కంటే దారుణంగా వ్యాఖ్యానాలు చేశారు. అయితే జోగి రమేష్ ఇంటి పై దాడి జరిగింది. కానీ ప్రజల నుంచి మాత్రం సానుభూతి లభించడం లేదు. అంబటి రాంబాబు ఇంటిపై దాడి విషయంలో కూడా ప్రజలు లైట్ తీసుకుంటున్నారు. ఎందుకంటే ఆ ఇద్దరు నేతలు అత్యంత వివాదాస్పదులే. ఈ ఘటనల ద్వారా వైసీపీ రాజకీయ లబ్ధి పొందాలనుకోవడం అంటే అంతకంటే మూర్ఖత్వం ఉండదు. వారి వల్ల మరింత చెడ్డ పేరు వస్తుందే కానీ.. ప్రజలు మాత్రం గుర్తించే ఛాన్స్ లేదు. దానిని జగన్ గుర్తించడం లేదు.ఏదైనా ప్రజా సమస్యలపై పోరాటం చేయవచ్చు కదా. సీనియర్ నేతలను ముందు పెట్టి ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించవచ్చు కదా? అయితే దానిని వదిలేసి ఇలా అంబటి రాంబాబు, జోగి రమేష్ లాంటి వారితో రాజకీయాలు చేయాలనుకోవడం మూర్ఖత్వమేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రజలు ఇటువంటి వారితో రాజకీయం చేస్తామంటే హర్షించరంటున్నారు. ఎందుకంటే రాజకీయాల్లో వీరు వ్యవహరించిన తీరు తెలిసినదే. అధికారంలో ఉన్నప్పుడు వీరు ఎంతలా తెగించి, దూకుడుగా వ్యవహరించారో తెలియనిది కాదు. అటువంటివారితో రాజకీయాలు చేయడం ఎంత మాత్రం సహేతుకం కాదని పార్టీలో సీనియర్ నేతలు సైతం అభిప్రాయ పడుతున్నారు. కానీ జగన్మోహన్ రెడ్డి వారిద్దరిపై ఆధారపడి, ఆ రెండు ఘటనలపై పోరాటం ప్రారంభించడం అనేది నిజంగా సాహసమే.




# ఎస్సీ బాయ్స్ హాస్టల్ ముందు సీసీ రోడ్ మంజూరు హర్షణీయం

## ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కు ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ కృతజ్ఞతలు



**మైలర్ దేవ్ పల్లి ఫిబ్రవరి 4 ( వార్త వేదిక సూర్య ) :** రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని మాణిక్యమ కాలనీలో ఉన్న ఎస్సీ బాయ్స్ హాస్టల్ ముందు సీసీ రోడ్ నిర్మాణానికి శాంక్షన్ మంజూరు చేసిన సంద ర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కు ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు మర్యాదపూర్వకంగా కలసి కృత జ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రంగారెడ్డి జిల్లా సీనియర్ నాయకులు బండి నరసింహ, తెలంగాణ సమాచార హక్కు చట్టం రాష్ట్ర చైర్మన్ దేశాల భూపాల్, కన్నయ్య, జీహెచ్ఎంసీ వర్క్ ఇన్స్పెక్టర్తో పాటు ఇతరులు ఎమ్మెల్యేను కలిసి హర్షం వ్యక్తం చేశారు.ఈ రోడ్డు నిర్మాణంతో హాస్టల్లో నివసిస్తున్న విద్యార్థులు, స్థానిక ప్రజలకు రాక పోకల ఇబ్బందులు తొలగి మౌలిక వసతులు మెరుగుప డతా యని నాయకులు తెలిపారు. అభివృద్ధిపనులకు ఎల్ల ప్పుడూ సహకరిస్తున్న ఎమ్మెల్యేకు వారు ప్రత్యే కంగా ధన్యవాదాలు తెలియజేశారు.

# ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ విస్తృత పర్యటన

## బస్తీల సమస్యలపై క్షేత్రస్థాయి పరిశీలన –అధికారులకు స్పష్టమైన ఆదేశాలు

**మైలర్ దేవ్ పల్లి ఫిబ్రవరి 4 ( వార్త వేదిక సూర్య):** రాజేంద్రనగర్ నియోజకవర్గం అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని కాటేడాన్ డివిజన్లో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ బుధవారం విస్తృతంగా పర్యటించారు. ఈ సంద ర్భంగా శ్రీరామ్ నగర్ కాలనీ, వెంకటేశ్వర నగర్, నేతాజీ నగర్ బస్తీలలో పర్యటించి స్థానిక ప్రజలను నేరుగా కలిసి వారి సమస్యలను అడిగి తెలుసు కున్నారు.ఈ పర్యటనలో ఎమ్మెల్యే వెంట మున్సిపల్ (జీహెచ్ఎంసీ) మరియు వాటర్ వర్క్స్ అధికారులు పాల్గొన్నారు. బస్తీల్లో నెలకొన్న సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఎమ్మెల్యే, అక్కడి కక్కడే అధికారులకు తగిన సూచనలు చేశారు. ముఖ్యంగా బస్తీల్లో మురుగు నీరు నిలిచిపోకుండా డ్రైనేజీ పైప్లైన్ల మరమ్మతులు వెంటనే చేపట్టాలని ఆదేశించారు.

వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని వెంకటేశ్వర నగర్, నేతాజీ నగర్ ప్రాంతాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా క్రమబద్ధంగా మంచినీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకో వాలని వాటర్ వర్క్స్ అధికారులకు సూచించారు. అలాగే పాడైపోయిన అంతర్గత రోడ్లకు వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేసి, అవసరమైన నిధులు మంజూరు చేయి స్తామని బస్తీ వాసులకు హామీ ఇచ్చారు.ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ,"ప్రజల ముంగిటకే పాలన అందించడమే మా లక్ష్యం. బస్తీల్లో మౌలిక సదుపాయాల కల్పనలో ఎలాంటి అలసత్వం వహించవద్దని అధికారులను ఆదేశించాను. శ్రీరామ్ నగర్, వెంకటేశ్వర నగర్, నేతాజీ నగర్ ప్రాంతాలను ఆదర్శ బస్తీలుగా తీర్చిది ద్దుతాం" అని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికా రులు, వాటర్ వర్క్స్ ఏఈలు, డివిజన్ అధ్యక్షుడు ఎన్. ధనుంజయ్, టి. ప్రేమ్ గౌడ్, కృష్ణ గౌడ్, మాధవ రెడ్డి, సుధాకర్ గౌడ్, దత్తు, జైపాల్ స్వామి గౌడ్, తిరుమల వెంకటేష్ గౌడ్, సోమా శ్రీనివాస్, కుమార్ యాదవ్, డాక్టర్ కృష్ణ గోపి, శ్రీనివాస్ గుప్తా, చారి బాబురావు, కిట్టు, నారాయణ, శివబాషా, శ్రీను, మహేష్ గౌడ్, భీమేష్ రెడ్డి,అంజయ్య, మల్లేష్, లక్ష్మారెడ్డి, బొల్లా వెంకటేష్, సురేష్, రాము, అనిల్, జగదీష్, రంగయ్య, ప్రభాకర్ గౌడ్, విజయ్, పవన్ తదితర పార్టీ ముఖ్య నాయకులు మరియు బస్తీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు





# ముందస్తు గుర్తింపుతో క్యాన్సర్ను జయించవచ్చు

## రంగారెడ్డి డీఎంహెచ్ వో డాక్టర్ లలితా దేవి • మనసురాబాద్ పీహెచ్ సీలో ప్రపంచ క్యాన్సర్ డే

**మైలర్ దేవ్ పల్లి ఫిబ్రవరి 4 ( వార్త వేదిక సూర్య ):** మనసురాబాద్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ప్రపంచ క్యాన్సర్ డే సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథు లుగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ లలిత దేవి, అదనపు జిల్లా వైద్య అధికారి డాక్టర్ పాపారావు హాజర య్యారు.ఈ సందర్భంగా క్యాన్సర్పై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహిం చారు. క్యాన్సర్ నివారణ, ముందస్తు గుర్తింపు, చికిత్సపై ప్రజల్లో చైతన్యం తీసుకు వచ్చే ఉద్దేశంతో అవగాహన ర్యాలీ నిర్వహిం చారు. ఈ ర్యాలీలో వైద్య సిబ్బంది, ఆశా కార్య కర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య అధికారి డాక్టర్ లలిత దేవి మాట్లా డుతూ,"క్యాన్సర్ అనేది ముందస్తుగా గుర్తిస్తే పూర్తిగా నియంత్రించ గల వ్యాధి. ఆరోగ్యకరమైన జీవనశైలి అలవ ర్చుకోవడం, పొగాకు, మద్యానికి దూరంగా




ఉండటం ద్వారా క్యాన్సర్ను నివారించవచ్చు. మహిళలు బ్రెస్ట్, సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలి. ప్రభుత్వ ఆసుప త్రుల్లో ఉచితంగా అందిస్తున్న సేవలను ప్రజలు వినియోగించుకోవాలి" అని తెలిపారు.

అదనపు జిల్లా వైద్య అధికారి డాక్టర్ పాపారావు మాట్లాడుతూ, క్యాన్సర్పై భయప డకుండా అవగాహన కలిగి ఉండాలని, లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.ఈ కార్యక్ర మంలో డాక్టర్ రాకేష్ (ప్రోగ్రాం ఆఫీసర్), డాక్టర్ అయేషా (డీపీపీఎం), విల్సన్ విజయ కుమార్ (డీపీస్), శ్రీనివాసులు (ఎక్స్రే డిపార్ట్మెంట్), శ్రీనివాసరెడ్డి, ఆశా వర్కర్స్ టీం తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీకి జిల్లా ఉపాధ్యక్షుడు రాజీనామా

**వికారాబాద్ ఫిబ్రవరి 4, వార్త వేదిక సూర్య :** వికారాబాద్ జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు గోరేపల్లి సుదర్శన్ గౌడ్ పార్టీకి రాజీనామా చేసారు. పార్టీ తనకు అన్యాయం చేసిందంటూ కన్నీటి పర్యంతం అయ్యారు. గతంలో తాండూర్ పట్టణ అధ్యక్షునిగా సుదర్శన్ గౌడ్ కొనసాగారు. పట్టణంలోని 28వ వార్డు నుంచి తన భార్యను కౌన్సిలర్ గా పోటీ చేసేందుకు నామినేషన్ దాఖలు చేసారు, పార్టీ బీఫామ్ ఇవ్వకపోవ డంతో పార్టీకి రాజీనామా చేసారు. అదే వార్డు నుంచి తాండూర్ పట్టణ అధ్యక్షుడైన నాగారం మల్లేశంకు టికెట్ కేటాయించారు. నగరం మల్లేశం కోట్ పల్లి మండలం కొత్తపల్లిలో సర్పంచ్. ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్నారని అతనికి పార్టీ బి ఫామ్ ఇవ్వడంపై సుదర్శన్ ఆగ్రహం వ్యక్తం చేసారు. ఒక దగ్గర ఓటు హక్కు వినియోగించుకొని మరో దగ్గర పోటీ చేయడంపై అధికారులకు ఫిర్యాదు చేశారు. జిల్లాలో జరిగే పరిణామాలపై రాష్ట్రస్థాయి నేతలు దృష్టి పెట్టాలి . పార్టీకి ఎంతోకాలంగా సేవ చేశా.. పార్టీ తనకు అన్యాయం చేసిందంటూ ఆవేదన చెందారు.

# ప్రభుత్వ ఆస్పత్రి పనుల తనిఖీ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్

**సికింద్రాబాద్, ఫిబ్రవరి 4(వార్త వేదిక సూర్య ):** సికింద్రాబాద్ పరిధిలో అతిపెద్ద ప్రభుత్వ ఆసుపత్రిగా తీర్చిదిద్దటమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ అన్నారు. బుధవారం సీతాఫల్మండిలో నిర్మిస్తున్న కుట్టి వెల్లోడి ఆసుపత్రి పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... స్థానికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పనులను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశించారు. ఆయనతో పాటు కార్పొరేటర్లు డాక్టర్ హేమ సామల, కంది శైలజ, నాయకులు రాజసుందర్ ఉన్నారు.



# బీజేపీ చీఫ్ నితిన్ నబిన్ కు కార్పొరేటర్ 'కొంతం' ఘన స్వాగతం



**సికింద్రాబాద్ ఫిబ్రవరి 4(వార్త వేదిక సూర్య ):** ఇటీవల బీజేపీ జాతీయ నూతన అధ్యక్షుడు గా నితిన్ నబిన్ ఎన్నికైన సందర్భంగా బుధవారం మోండా మార్కెట్ డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక నరేష్ అధ్వర్యంలో శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకొని ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ అధ్యక్షులు జితూగుప్తా, ప్రశాంత్ జైన్, సీనియర్ నాయకులు వీరయ్య, సత్యనారాయణ కమిటీ సభ్యులు సుభాష్, భరత్, రాహుల్ యాదవ్, నర్సింగ్, విశాల్, సాయి, రాహుల్, గణేష్, రఘు, హరి, గోవర్ధన్, మహిళ ప్రెసిడెంట్ భాగ్యలక్ష్మి, సంగీత, జ్యోతి, మాధవి, చంద్రకళ, కావ్య, సరిత, స్వాతి, మమత, లక్ష్మి, కోటమ్మ, రేణుక, సునీత, తదితరులు పాల్గొన్నారు.

# అసంపూర్తి ఆట పరికరాలతో ప్రాణాలకు ముప్పు

## పీవీ నరసింహారావు పార్కును పరిశీలించిన బీఆర్ఎస్ నేతలు

**మైలర్ దేవ్ పల్లి ఫిబ్రవరి 4 ( వార్త వేదిక సూర్య ) :** భారత రాష్ట్ర సమితి స్థానిక నాయకులు చేపట్టిన "మీ సమస్య – మా బాధ్యత, ప్రజలతో – ప్రజల కోసం" కార్యక్రమంలో భాగంగా బుధవారం పుప్పాలగూడ బాలాజీ నగర్లోని పి.వి. నరసింహారావు పార్కు పరిసర ప్రాంతాల్లో విస్తృత పర్యవేక్షణ నిర్వహించా రు.ఈ సందర్భంగా పార్కులో ఏర్పాటు చేసిన ఆట పరికరాలు అసంపూర్తిగా ఉండటంతో పాటు, అవి నిలబడేందుకు సరైన పునాది లేకుండా రాళ్లను పేర్చడం, కనీసం ఇసుక కూడా వేయకపోవడం వల్ల చిన్నారులు, వయోజనులు తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.



ఈ నిర్లక్ష్యం మునిసి పల్ అధికారుల ఘన తగా మారిందని బీఆర్ఎస్ నాయ కులు విమర్శించారు. సంబంధిత కాంట్రా క్టర్పై చట్టరీత్యా చర్య లు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ అంశంపై ఇప్పటివ రకు 370 మంది స్థానికులు సంతకాలు చేసి వినతిపత్రం సమర్పించినప్పటికీ అధి కారుల నుంచి స్పందన లేకపోవడం బాధాకరమని వారు వాపోయారు. పార్కు లోపల చుట్టూతా ఉన్న రాళ్లు, రప్పలను తొలగించి చెట్లు నాటి సుందరీకరణ చేయాలని కోరారు.అదేవిధంగా కే.పి.ఆర్ కాలనీ, బాలాజీ నగర్ తదితర ప్రాంతాల్లో కుక్కల బెడద తీవ్రంగా ఉందని, దీంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని తెలిపారు. ప్రజా సౌకర్యార్థం సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమగ్ర పరిశీలన చేపట్టి అవసరమైన పనులు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ స్థానిక అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ, వర్కింగ్ ప్రెసిడెంట్ కుంబగళ్ళ ధనరాజ్, ముఖ్య కార్యదర్శి గుట్టమీది నరేందర్, మహిళా అధ్యక్షురాలు రూపా రెడ్డి, ఉపాధ్యక్షుడు అందె లక్ష్మణ్ రావు, ఎస్సీ విభాగం అధ్యక్షుడు యాలల కిరణ్, సోషల్ మీడియా కార్యదర్శి సుమనలిని, క్రీడా విభాగం అధ్యక్షుడు భాను, క్రిస్టియన్ మైనారిటీ అధ్యక్షుడు జయరామ్, అలాగే నాయకులు బాబురావు, రఫిక్, సాగర్, హిరు సింగ్, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల హక్కులను కాలరాస్తున్న మోదీ సర్కార్

- లేబర్ కోడ్ల రద్దు కోసం ఉద్యమాలు ఉధృతం చేస్తాం
- ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ కే. ఏసురత్నం హెచ్చరిక

**మైలర్ దేవ్ పల్లి ఫిబ్రవరి 04 ( వార్త వేదిక సూర్య ) :** కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లు కార్మికుల శ్రమ దోపిడీకి చట్టబద్ధత కల్పించేందుకేనని తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ కే. ఏసురత్నం తీవ్ర స్థాయిలో విమర్శించారు. కార్మికుల ఉద్యోగ భద్రతను హరించి, యజమానులు, పెట్టుబడిదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించేలా చేయడమే ఈ లేబర్ కోడ్ల అసలు ఉద్దేశమని ఆయన ఆరోపించారు.రాజేంద్రనగర్ మండలం శాస్త్రీపురం పరిధిలో రంగారెడ్డి జిల్లా మున్సిపల్ సంఘం (ఏఐటీయూసీ) ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో లేబర్ కోడ్ల రద్దు కోసం నిర్వహించిన కార్మికుల అవగాహన సమావేశానికి కే. ఏసురత్నం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారతదేశంలోని కార్మికులు ప్రాణత్యాగాలు చేసి, రక్తం దార పోసి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్లను తీసుకురావడం ద్వారా కార్మికులను కట్టుబానిసలుగా మార్చే కుట్ర జరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.లేబర్ కోడ్లు అమల్లోకి వస్తే ఉద్యోగ భద్రత, జీతాల పెంపు, ఎనిమిది గంటల పని విధానం, కార్మిక హక్కుల రక్షణ అన్నీ గాలికి కొట్టుకుపోయినట్టేనని హెచ్చరించారు.

ఈ చట్టాలు దేశంలోని కార్మికులకు కాకుండా ఆదాని, అంబానీ వంటి బడా కార్పొరేట్ సంస్థలు, పెద్ద ఆర్థిక నేరగాళ్లకు లాభపడేలా రూపొందించబడ్డాయని ఆరోపించారు. దీని వల్ల కార్మికులు, మధ్యతరగతి ప్రజల కొనుగోలు శక్తి తగ్గి దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింటుందని అన్నారు.దేశంలో రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు వ్యాపారాల్లోకి దిగిన తర్వాతే ఇటువంటి కార్మిక వ్యతిరేక చట్టాలు పుట్టుకొస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. లేబర్ కోడ్లను వెంటనే రద్దు




చేసే వరకు కార్మిక వర్గం చేపట్టే ఉద్యమాలు ఆగవని, అవసరమైతే పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఫిబ్రవరి 12న దేశవ్యాప్తంగా జరగనున్న సార్వత్రిక సమ్మెను కార్మికులందరూ ఏకమై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా మున్సిపల్ సంఘం ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం ఒకే పని చేస్తున్న కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వా లని పలుమార్లు స్పష్టం చేసినప్పటికీ, ప్రభుత్వాలు అమలు చేయకపోవడం దారుణమని అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులందరినీ వెంటనే పర్మనెంట్ చేయాలని డిమాం డ్ చేశారు. విధులు నిర్వహిస్తున్న సమయంలో ప్రమాదాలకు గురై కార్మికులు మరణిస్తే, వారి కుటుంబాలకు రూ.కోటి ఇన్సూరెన్స్ పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్వాతంత్ర్యానికి ముందు, తర్వాత కార్మికులు సాధించుకున్న చట్టాలను రద్దు చేయడం అంటే స్వాతంత్ర్య సమరయోధులను అవమానపరచడమేనని తీవ్రంగా మండిపడ్డారు.సంఘటిత, అసంఘటిత రంగాలకు చెందిన కార్మికులంతా పెద్ద ఎత్తున సమ్మెలో పాల్గొని ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ మండల ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి టి. ఆనంద్, శ్రీకాంత్, విక్రం, అరుణ్ కుమార్, నర్సింగ్ రావు, జంగయ్య, లక్ష్మమ్మ, సునీత తదితర నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

# కార్పొరేటర్ డాక్టర్ హేమ సామల పర్యటన

## డివిజన్లో అభివృద్ధి పనుల పరిశీలన

**సికింద్రాబాద్, ఫిబ్రవరి 4,(వార్త వేదిక సూర్య) :** డివిజన్ లోని పలు ప్రాంతాల్లో కార్పొరేటర్ డాక్టర్ హేమ సామల విస్తృతంగా పర్యటించి జరుగుతున్న అభివృద్ధి పనులను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ముందుగా డివిజన్లోని వీరయ్య గల్లిలో చేపడుతున్న సీసీ రోడ్ పనులను పరిశీలిం చారు,దాదాపు 48 లక్షల వ్యయంతో సీసీ రోడ్ పనులు చేపట్టినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీసీ రోడ్ పనులను నిర్ణీత గడువులోగా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశిం చారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, భవిష్యత్తులో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పనులు పకడ్బందీగా జర గాలని సూచించారు. ప్రజల సౌకర్యం దృష్టిలో పెట్టుకుని పనులు వేగవంతం చేయాలని తెలిపారు. అనంతరం మధుర నగర్లో నిర్మాణంలో ఉన్న కమ్యూనిటీ హాల్ రెండవ అంతస్తు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ కమ్యూనిటీ హాల్ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉండనున్న దని, కావున పనులు నాణ్యతతో పాటు నిర్ణీత కాల వ్యవధిలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు ఈ పనులను దాదాపు 47. 50 లక్షల వ్యయంతోనిర్మిస్తు న్నట్లు తెలిపారు.



ఆ తరువాత ఎస్.ఆర్. హాస్పిటల్ వెనుక గ ల్లీలో డ్రైనేజీ ఓవర్ఫ్లో సమస్య ఉందని స్థానికులు కార్పొరేటర్ డాక్టర్ సామల హేమ దృష్టికి తీసుకురావడంతో, ఆమె వెంటనే స్పందించి జలమండలి అధికారులతో కలిసి అక్కడ పర్యటిం చారు. డ్రైనేజీ ఓవర్ఫ్లోకి గల కారణాలను పరిశీలించి తెలుసుకుని, సమస్యను తక్షణమే పరిష్కరించేలా అవ సరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారు లను ఆదేశించారు. ప్రజలకు ఆరోగ్య సమస్యలు తలె త్తకుండా శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకో వాలని ఆమె స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జి హెచ్ ఎం సి ఏ ఈ వేణు, జలమండలి మేనేజర్ నవ్య,బి అర్ ఎస్ నాయకులు శైలెందర్,బాలా జీ,అక్రమ స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా న్యాయవాది దారుణ హత్య

**రంగారెడ్డి ఫిబ్రవరి 4,(వార్త వేదిక సూర్య):** మొయినాబాద్ శివారులోని పొలం వద్ద చేవెళ్ల కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న మహిళా న్యాయవాది స్వప్నను గుర్తు తెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేసారు. న్యాయవాది హత్య కేసులో పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ మొయినాబాద్ పోలీస్ స్టేషన్ ముందు న్యాయవాదులు ధర్నాకు దిగారు. ఈ నేపథ్యంలో బీజాపూర్ హైవే పై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. హత్య చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని న్యాయవాదుల డిమాండ్

# పాత కక్ష్యల నేపథ్యంలో బాబాయ్ హత్య

**వికారాబాద్ ఫిబ్రవరి 4,(వార్త వేదిక సూర్య) :** వికారాబాద్ జిల్లా ధరూర్ మండల కేంద్రంలో పట్టపగలే నడిరోడ్డుపై ఓ వ్యక్తి దారుణ హత్యకు గురైయ్యాడు.హత్య చేసిన నిందితుడు దారూర్ పోలీస్ స్టేషన్ లో లొంగిపోయాడు. హత్యకు గురైన వ్యక్తి దారూర్ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన శంకర్ గా గుర్తించారు స్థానికులు. గతంలో భూ వివాదంలో ఉన్న పాత కక్ష్యల కారణంతో సోంత అన్న కొడుకే బాబాయ్ ని హత్య చేసాడని చెప్తున్నారు గ్రామస్తులు. దారూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

# యువ న్యాయవాది స్వన్న దారుణ హత్య

భూ తగాదాలతో చెల్లెలిని చంపిన అన్న
మొయినాబాద్ పోలీస్ స్టేషన్లో న్యాయవాది స్వప్నకు నివాళులు
దురుసుగా పోలీసులు ప్రవర్తించడంతో రోడ్డెక్కిన న్యాయవాదులు
డిజిపి నచ్చజెప్పడంతో సద్దుమనిగిన ఆందోళన





**మొయినాబాద్ మున్సిపాలిటీ ఫిబ్రవరి 04 (వార్త వేదిక సూర్య) :** భూ వివాదంలో సొంత చెల్లెలిని తలపై రాయితో మోది, కత్తితో గొంతుకోసిన సంఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కేతిరెడ్డిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే .. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం కేతిరెడ్డినల్లి గ్రామానికి చెందిన గోటికి స్వవ (14) యువ న్యాయవాది బుధవారం దాయణ హత్యకు గురింది. భూతగాదాల్లో అన్న చెల్లెలి కి నడుస్తున్న గోడవలో భాగంగా బుధవారం ఉదయం 9 గంటలకు తల్లి వెంకటమ్మతో కలిసి స్వన్న వ్యవసాయ పొలాన్ని ప్రైవేటు సర్వే నిర్వహించేందుకు అక్కడికి వెళ్లారు. దీంతో స్వన్న అన్న గోటికే రాజా (44) మరొకరితో కలిసిన థకం ప్రకారం సర్వే నిర్వహిస్తున్న సమయంలో చెల్లెలి తలపై రాయితో మోదీ కత్తితో గొంతు కోశారు. దీంతో చుట్టు నక్కల వారు పోలీసులకు సమాచారం అందించడంతో వెం టనే పోలీసులు గాయపడిన స్వన్నను భాస్కర అనువత్రికి తంలించారు. అన్పటికే ఆమె మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ఈ సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు కేతిరెడ్డినల్లి గ్రామంలో కీర్తిశేషులు సత్తయ్య ఆయనకు ఇద్దరు భార్యలు. మొదటి థార్య మల్లమ్మ. ఆమెకు సంతానం లేకపోవడంతో రెండవ భార్య వెంకటమ్మను మరో వివాహం చేసుకున్నాడు. వెంకటమ్మకు ఒక కుమారుడు రాజా, ఇద్దరు కూతుళ్లు సంస్వతి, స్వప్నలు. సంస్వతి వివాహం కాగా, స్వన్న వివాహం నెల రోజుల్లో జరగనుంది. వెంకటమ్మకు పది ఎకరాల భూమి ఉంది. ఈ పది ఎకరాలలో రాజాకు ఆరు ఎకరాలు, స్వన్నకు నాలుగు ఎకరాలు అన్నట్లో గ్రామపంచాయతిలో తీర్మాణం చేశారు. దీంతో బుధవారు ప్రైవేటు సర్వేయర్తో భూమి కొలిచేందుకు తల్లి వెంకటమ్మతో కలిసి స్వన్న వెల్లింది. అక్కడ ఉన్న రాజా, మనో వ్యక్తితో కలిసి చెల్లెలి తలపై రాయితో కొట్టే వెంట తెచ్చుకున్న కత్తితో గొంతు కోశారు. అక్కడ నుంచి నిందితులువరారైనట్లు తెలిపారు. దీంతో స్వన్నను ఆసుపత్రికి తరలించారు .

**న్యాయవాదుల ఆందోళన...**

కేతిరెడ్డినల్లి గ్రామంలో దారుణ హత్యకు గురైన జానియర్ న్యాయవాది స్వన్న హత్య విషయంలో మొయినాబాద్ పోలీస్ స్టేషన్లో వివరాలు తెలుసుకునేందుకు కొందరు చేవెళ్ల కోర్టు న్యాయవాదులు పోలీసులను సంప్రదించారు. దీంతో పోలీసులు న్యాయవాదులుగా చూడకుండా దురుసుగా ప్రవర్తించారని ఆవేధనకు గురై పోలీస్ స్టేషన్ ముందు రహదారిపై ఆందోళన చేన ట్టారు. జాతీయ రహదారి కావడంతో కొద్దిసేవు ట్రాఫిక్ స్తంభించింది. దీంతో డిసి యోగేష్ గౌతమ్ న్యాయవాదులతో మాట్లాడే అందోళన సభమగించారు. అనంతరు న్యాయవాదులు దురుసుగా ప్రవర్తించి పోలీసులపై చర్యలు తీసుకోవాలని డీసీకి ఫిర్యాదు చేశారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో హైకోర్టు న్యాయవాదులు రఘునాథ్, ఆకుల మహేష్ కుమార్, చేవెళ్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షులు మహీష్ గౌడ్లు మాట్లాడుతూ యువ న్యాయవాది స్వన్న దారయణంగా హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని వీర్కొన్నారు. న్యాయవాదులకే ఇలా జరిగితే మామూలు వ్యక్తులకు ఎలా ఉంటుందో ప్ర భుత్వం ఆలోచించాలని పేర్కొన్నారు. అదే విధంగా మొయినాబాద్ పోలీస్ స్టేషన్లో స్వన్న హత్య విషయాన్ని తెలుసుకునేందుకు వచ్చిన న్యాయవాదులపై దుసుగా ప్రవర్తించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని ఇలాంటివి మరో చోట జంగకుండా రాష్ట్ర ప్రభుత్వం చూడాలని పేర్కొన్నారు. స్వన్న మృతి చెందడంతో ఆమెకు నివాళులు అర్పించారు.




# పోలింగ్ సిబ్బందికి ర్యాండ మైజేషన్ నిర్వహణ



**(యాదాద్రి భువనగిరి బ్యూరో ) ఫిబ్రవరి 4 వార్తా వేదిక సూర్య :** మున్సిపాలిటీ వార్డు ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా పోలింగ్ సిబ్బంది కి ర్యాండమైజేషన్ ప్రక్రియను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, సాధారణ పరిశీలకులు గౌతమి, సమక్షంలో నిర్వహించారు. బుధవారం లో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ ర్యాండమైజేషన్ జరిపించారు. ఈ ప్రక్రియను అదనపు కలెక్టర్, సాధారణ పరిశీలకులు నిశితంగా పరిశీలించారు. జిల్లాలోని భువనగిరి, ఆలేరు, యాదగిరిగుట్ట, పోచంపల్లి, చౌటుప్పల్, మోత్కూర్ మున్సిపాలిటీ లలో వార్డుల ఎన్నికల పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు , ఇతర పోలింగ్ అధికారులు ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. జిల్లాలోని 104 వార్డు స్థానాలకు, ఎన్నికల నిర్వహణ కోసం 20 శాతం రిజర్వ్ స్టాఫ్ కలుపుకుని ప్రిసైడింగ్ అధికారులు 257, అసిస్టెంట్.పీ.ఓలు 257, ఇతర పోలింగ్ అధికారులు 514 పోలింగ్ కోసం ర్యాండమైజేషన్ జరిపారు. ఈ ర్యాండమైజేషన్ ప్రక్రియలో జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# శివగంగ ఆలయ చైర్మన్ ఆల్లె కుమార్ కి జన్మదిన శుభాకాంక్షలు

**కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కాకి ఈశ్వర్ ముదిరాజ్**



**మహేశ్వరం ఫిబ్రవరి 4 వార్త వేదిక సూర్య :** మహేశ్వరం మండల కేంద్రంలో శివగంగ ఆలయ కమిటీ చైర్మన్ అల్లే కుమార్,47వ పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాకి ఈశ్వర్ ముదిరాజ్. కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ నియోజకవర్గం అధ్యక్షుడు గడగుటి హరికృష్ణ ముదిరాజ్. కాంగ్రెస్ పార్టీ మైనార్టీ డిపార్ట్మెంట్ మహేశ్వరం మండలం చైర్మన్ మొహమ్మద్ ఇర్షాద్. మహేశ్వరం ముస్లిం వెల్ఫేర్ సొసైటీ మండల అధ్యక్షులు షేక్ హాజీ బాబా. కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం మండల్ యూత్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ నడి కూడా రాకేష్ ముదిరాజ్. మహేశ్వరం వ్యాపార సముదాయాల సంఘం అధ్యక్షులు ఒగ్గు శ్రీశైలం. మహేశ్వరం హెల్త్ యూనియన్ అధ్యక్షులు డాక్టర్ పాండురంగయ్య. శివగంగ ఆలయ కమిటీ డైరెక్టర్ కనిగట్ల శ్రీశైలం. మహేశ్వరం వ్యాపార సముదాయ సంఘం ఉపకోశాధికారి కడమోని బాలయ్య. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తిరుపతయ్య యాదవ్. గట్టుపల్లి గ్రామ మాజీ ఉపసర్పంచ్ కృష్ణా నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఇష్టంతో చదవాలి

**సైకాలజిస్ట్ అచ్చుత్ రాజ్**



**నారాయణ పేట,(వార్త వేధిక సూర్య ):** బుధవారం నారాయణ పేట జిల్లా, కంసాన్ పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థి విజ్ఞాన వేదిక మరియు మూఢనమ్మకాల నిర్మూలన సంఘం ఆధ్వర్యంలో విద్యార్థి చైతన్య సదస్సు జరిగింది. జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగాప్రముఖ సైకాలజిస్ట్ అచ్చుత్ రాజ్ పాల్గొన్నారు . ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టంతో చదవాలి అన్నారు. ప్రతి మనిషి జీవితంలో "అవసరం మరియు ఆసక్తి" అనే రెండు విషయాలు ఎంతో ముఖ్యమైనవి అన్నారు. ఏది అవసరం ఏది ఆసక్తి అనేది గ్రహించాలి అన్నారు. అవసరం గూర్చి మొదట ఆలోచించాలని అలాగే వివిధ అంశాలపై ఆసక్తితో సృజనాత్మకతను పెంచుకోవాలి అన్నారు . అందరికీ మెదడు సమానంగా ఉంటుందని దానిని ఉపయోగించు కోవడంలో తేడా ఉంటుంది అన్నారు. మెదడు అనే భూమిలో మంచి ఆలోచనలు అనే మొక్కలు నాటితే మంచి పూలు పూసి, మంచి కాయలు కాస్తాయని, లేదంటే నిరుపయోగమైన విషయాలు వైపు మెదడు ఆలోచిస్తుంది.

భవిష్యత్ లో గొప్పగా ఉండాలి అనుకుంటే బాల్యం లోనే గొప్ప అలవాట్లు చేసుకోవాలని సూచించారు. ఎటువంటి చెడుకు ఆస్కారం ఇవ్వకుండా అమ్మ నాన్న లని అర్థం చేసుకోవాలని, బాల్యంలోనే విలువలు అలవర్చుకోవాలి, గురువులను గౌరవిస్తూ క్రమశిక్షణగా ఉండాలని తెలిపారు. ఏదైనా అర్థం కాకపోతే అడిగి తెలుసుకోవాలని భయపడకూడదు అన్నారు.అనంతరం విద్యలు అడిగిన పలు ప్రశ్నలకు జవాబులు ఇచ్చారు. విద్యార్థులకు అనేక మెళకువలు నేర్పారు. వారిలో అనుమానాలను తొలగించి ధైర్యం నింపిన అచ్యుత్ రాజ్ గారిని ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.అనంతరం పెదిరిపాడు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో కూడా సైకాలజీ మోటివేషన్ క్లాస్ ఏర్పాటు చేయడం జరిగింది.మూఢనమ్మకాల నిర్మూలన సంఘం నారాయణపేట జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ చక్రవర్తి మాట్లాడుతూ విద్యార్థులు మూఢనమ్మకాలు వీడి విజ్ఞాన మార్గంలో నడవాలి అన్నారు. శాస్త్రీయంగా ఆలోచించాలి అన్నారు. రానున్న రోజుల్లో అన్ని ప్రభుత్వ పాఠశాలలో ఇటువంటి చైతన్య కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు . దీనిలో ఎం ఎస్ యస్ నాయకులు ,వి.వి.వి. నాయకులు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పెద్దపులి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఎస్. హెచ్.ఓ . వెంకటేశ్వర్లు

**మోత్కూరు : ఫిబ్రవరి 04 (వార్తా వేదిక సూర్య ) :** ఆత్మకూరు (ఎం ) మండలంలోని పల్లెపహాడ్, పారుపల్లి గ్రామాల పరిధిలోకి పెద్ద పులి వచ్చిందని వార్తలు వస్తున్నాయని పులి పట్ల బావుల వద్ద రైతులు,ప్రజలు జాగ్రత్తగా ఉండాలని మోత్కూరు ఎస్.హెచ్. ఓ. సి వెంకటేశ్వర్లు అన్నారు. ఆ పులి ఏ క్షణమైన మోత్కూరు పరిసర ప్రాంతాలకు రావొచ్చని బావుల దగ్గర పశువుల కాపరులు, గొర్లు ఇండ్ల వద్దనే తరలించి అటు వైపు వెళ్లకుండా మండల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఆయన బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఈ పులి ఎవరికైనా కనిపిస్తే ఫారెస్ట్ అధికారులకు, పోలీస్ అధికారులకు, 100 కాల్ చేసి సమాచారం ఇవ్వాలని ఎస్.హెచ్.ఓ. కోరారు.

## మద్దెల స్రవంతికి డాక్టరేట్



**యాదాద్రి భువనగిరి :ఫిబ్రవరి 4(వార్తా వేదిక సూర్య) :** వలిగొండ మండల పరిధిలోని వెలువర్తి గ్రామానికి చెందిన మద్దెల విజయ – నరసయ్యల కూతురు మద్దెల స్రవంతి నల్లగొండలోని నాగార్జున ప్రభుత్వ కళాశాల ఆంగ్ల విభాగంలో ఒప్పంద అధ్యాపకురాలుగా పని చేస్తున్నారు. రాజస్థాన్ కు చెందిన జగదీశ్ ప్రసాద్ జబర్మల్ తిబ్రేవాలా యూనివర్సిటీ (జెజెటియు) డాక్టరేట్ ప్రధానం చేశారు. డా. అన్షు శర్మ పర్యవేక్షణలో "ఎ క్రిటికల్ అనాలిసిస్ ఆఫ్ ఐడియాలాజీ అండ్ ఫెమినిజం ఇన్ ది వర్క్స్ ఆఫ్ సరోజినీ నాయుడు, అరుంధతి రాయ్, ప్రేమ్ చంద్ అండ్ యష్పాల్" అనే అంశంపై పరిశోధన చేసినందుకు గాను విశ్వ విద్యాలయం ఆమెకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ఎన్జీ కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సందర్భంగా నాగార్జున కళాశాల ప్రిన్సిపాల్ డా. సముద్రాల ఉపేందర్, అధ్యాపక బృందం స్రవంతిని ఘనంగా సన్మానించారు. ఆమెది యాదాద్రి జిల్లా, వలిగొండ మం, వెలువర్తి గ్రామం. ఇంటర్మీడియట్ విద్య వరకు జవహర్ నవోదయ చలకుర్తిలో, భువనగిరిలోని లక్ష్మీనరసింహస్వామి కళాశాలలో డిగ్రీ, ఉమెన్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో పిజీ పూర్తి చేశారు. 2013లో మొదట కాంట్రాక్టు అధ్యాపకురాలుగా బూర్గుల రామకృష్ణరావు డిగ్రీ కళాశాల జడ్చర్లలో ఇంగ్లీష్ అధ్యాపకురాలుగా నియామకం అయ్యారు. 2018 నుండి ఎన్జీ కళాశాల నల్గొండలో విధులు నిర్వహిస్తున్నారు. తన భర్త వలమల్ల జనార్ధన్ రామన్నపేట మండలంలో ఎస్జిటి గా విధులు నిర్వహిస్తున్నారు. డాక్టరేట్ రావడంపట్ల స్రవంతి సంతోషాన్ని వ్యక్తం చేస్తూ తన తల్లి దండ్రులు, భర్త, ఇద్దరు పిల్లలు, కుటుంబ సభ్యులు ప్రోత్సాహం ఎంతో ఉందని అన్నారు.

# సేవకుడికి వస్తున్నా.. ఆశీర్వదించండి..

**5వ , వార్డు కౌన్సిలర్ అభ్యర్థి కోక రేణుక బిక్షం**



**మోత్కూరు ఫిబ్రవరి 04 (వార్తా వేదిక సూర్య) :** గత 6 ఏళ్ల నుంచి సామాజిక సేవలో ముందున్నా నేటి మున్సిపల్ ఎన్నికల్లో ప్రజా సేవకు అంకితమౌవుతా ఒక్కసారి అవకాశం ఇస్తే 5 వార్డు అభివృద్ధి పరుస్తానని బారాస అభ్యర్థి కోక రేణుక, బిక్షం ఓటర్ మహాశయులను వేడుకుంటున్నారు. కె.బి.ఆర్. ఫౌండేషన్ పేరుతో ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించి పేద ప్రజలకు అండగా నిలిచామని పేర్కొంటున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో తమకు ఒక్కసారి ప్రజ ప్రజలు ఆశీర్వదించి గెలిపిస్తే ప్రజాసేవకే అంకితంమౌవుతానని అంటున్నారు. 5వార్డు బుజిలాపురం గ్రామ పరిధిలో ఉన్నందున ఈ గ్రామంలో సీసీ రోడ్డు డ్రైనేజీ మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేస్తానని ప్రజలకు భరోసా ఇస్తున్నారు. ఈ గ్రామానికి సుమారు 25 ఏళ్ల క్రితం గ్రామ లోపలికి ఆర్టీసీ బస్సులు వచ్చేదని నేడు ఆ బస్సులు ప్రధాన రోడ్డు కుంట వెళ్తున్నాయని, తమను గెలిపించిన మరుక్షణమే గ్రామంలోకి బస్సులు వచ్చేలా ప్రయత్నిస్తానని ఓటర్లకు అభ్యర్థిస్తున్నారు..బుధవారం నాడు ఇంటింటికి ప్రచారం నిర్వహించి ,తమను ఆశీర్వదించాలని వేడుకున్నారు.

# సిపిఎం నుండి కూరేళ్ళ నర్సింహ్మా సస్పెండ్

**మోత్కూరు ఫిబ్రవరి 04 (వార్త వేదిక సూర్య) :** మోత్కూరు మున్సిపాలిటీ 12 వ వార్డులో సిపిఎం పార్టీ నిర్ణయాలకు విరుద్ధంగా తన సతీమణి నామినేషన్ వేసి పోటీలో నిలిపిన కూరేళ్ళ నర్సింహ్మా ను సిపిఎం పార్టీ నుండి సస్పెండ్ చేస్తున్నట్లు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బొల్లు యాదగిరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మోత్కూరు మున్సిపాలిటీలో బారాసతో సీట్ల సర్దుబాటులో భాగంగా సిపిఎం పార్టీ 8వ వార్డులో కూరపాటి జయమ్మ రాములును పోటీకి నిలిపినట్లు తెలిపారు.



## ఆశీర్వదించండి... అభివృద్ధి చేస్తా

*5 వార్డ్ లో ప్రచారంలో బి ఆర్ఎస్ అభ్యర్థి బాతుక లింగస్వామి*

**భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 4 ( వార్తా వేదిక సూర్య) :** ప్రజలు ఆశీర్వదించి ఓటు వేసి గెలిపిస్తే వార్డు అభివృద్ధికి మరింతగా కృషి చేస్తానని 5వ వార్డ్ బి ఆర్ఎస్ అభ్యర్థి బాతు క లింగస్వామి అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలోని ఐదో వార్డులో ఇంటిం టి కి ప్రచార కార్యక్రమం నిర్వహించారు . గత రెండేళ్ల కాలంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన అబద్ధపు హామీలను వివరించారు. ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని , ప్రజలందరూ విజ్ఞతతో ఆలోచించి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు . ప్రచార కార్యక్రమంలో వార్డు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు . ప్రజా సేవ కోసం తన జీవితం అంకితం అని , ఈ పోటీలో ధన బలం, ప్రజా బలానికి మధ్య పోటీ జరుగుతుందని ప్రజలందరూ గమనించాలని కోరారు . ఈ కార్యక్రమంలో. వార్డ్ ఇంచార్జ్ భోగ కిరణ్, రంగ మధు, నాయకులు ఎల్లేశ, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా సేవకుడిగా పని చేస్తా

**భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 4 ( వార్త వేదిక సూర్య) :** ప్రజా సేవకే నా జీవితం అంకితం అని 12వ వార్డ్ బి ఆర్ఎస్ అభ్యర్థి గుండు మధు అన్నారు . బుధవారం పట్టణ కేంద్రంలోని 12 వ వార్డులో ఆయన ఇంటికి ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు . కారు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. తనకు ఒక్కసారి అవకాశం కల్పిస్తే , వార్డ్ అభివృద్ధికి కృషి చేస్తారని అన్నారు. వార్డులో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పాటుపడతానని అన్నారు. కెసిఆర్ పాలన ల్లో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రుద్ర శ్రీశైలం , భారత గిరి వాసు, గుండు సూర్య, వనం యశ్వంత్, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.




**మామిడి మధుసూదన్రెడ్డి ఆధ్వర్యంలో**

## మహిళా న్యాయవాది స్వప్నకు శ్రద్ధాంజలి

**మొయినాబాద్ మున్సిపాలిటీ ఫిబ్రవరి 04 (వార్త వేదిక సూర్య ):** రాజేంద్రనగర్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు మామిడి మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో మహిళా న్యాయవాది కుమారి స్వప్నకు శ్రద్ధాంజలి ఘటించడం జరిగింది, ఈ సందర్భంగా మాట్లాడుతూ వెంటనే ప్రభుత్వం స్పందించి న్యాయవాద ప్రొటెక్షన్ బిల్లు తేవాలని డిమాండ్ చేయడం జరిగింది మరియు ఇలాంటి హత్యలు జరగకుండా నిందితులను వెంటనే పట్టుకొని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేయడం జరిగింది. కార్యక్రమంలో. బార్ అసోసియేషన్ పూర్వ అధ్యక్షులు రాజేందర్ ,పాండురంగారెడ్డి, రాజుబాబు ,అమర్నాథ్ రెడ్డి, రవికాంత్ రెడ్డి సుదార్శన్ రియాజ్ పాషా మరియు అసోసియేషన్ సభ్యులు, మహిళ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాంతియుతంగా నిరసన తెలుపుతున్న న్యాయవాదుల పట్లా దురుసుగా ప్రవర్తించిన మొయినాబాద్ ఎస్సై ని విధులనుండి తొలగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది.

## అడ్వకేట్ స్వప్న మరణానికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలి

ఐలు రాష్ట్ర ఉపాధ్యక్షులుమామిడి వెంకట్ రెడ్డి డిమాండ్

**(యాదాద్రి భువనగిరి బ్యూరో) ఫిబ్రవరి 4 వార్తా వేదిక సూర్య :** అడ్వకేట్ స్వప్న మరణానికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని, న్యాయవాద రక్షణ చట్టం లేకపోవడం ద్వారానే రాష్ట్ర వ్యాప్తంగాదాడులు జరుగుతున్నాయని న్యాయవాద రక్షణ చట్టాన్ని వెంటనే ఏర్పాటు చేయాలి ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐ లు) రాష్ట్ర ఉపాధ్యక్షులు మామిడి వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు.చేవెళ్ల కోర్టు నందు అడ్వకేట్ గా ప్రాక్టీస్ చేస్తున్న స్వప్న పై వారి సోదరుడు ఆస్తి వివాదాలు విషయం లో అత్యంత కిరాతంగా దాడి చేసి ఆమే మరణం నకు కారకులైన వారిని కఠినంగా ,చట్ట పరముగా శిక్ష వేయాలి అని అల్ ఇండియా లాయర్స్ యూనియన్ (AILU ) యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ డిమాండ్ చేస్తున్నది వెంటనే తగు చర్యలు తీసుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని వారు అన్నారు. ఐలు జిల్లా గౌరవ అధ్యక్షులు కుక్కదువు సోమయ్య జిల్లా అధ్యక్షులు బొల్లేపల్లి కుమార్, ఉపాధ్యక్షులు తడక మోహన్, పాల్వంచ జగతయ్య,ఎండి నిహాల్, సహాయ కార్యదర్శి సీసా శ్రీనివాస్, సుధ గాని శ్రీహరి,చింతల రాజశేఖర్ రెడ్డి, కోశాధికారి బొడ్డు కిషన్ తదితరులు పాల్గొన్నారు.

**తొర్రూర్ మున్సిపాలిటీ 14వ వార్డులో**

# కాంగ్రెస్ ఎన్నికల ప్రచారానికి జోరు..



**తొర్రూర్, ఫిబ్రవరి 04,(వార్త వేదిక సూర్య) :** తొర్రూర్ మున్సిపాలిటీ ఎన్నికలలో భాగంగా 14వ వార్డులో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి సోమ రజిని రాజశేఖర్ గెలుపు కోసం పాలకుర్తి శాసనసభ్యురాలు యశస్విని రెడ్డి ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్లను కలిసి కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలపాలని కోరారు. ఇంటింటి ప్రచారం అనంతరం ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్లో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ..సోమ రజిని రాజశేఖర్ కాంగ్రెస్ పార్టీ కోసం అహర్నిశలు కష్టపడుతూ ప్రజల మధ్య నిత్యం అందుబాటులో ఉంటున్న నాయకుడని తెలిపారు. గత ఎన్నికల్లో స్వల్ప తేడాతో ఓటమిపాలైనప్పటికీ ప్రజాసేవ పట్ల ఆయన అంకితభావం తగ్గలేదని పేర్కొన్నారు. ఈసారి 14వ వార్డులో సోమ రజిని రాజశేఖర్ అత్యధిక మెజారిటీతో గెలిపించి ఆశీర్వదించాలని ఓటర్లను వారు కోరారు.

సోమ రజిని రాజశేఖర్ 14వ వార్డు అభ్యర్థిగా గెలుపొందితే, వార్డులో త్రాగునీరు, రహదారులు, డ్రైనేజీ, పారిశుధ్యం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తారని తెలిపారు. వార్డు అభివృద్ధి కోసం అవసరమైన అన్ని విధాల సహాయ సహకారాలను ఎమ్మెల్యేగా తాను పూర్తిగా అందిస్తానని యశస్విని రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, 14వ వార్డు అధ్యక్షులు, కార్యకర్తలు, మహిళా విభాగం, యువజన విభాగం నాయకులు, పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొని ప్రచారాన్ని విజయవంతం చేశారు. రానున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించుకుని పట్టణాభివృద్ధికి బాటలు వేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

**ఓటింగ్ ప్రక్రియకు ప్రతి అంశాన్ని**

# నిశితంగా పరిశీలించాలి

**అదనపు కలెక్టర్ భాస్కరరావు**



**(యాదాద్రి భువనగిరి బ్యూరో ) ఫిబ్రవరి 4 వార్తా వేదిక సూర్య :** ఎన్నికలలో కీలకమైన ఓటింగ్ ప్రక్రియకు సంబంధించిన ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలన జరపాలని జిల్లా స్థానిక సంస్థ ల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు మైక్రో అబ్జర్వర్లకు సూచించారు. బుధవారం మినీ మీటింగ్ హాల్ లో ఎన్నికల సంఘం నిబంధనలు తుచా తప్పకుండా పాటిస్తూ జిల్లాలోని ఆరు మున్సిపాలిటీలలో పోలింగ్ సరళిని సూక్ష్మ స్థాయిలో పరిశీలన జరిపేందుకు వీలుగా నియమించబడిన మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ కు సంబంధించిన ప్రతి అంశంపై స్పష్టమైన అవగాహన ఏర్పర్చుకోవాలని, అప్పుడే పోలింగ్ తీరుతెన్నులను నిశితంగా పరిశీలిండం జరుగుతుందని అన్నారు. ముఖ్యంగా పోలింగ్ కు ముందు రోజు డిస్ట్రిబ్యూషన్ సెంటర్ కు చేరుకొని పోలింగ్ సిబ్బందికి అందించే సామాగ్రి సక్రమంగా అందినదా లేదా అన్నది పరిశీలించాలని, అనంతరం పోలింగ్ సిబ్బందితో కలిసి పోలింగ్ స్టేషన్లకు చేరుకోవాలని సూచించారు. నిబంధనలకు అనుగుణంగా మాక్ పోలింగ్ నిర్వహించారా లేదా అన్నది పరిశీలించాలని అన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయా అని చూసుకోవాలన్నారు. పోలింగ్ ప్రారంభమైనప్పటి నుండి పూర్తయ్యేంత వరకు అన్ని అంశాలను గమనిస్తూ, ఎప్పటికప్పుడు వాటిని జనరల్ అబ్జర్వర్ దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. శిక్షణ తరగతుల్లో సూచించిన అంశాలను చక్కగా అవగాహన చేసుకుని సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని మైక్రో అబ్జర్వర్లకు సూచించారు. ఈ శిక్షణ తరగతుల లో మాస్టర్ ట్రైనర్లు నర్సిరెడ్డి, మైక్రో అబ్జర్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా కృషి చేయాలి

**మాజీ ఎమ్మెల్యే గాదారి కిషోర్ కుమార్**



**మోత్కూరు ఫిబ్రవరి 04 (వార్తా వేదిక సూర్య ) :** మున్సిపల్ ఎన్నికల్లో బారాస అభ్యర్థులను గెలుపే లక్ష్యంగా బారాస కార్యకర్తలు నాయకులు సమిష్టిగా కృషి చేయాలని తుంగతుర్తి మాజీ శాసనసభ్యులు గాదారి కిషోర్ కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం నాడు మోత్కూరు మున్సిపల్ పరిధిలోని 9,2,7,5,10 వార్డులలో బి.ఆర్.ఎస్.ముఖ్య కార్యకర్తలు, నాయకుల సమావేశంలో మున్సిపాలిటీ సమన్వయకర్త నేవూరి ధర్మేందర్ రెడ్డి తో కలిసి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చే రెండేళ్లు దాటిన మోత్కూరు మున్సిపాలిటీ అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉందన్నారు.ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన అనేక హామీలను అమలు చేయకపోవడాన్ని ప్రజలలో విస్తృతంగా తీసుకెళ్తే మున్సిపల్ పీఠం బి. ఆర్.ఎస్ .కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మదర్ డైరీ డైరెక్టర్ లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు చిప్పలపల్లి మహేందర్ నాథ్, కొణతం యాకుబ్ రెడ్డి, బారాస మండల అధ్యక్షులు పొన్నె బోయిన రమేష్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బోల్లు యాదగిరి,5వ,వార్డు అభ్యర్థి కోక రేణుక __ బిక్షం స్థానిక బారాస నాయకులు చెరుపల్లి రఘుపతి, చుక్క వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

## ధైర్యంతోనే క్యాన్సర్ జయించవచ్చు

కిచ్చన్న గారి లక్ష్మా రెడ్డి
జన్యుపర మహమ్మారిని ముందే గుర్తించాలి
కాలుష్యం, ఆహార కల్తీ పదార్థాలతో జాగ్రత్త



**మహేశ్వరం ఫిబ్రవరి 4 వార్త వేదిక సూర్య :** జీవనశైలిలో మార్పులు, ఆహార అలవాట్లు, ఇన్ఫెక్షన్లు, జన్యుపరమైన వ్యాధులతో క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉందని మహేశ్వరం నియోజకవర్గం ఇన్చార్జి, మాజీ కెమిస్ట్రీ అధ్యాపకులు కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, అన్నారు.ఇవాళ అంతర్జాతీయ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా కేఎల్ఆర్ , మాట్లాడారు. భవిష్యత్ లో చిన్న,పెద్ద తేడా లేకుండా అత్యంత ప్రమాదకరంగా క్యాన్సర్ మహమ్మారి విజృంభిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.క్యాన్సర్ లక్షణాలను ముందస్తుగా గుర్తిస్తే.. ట్రిట్ మెంట్ ద్వారా నయం చేయవచ్చన్నారు. క్యాన్సర్ బారిన పడ్డ ఎంతో మంది ప్రముఖులు సైతం ధైర్యంతో ఎదుర్కొని... ఇతర రోగులకు ఆదర్శంగా నిలిచారని లక్ష్మారెడ్డి గుర్తు చేశారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ డబ్ల్యూహెచ్వో నివేదిక ప్రకారం పర్యావరణ కాలుష్యం, ఆహార, జీవన శైలిలో మార్పుల వల్ల 37శాతం క్యాన్సర్ సంభవిస్తుందని కిచ్చెన్నగారు తెలిపారు. 5 క్యాన్సర్లు అత్యంత ప్రమాదకరంగా మారాయని... క్రమం తప్పకుండా పరీక్షలు, వ్యాయమం చేయాలని సూచించారు.పొగాకు ఉత్పత్తులు,మద్యపానం,ఆహార కల్తీకి దూరంగా ఉండాలి.

## నాకు ఒక్క అవకాశం ఇవ్వండి

**వార్డును అభివృద్ధి చేసి చూపిస్తాను**

*20వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎండి.హన్నుభాయ్*



**చౌటుప్పల్ ఫిబ్రవరి 4 వార్తా వేదిక సూర్య :** యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ మున్సిపాలిటీ 20వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఎండి. హన్ను బాయ్ ఎన్నికలలో పోటీ చేస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మునుగోడు శాసనసభ్యులు, మన ప్రియతమ నాయకులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గారి ఆశీస్సులతో మీ ముందుకు వస్తున్నాను. మన వార్డులలో ఉన్న సమస్యలను అంశాలవారీగా ప్రాధాన్యతనిస్తూ.. వార్డు అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. వార్డులలో మిగిలి ఉన్న పారిశుద్ధ్యం, త్రాగునీరు, డ్రైనేజీ, సీసీ రోడ్లకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తానని అన్నారు. ముఖ్యంగా వార్డులలో ఉన్న సమస్యలను మన ప్రియతమ నాయకులు రాజగోపాల్ రెడ్డి గారి దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను పరిష్కరిస్తానని అన్నారు. రానున్న మున్సిపాలిటీ ఎన్నికలలో 20వ వార్డు అభ్యర్థిగా మీ ముందుకు వస్తున్నాను. మీరందరూ ఆశీర్వదించి నన్ను గెలిపించగలరని కోరారు.



# చౌటుప్పల్, నారాయణపురం

# ఎన్నికల ప్రవర్తన నియమావళిని విధిగా పాటించాలి

## జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు ఎం శ్రీనివాస్, ప్రత్యేక అధికారి సురేష్, మున్సిపల్ కమిషనర్ కె సతీష్ కుమార్





**మోత్కూరు : ఫిబ్రవరి 04 (వార్తా వేదిక సూర్య) :** మున్సిపల్ ఎన్నికలలో పోటీచేసే అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తన నియమావళిని విధిగా పాటించాలని జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు ఎం శ్రీనివాస్, ప్రత్యేక అధికారి సురేష్, మున్సిపల్ కమిషనర్ కె సతీష్ కుమార్ లు అన్నారు. బుధవారం నాడు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 2వ, సాధారణ మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయనున్న అభ్యర్థుల ఎన్నికల ఖర్చులు, ప్రవర్తన నియమావళి పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించి ఖర్చుల వివరాలను తు.చ. తప్పకుండా వెల్లడించాలని సూచించారు. వార్డులలో పోటీ చేసే . ఏ అభ్యర్థి నైన లక్ష రూపాయలు దాటకుండా ఖర్చు చేయాలన్నారు. బ్యాంకు లో నూతన ఖాతా ద్వారా మాత్రమే ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. చేతి ఖర్చులు 10 వేలకు మించొద్దన్నారు. లక్షకు మించి ఖర్చు చేసినట్లయితే గెలుపును రద్దు చేయనున్నట్లు, ఓడిన అభ్యర్థులు అయితే 3 సంవత్సరాల వరకు ఏ ఎన్నికలకు పోటీ చేయుటకు అనర్హులుగా ప్రకటించ బడతారన్నారు. ఖర్చు వివరాలు తెలియపర్చకుండా ఉంటే మున్సిపల్ చట్టం 2019 ప్రకారం శిక్షార్హుల వుతారన్నారు. ఎన్నికల కార్యకలాపాలన్నిటికీ ఎన్నికల అధికారుల అనుమతి తప్పనిసరి పేర్కొన్నారు. అభ్యర్థులకు ఇచ్చిన ఫార్మాట్ లో 5,7,9 మూడు దశలలో ఖర్చుల వివరాలు చూపాలని, అలా వీలు కానీ పక్షంలో.అభ్యర్థులు 45 రోజులలో లెక్కలు చూపించాలని వివరించారు. అభ్యర్థులు పెట్టే ఖర్చులు, ప్రచారంలో ఎన్నికల పర్య వేక్షణ ఆధ్వరంలో నిఘా ఉంటుందని జాగ్రత్తగా వ్యవహరించి మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని కోరారు. ఓటర్లను మద్యం, డబ్బులు ఏలాంటి ప్రలోభాలకు గురి చేయవద్ద న్నారు. అభ్యర్థులకు తగు సలహాలు, సూచనలు అందించడానికి ఎన్నికల సిబ్బంది ఎంపీడీవో కార్యా లయంలో అందుబాటులో ఉంటారని తెలిపారు. .సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా అభ్యర్థులు వ్యవహరించాలని సూచించారు. నియామ, నిబంధనలను పాటించి ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా సహక రించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్వోలు, ఏఆర్వోలు, ఎన్నికలలో పోటీ చేయు వివిధ వార్డుల అభ్యర్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ సమక్షంలో

# బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు



**మోత్కూరు ఫిబ్రవరి 04 (వార్తా వేదిక సూర్య) :** మోత్కూరు మున్సిపాలిటీలో బుధవారం నాడు బారాస ముఖ్య కార్యక ర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన 5వ, వార్డు బుజిలాపురం నాయకులు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గాదరి కిషోర్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మలిపెద్ది మల్లారెడ్డి, గ్రామశాఖ మాజీ అధ్యక్షుడు పసునూరి యాదయ్య నాయకులు చుక్క సుజాత, దయ్యాల పెద్ద మల్లయ్య ,కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బారాస పార్టీలో చేరారు. వారికి గాదరి కిషోర్ కుమార్ గులాబీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. మున్సిపల్ ఎన్నికల వేళ అధికార కాంగ్రెస్ పార్టీని వీడి నాయకులు బారాస వైపు వెళ్ళడం స్థానికంగా ప్రాముఖ్యతను సంతరించుకుంది. కాంగ్రెస్ పార్టీ అవలంబిస్తున్న విధివిధానాలు నచ్చకపో వడం వల్లే తాము ఆ పార్టీని వీడి బారాసలో చేరుతున్నట్లు కాంగ్రెస్ నాయకులు ప్రకటించారు.

# స్వప్నని హత్య చేసిన వ్యక్తులను ఎన్‌కౌంటర్ చేయాలి

## లాయర్స్ ఫోరం అధ్యక్షుడు న్యాయవాది నర్రి స్వామి



**రంగారెడ్డి, ఫిబ్రవరి 4 వార్తా వేదిక సూర్య :** రంగారెడ్డి జిల్లా కోర్టు ఆవరంలో తెలంగాణ సామాజిక చైతన్య వేదిక రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు లాయర్స్ ఫోరమ్ ఫర్ సోషల్ జస్టిస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ హైకోర్టు ప్రముఖ న్యాయవాది స్వామి కురుమ న్యాయవాదుల సమక్షంలో మాట్లాడుతూ భారతదేశానికి స్వతంత్రం వచ్చి 80 సంవత్సరాలు పూర్తి అవుతున్న మహిళకు స్వేచ్ఛ జీవితాన్ని అందించలేకపో తున్నాం అందులో మహిళా న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తు న్నటువంటి ప్రాక్టీసింగ్ న్యాయవాదిని మర్డర్ చేయడం అంటే చాలా దుర్మార్గం మర్డర్ చేసిన వ్యక్తులను వెంటనే ఎన్కౌంటర్ చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు ఇప్ప టికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి న్యాయవాదుల రక్షణ చట్టాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నాం అన్నారు సీనియర్ న్యాయవాది సదానందం మాట్లాడుతూ హత్య చేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలి నర్రి స్వామి చెప్పినట్లు ఎన్కౌంటర్ చేయాలి అన్నారు సీనియర్ న్యాయవాదులు సత్యనారాయణ రెడ్డి, వినోద్ కుమార్, మహేష్ బాబు, మల్లేష్ కురుమ, గాయత్రీ స్వప్న తదితరులు పాల్గొన్నారు



# ఎమ్మెల్యే మందుల సామేల్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు

**మోత్కూరు, ఫిబ్రవరి 04 ( వార్తా వేదిక సూర్య ):** మోత్కూరు మున్సిపాలిటీ కేంద్రంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతు న్నాయి.మంగళవారం రాత్రి 7వ వార్డు పరిధిలోని డ్రైవర్స్ కాలనీకి బారాస పార్టీకి చెందిన ఎం.డి. అమీర్, మహేశ్వరం హనుమంత్ మోత్కూరు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో తుంగతుర్తి శాసనస భ్యులు మందుల సామేల్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ లో చేరారు. ఎమ్మెల్యే సామేల్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వా నించారు.ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ, తుంగతుర్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే మందుల సామేల్ చేస్తున్న అభివృద్ధి పనులు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులమై ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, వార్డు అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తామ న్నారు.. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు పైళ్ళ సోమిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు గుర్రం లక్ష్మీనర్సింహ్మారెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గుండగోని రామచంద్రుగౌడ్, 7వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గనగాని శైలజ ,నర్సింహ్మ తదితరులు పాల్గొన్నారు.

## బృందావన్ ఛానల్ మరమ్మతుకు

# 1.42 లక్షల నిధులను విడుదల చేయాలి

### వనం శాంతి కుమార్ డిమాండ్



**మోత్కూరు, ఫిబ్రవరి 04 (వార్తా వేదిక సూర్య ) :** బృందావన్ చానల్ మరమ్మతులు చేయుటకు 1.42 లక్షల నిధులను అనుమతి ఇవ్వాల ని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు వనం శాంతి కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఓ ఎస్.డి విద్యా సాగర్ కు మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములులతో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శాంతి కుమార్ మాట్లాడుతూ బృందావన్ చానల్ కాల్వ కింద స్థాయి వరకు నీటి పారుదల సౌకర్యం లేక రైతులు ఇబ్బం దులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బృందావన్ చానల్ ను ఉన్నతాధికారులు సందర్శించి చానల్ ఎత్తు పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని, కొత్త తలుపులు బిగించి, కాల్వలో ఉన్న చెత్త మొక్కలు తొలగించా లని కోరారు. తాము ఇచ్చిన వినతి పై విద్యాసాగర్ సానుకూలంగా స్పందించినట్లు శాంతి కుమార్ తెలిపారు.



## ఆర్ఏం 9 న్యూస్ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన

# ఈర్ల మైసయ్య

**యాదాద్రి భువనగిరి/ వార్త వేదిక సూర్య :** ఆర్ ఏం 9 న్యూస్ , బహుజన 99 టివి 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను భవన కార్మిక సంఘం మండల అధ్యక్షుడు ఈర్ల మైసయ్య ముదిరాజ్ ఆవి ష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీడియా సంస్థలు ప్రజల వైపు ఉండాలని వారి సమస్యలను ప్రభుత్వాలకు తెలియజేయడంలో కీలకపాత్ర పోషించాలని అన్నారు.ఈ కార్యక్ర మంలో ఆర్ ఏం 9 న్యూస్ ప్రతినిధి గుర్రాల నాగరాజు పాల్గొన్నారు.



## ఆర్ఏం 9 న్యూస్ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన

# కానుగంటి శ్రీశైలం

**యాదాద్రి భువనగిరి/ వార్త వేదిక సూర్య :** ఆర్ ఏం 9 న్యూస్ , బహుజన 99 టివి 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను నిడ్స్ స్వచ్ఛంధ సంస్థ అధ్యక్షుడు కానుగంటి శ్రీశైలం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీడియా సంస్థలు ప్రజల వైపు ఉండాలని వారి సమస్యలను ప్రభుత్వాలకు తెలియజేయడంలో కీల కపాత్ర పోషించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్ ఏం 9 న్యూస్ ప్రతినిధి గుర్రాల నాగరాజు పాల్గొన్నారు.



## ఆర్ఏం 9 న్యూస్ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన

# మోకు దెబ్బ నేత వెంకటేశ్‌గౌడ్

**యాదాద్రి భువనగిరి/ వార్త వేదిక సూర్య :** ఆర్ ఏం 9 న్యూస్ , బహుజన 99 టివి 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను గౌడ జనుల హక్కుల పోరాట సమితి (మోకు దెబ్బ) యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు గుల్లపల్లి వెంకటేశ్ గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీడియా సంస్థలు ప్రజల వైపు ఉండాలని వారి సమస్యలను ప్రభుత్వాలకు తెలియజేయడంలో కీల కపాత్ర పోషించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్ ఏం 9 న్యూస్ ప్రతినిధి గుర్రాల నాగరాజు పాల్గొన్నారు.



## ఆర్ఏం 9 న్యూస్ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన

# మాటూరు సర్పంచ్ జన్నె సిద్దులు

**యాదాద్రి భువనగిరి/ వార్త వేదిక సూర్య :** ఆర్ ఏం 9 న్యూస్ , బహుజన 99 టివి 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను మోట కొండూరు మండల మాటురు గ్రామ సర్పంచ్ జన్నె సిద్దులు ఆవిష్క రించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీడియా సంస్థలు ప్రజల వైపు ఉండాలని వారి సమస్యలను ప్రభుత్వాలకు తెలియజే యడంలో కీలకపాత్ర పోషించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్ ఏం 9 న్యూస్ ప్రతినిధి గుర్రాల నాగరాజు పాల్గొన్నారు.

# కబడ్డీ క్రీడాకారిణి శ్రీజకు ఘన సన్మానం

**కోదాడ, వార్త వేదిక సూర్య :** కోదాడ పట్టణంలోని ఖేలో ఇండియా కబడ్డీ అకాడమీ క్రీడాకారిణి, కేఆర్ఆర్ కళాశాల విద్యార్థిని శ్రీజ హైద రాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన 72వ సీనియర్స్ మహి ళా జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో తెలంగాణ రాష్ట్ర జట్టుకు ప్రాతిని ధ్యం వహించడం అభినందనీయం అని కళాశాల ప్రిన్సిపాల్ హడస రాణి, కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నామా నరసింహ రావులు అన్నారు. బుధవారం కేఆర్ఆర్ కళాశాల ప్రాంగణంలో శ్రీజకు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సన్మానించారు.

## అవకాశం ఇవ్వండి

# అభివృద్ధి చేసి చూపిస్తా

### 12వ వార్డు అభ్యర్థి పాక చిరంజీవి

**చౌటుప్పల్ ఫిబ్రవరి 4 వార్తా వేదిక సూర్య :** అవకాశం ఇవ్వండి అభివృద్ధి చేసి చూపిస్తానని చౌటుప్పల్ 12వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కాక చిరంజీవి ఓటర్లను కోరారు బుధవారం చౌటుప్పల్ లోని 12 వ వార్డు లోని ఉప్పలమ్మ తల్లి గుడి వద్ద వార్డు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెరుకు లింగస్వామి గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారానికి మార్కెట్ కమిటీ అధ్యక్షులు ఉబ్బు వెంకటయ్య , మాజీ జెడ్పిటిసి చిలుకూరి ప్రభాకర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ బొంగు జంగయ్య గౌడ్, సీతారామచంద్రస్వామి దేవాలయం అధ్యక్షులు బొబ్బిళ్ళ మురళి గురుస్వామి, తిరుపతి రవీందర్, 12వ వార్డు ఇన్చార్జులు మాధగోని శేఖర్ గౌడ్, బక్క శ్రీనాథ్ ,మాజీ వార్డ్ మెంబర్ ఎస్కే జానీ బాబు, చౌటుప్పల్ మాజీ ఉపసర్పంచ్ పాలడుగు వెంకటేష్ గుప్తా, మాజీ వార్డ్ మెంబర్ బుంగపట్ల భారతమ్మ, బొబ్బిళ్ళ కుమార్, మరియు ఇందిరమ్మ కమిటీ సభ్యుల తోటి ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 12వ వార్డు అధ్యక్షులు చెరుకు లింగస్వామి గౌడ్ ఆధ్వర్యంలో కొంతమంది స్థానిక బిఆర్ఎస్ పార్టీకి చెందినటువంటి మహిళలు రెడ్డి తిరు లక్ష్మి, కవిత మంగమ్మ , మీనా, సుజాత, కృష్ణమ్మ, లావణ్య, మౌనిక, మహేశ్వరి, వసంత తదితర 15 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీ లో చేరారు. ఈ కార్యక్రమంలో 12వ వార్డు శాంతినగర్కు సభ్యులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.







# కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి

## భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి

**భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 4 ( వార్త వేదిక సూర్య ) :** మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని 1,2,3,4, వార్డుల్లో ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఆయన హాజరయ్యారు. చెయ్యి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని , అభివృద్ధి సంక్షే మానికి ప్రజలు పట్టడం కట్టాల ని అన్నారు. మున్సిపల్ అభివృద్ధి కోసం కాంగ్రెస్ అభ్యర్థులకు తమ అమూల్య మైన ఓటు వేసి గెలిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు భారత లవ కుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పాక మల్లేష్ యాదవ్, జిల్లా కాంగ్రెస్ నాయకులు తడక వెంకటేష్ , కళ్లెం రాఘవరెడ్డి, సామ మధుసూదన్ రెడ్డి , మర్రి నర్సింహారెడ్డి, తడక రమేష్, నాయకుడు దా రెడ్డి వేణుగోపాల్ రెడ్డి , బండారు ప్రకాష్ రెడ్డి , గునిగంటి రమేష్, అభ్యర్థులు గుండ్ల నవనీత, కొండ మడుగు ఎల్ల స్వామి, రావుల జంగయ్య, నల్ల నాగేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

# అభ్యర్థులకు ఎన్నికల ప్రవర్తన నియమావళిపై అవగాహన అవసరం

## సహాయ జిల్లా ఎన్నికల అధికారి, కమిషనర్ వెంకట్రామిరెడ్డి



**చౌటుప్పల్ ఫిబ్రవరి 4 వార్తా వేదిక సూర్య :** యాదాద్రి భువన గిరి జిల్లా చౌటుప్పల్ మండల మున్సిపల్ కార్యాలయ సమావేశం మందిరం నా స్థానిక సంస్థల ఎన్నికల ప్రవర్తన నియమావళి (ఎం సి సి 2026) పై పోటీలో ఉన్న అభ్యర్థులకు అవగాహన కల్పించేందుకు ఈరోజు ఉదయము 11:30 గంటలకు ప్రత్యేక సమావేశం నిర్వహించడం అయినది.

**ఈ సమావేశంలో ముఖ్య అంశాలు..**

నియంత్రణపై శిక్షణ: ఈ సమావేశంలో జిల్లా ఎన్నికల ఎక్స్పెండిచర్ అబ్జర్వ ర్,ఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.అభ్యర్థులు తమ ఎన్నికల ఖర్చులను ఎలా నమోదు చేయాలి.రిజిస్టర్ లను ఏ విధంగా నిర్వహించాలి మరియు నిబంధనలకు లోబడి ఖర్చులను ఎలా చూపించాలి అనే అంశంపై సమగ్రంగా వివరించారు. హ్యాండ్ బుక్ పంపిణీ,మున్సిపల్ కమిషనర్ జి.వెంకట్రామిరెడ్డి పోటీలో ఉన్న అభ్యర్థులకు ఎన్నికల నిబంధనల కూడిన హ్యాండ్ బుక్కు మరియు ఇతర ముఖ్యమైన సమాచారం మెటీరియల్ను అందజేశారు. నిబంధనలఅమలుకు ఎన్నికల ప్రక్రియ పారదర్శంగా,శాంతియుతంగా జరిగేందుకు అభ్యర్థులందరూ ప్రవర్తనా నియమావళి(ఎం సి సి) కచ్చితంగా పాటించాలని కమిషనర్ సూచించారు. కార్యక్రమంలో మునిసిపల్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి, ఎన్నికల రిటర్నింగ్ అధికారి సురేందర్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రఘుపతి, ఎన్నికల సిబ్బంది, వివిధ వార్డుల నుండి పోటీ చేస్తున్న అభ్యర్థులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

# సంస్కృతి విద్య సంస్థలతో కలిసి పనిచేయనున్న స్ఫూర్తి ఆర్గనైజేషన్

## అవకాశం కల్పించిన యజమాన్యానికి ధన్యవాదాలు

## స్ఫూర్తి ఆర్గనైజేషన్ అధ్యక్షుడు కుంటోళ్ల యాదయ్య

మహేశ్వరం ఫిబ్రవరి 4 వార్త వేదిక సూర్య: ఘట్కేసర్ డివిజన్ పరిధి కొండాపూర్ సంస్కృతి ఇంజనీరింగ్ కళాశాలతో స్ఫూర్తి ఆర్గనైజేషన్ బుధవారం సామాజిక అవగాహన ఒప్పందం జరిగింది. సంస్కృతి విద్యా సంస్థలతో కలసి పని చేయడానికి స్ఫూర్తి ఆర్గనైజేషన్ అవకా శం కల్పించి యాజమాన్యం, డైరెక్టర్ ఎం.రమాకాంత్ రెడ్డి, ప్రిన్సిపా ల్ జానకి రాములు, ఎన్ ఎస్ ఎస్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ అధ్యక్షు డు కుంటోళ్ళ యాదయ్య, ప్రధాన కార్యదర్శి కంది సత్యనారాయణ, సభ్యులు మేకల సురేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.





## ఆర్ఏం 9 న్యూస్ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన

# సిపిఐ మండల కార్యదర్శి గాదగాని మాణిక్యం

**యాదాద్రి భువనగిరి/ వార్త వేదిక సూర్య :** ఆర్ ఏం 9 న్యూస్ , బహుజన 99 టివి 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను సిపిఐ మోటకొండూరు మండల కార్యదర్శి గాదగాని మాణిక్యం ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీడియా సంస్థలు ప్రజల వైపు ఉండాలని వారి సమస్యలను ప్రభుత్వాలకు తెలియజేయ డంలో కీలకపాత్ర పోషించాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్ ఏం 9 న్యూస్ ప్రతినిధి గుర్రాల నాగరాజు పాల్గొన్నారు.

## ఆర్ఏం 9 న్యూస్ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన

# రేణుకాభూరెడ్డి జనమేజయరెడ్డి



**యాదాద్రి భువనగిరి/ వార్త వేదిక సూర్య :** ఆర్ ఏం 9 న్యూస్ , బహుజన 99 టివి 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను బీజేపీ జిల్లా నాయకులు రేణుకా భూరెడ్డి జనమేజయరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీడియా సంస్థలు ప్రజల వైపు ఉండాలని వారి సమస్యలను ప్రభుత్వాలకు తెలియజేయడంలో కీలకపాత్ర పోషించాలని అన్నారు.ఈ కార్య క్రమంలో ఆర్ ఏం 9 న్యూస్ ప్రతినిధి గుర్రాల నాగరాజు పాల్గొన్నారు.



## ఆర్ఏం 9 న్యూస్ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన

# బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు గంధమల్ల

**యాదాద్రి భువనగిరి/ వార్త వేదిక సూర్య :** ఆర్ ఏం 9 న్యూస్ , బహుజన 99 టివి 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను బహుజన్ సమాజ్ పార్టీ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు గంధమల్ల లింగస్వామి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీడియా సంస్థలు ప్రజల వైపు ఉండాలని వారి సమ స్యలను ప్రభుత్వాలకు తెలియజేయడంలో కీలకపాత్ర పోషించాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్ ఏం 9 న్యూస్ ప్రతినిధి గుర్రాల నాగరాజు పాల్గొన్నారు.

# మైలర్ దేవ్‌పల్లిలో విషాదం

## విధి నిర్వహణలో లైన్‌మన్ మృతి.. సబ్‌స్టేషన్ ముట్టడించిన కుటుంబ సభ్యులు!



**మైలర్ దేవ్ పల్లి, ఫిబ్రవరి 4 ( వార్త వేదిక సూర్య ):** రంగారెడ్డి జిల్లా మైలర్ దేవ్ పల్లీ పోలీస్ స్టేషన్ పరిధిలోని పల్లె చెరువు వద్ద చోటుచేసుకున్న లైన్మెన్ సతీష్ మృతి ఘటన తీవ్ర విషాదాన్ని కలిగిస్తోంది. విధి నిర్వహణలో భాగంగా పల్లె చెరువు ట్రాన్స్ఫార్మర్ వద్ద పని చేస్తున్న సమయంలో విద్యుత్ ఘాతానికి గురై సతీష్ మృతి చెందడం అత్యంత బాధాకరమైన విషయం. ఈ దుర్ఘటన జరిగిన వెంటనే సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు స్పందించకపోవడం పట్ల సతీష్ కుటుంబ సభ్యులు, తోటి లైన్మెన్లు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మృతుడి కుటుంబానికి తక్షణ సహాయం అందించాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని వారు ఆరోపించారు. ఈ నేపథ్యంలో మైలర్ దేవ్ పల్లీ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సతీష్ కుటుంబ సభ్యులు, లైన్మెన్లు కలిసి శాంతియుత ఆందోళన చేపట్టారు. మృతుడి కుటుంబాన్ని విద్యుత్ శాఖ వెంటనే ఆదుకోవాలని, కుటుంబానికి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన లైన్మెన్ కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం, ఒక కుటుంబ సభ్యుడికి ఉద్యోగ అవకాశం కల్పించడంతో పాటు ఘటనకు బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆందోళనకారులు ప్రభుత్వాన్ని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా లైన్మెన్ల భద్రతకు తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.




# దేవరకొండలో పట్టు చూపిద్దాం

- మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ జెండా ఎగరేద్దాం
- కాంగ్రెస్ అభ్యర్థులను ఆదరించండి
- ప్రజల ఆకాంక్షే మా ఊపిరి
- దేవరకొండలో ఘనంగా అభివృద్ధి కార్యక్రమాలు.
- ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్
- పట్టణంలోని 2వ వార్డులో ఎన్నికల ప్రచారం

**దేవరకొండ ఫిబ్రవరి 4 ( వార్తా వేదిక సూర్య):** మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా నేడు దేవరకొండ పట్టణంలోని 02వ వార్డులో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి అంకురి శివ ప్రసాద్ కి మద్దతుగా ఇంటి ఇంటికి ఎన్నికల ప్రచారం నిర్వహించి, ఎన్నికల నమూనా బ్యాలెట్ లో సీరియల్ నెంబర్ 01 పై మీ అమూల్యమైన ఓటు వేసి అత్యధిక మెజారిటీతో అంకురి శివ ప్రసాద్ గారికి గెలిపించాలని 02వ వార్డు ఓటర్లను అభ్యర్థించిన దేవరకొండ ఎమ్మెల్యే శ్రీ నేనావత్ బాలు నాయక్ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ, పారదర్శక పాలనను అందిస్తోంది మన కాంగ్రెస్ ప్రభుత్వం. తెలంగాణ బిడ్డల కలలను నిజం చేయడమే మా అంతిమ లక్ష్యంప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరడమే మా విజయానికి నిదర్శనం. దేవరకొండ పట్టణంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కోట్ల రూపాయల నిధులను వెచ్చించి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నామని,గత పాలకులు అభివృద్ధి విషయంలో మొద్దు నిద్ర పోయారని విమర్శించారు.

పేద ప్రజలకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసి వారి సొంతింటి కళ నెరవేరుస్తున్నామని తెలిపారు. ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, జీరో వడ్డీ రుణాలు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, నూతన రేషన్ కార్డులు, ఉచిత సన్న బియ్యం, సన్న వడ్ల బోనస్, రైతు రుణమాఫీ, 5 లక్షల ఆరోగ్య శ్రీ 10 లక్షలకు పెంపుదల, రైతు భరోసా మరియు అనేక రకాల సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం విషయంలో విఫలం అయ్యారని మళ్లీ ఎ మొహం పెట్టుకొని ఎన్నికలు వచ్చినప్పుడు ఓట్లను అడుగుతున్నారని విమర్శించారు. ఫిబ్రవరి 11వ తేదీన జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే పేర్కొన్నారుఈ ప్రచారంలో ప్రజా ప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, ముఖ్య నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, కౌన్సిలర్ అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు



# లోకసాని శ్రీనివాస్ రెడ్డి మృతి పార్టీకి తీరని లోటు

## బీఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షుడు దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్



**దేవరకొండ, ఫిబ్రవరి 4, ( వార్త వేదిక సూర్య ):** డిండి మండలం ఖానాపూర్ గ్రామ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు లోకసాని శ్రీనివాస్ రెడ్డి మృతి పార్టీకి తీరని లోటు అని బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. బుధవారం ఖానాపూర్ గ్రామంలో శ్రీనివాస్ రెడ్డి మృతి దేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు పరామర్శించారు. అంతకు ముందు శ్రీనివాస్ రెడ్డి మృత దేహంపై పార్టీ జెండా కప్పిన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీనివాస్ రెడ్డి మృతి బాధాకరం అని ఆయన అన్నారు. పార్టీ పరంగా అండగా ఉంటాం అని ఆయన భరోసా ఇచ్చారు. వారి వెంట బిఆర్ఎస్ మండల అధ్యక్షులు రాజీనేని వెంకటేశ్వర్ రావు, కృష్ణ రెడ్డి,మాల్ రెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి,బోడ్డుపల్లి జయంత్, జంగీర్,బషీర్, శ్రీనివాస్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

### బీఆర్ఎస్ నాయకుడు వడ్త్య రమేష్ నాయక్ సంతాసం

డిండి మండలం బి ఆర్ ఎస్ ఖానాపూర్ గ్రామ శాఖ అధ్యకులు లోకాసాని శ్రీనివాస్ రెడ్డి ఈ రోజు స్వర్గస్థులు అయినారు వారి మృత దేహానికి బి ఆర్ ఎస్ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్ నాయక్ పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులు పరామర్శించారు ఆయన వెంట మాజీ సర్పంచ్ కృష్ణ రెడ్డి బొడ్డుపల్లి జయంత్. కృష్ణ రెడ్డి.బాలాజీ నాయక్ మాజీ ఉప సర్పంచ్ విజయ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలి

## సర్పంచ్ కలకొండ దుర్గయ్య

## సుంకిశాలలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ

**నాంపల్లి ఫిబ్రవరి 4(వార్త వేదిక సూర్య) :** నల్గొండ జిల్లా నాంపల్లి మండలం సుంకిశాల గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే దిశగా ఈరోజు సర్పంచ్ కలకొండ దుర్గయ్య మరియు విద్యుత్ శాఖ ఏఈ (AE) శివకుమార్ కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు.గ్రామంలోని వీధుల్లో తిరుగుతూ ఇండ్ల మీదుగా ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను, పాత స్తంభాలను వారు పరిశీలించారు.అవసరమైన చోట కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని, ట్రాన్స్‌ఫార్మర్ల షిఫ్టింగ్ ప్రక్రియను చేపట్టాలని సర్పంచ్ అధికారులకు సూచించారు.గ్రామస్తులు ఎదుర్కొంటున్న తక్కువ వోల్టేజీ సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఏఈకి వివరించారు.సర్పంచ్ విన్నపానికి సానుకూలంగా స్పందించిన ఏఈ శివకుమార్, గ్రామంలోని విద్యుత్ సమస్యలన్నింటినీ వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ నాయకులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.




# కేతేపల్లిలో మహిళా సంఘ భవనానికి భూమి పూజ

## గ్రామ సర్పంచ్ పెరిగేటి రమేష్

**నాంపల్లి ఫిబ్రవరి 4(వార్త వేదిక సూర్య) :** నల్గొండ జిల్లా నాంపల్లి మండలం కేతేపల్లి గ్రామ అభివృద్ధిలో భాగంగా మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, కేతేపల్లి గ్రామంలో మహిళా సంఘ భవన నిర్మాణానికి నేడు శంకుస్థాపన జరిగింది. సర్పంచ్ పెరికేటి రమేష్ గారి ఆధ్వర్యంలో ఈ భూమి పూజ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ టెక్నికల్ ఆఫీసర్ శ్రావణ్ గారు పాల్గొని సాంకేతిక పరమైన సూచనలు అందించారు. గ్రామ ప్రజా ప్రతినిధులు, అధికారులు మరియు పెద్దల సమక్షంలో శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు పూర్తి చేసి భవన నిర్మాణాన్ని ప్రారంభించారు వార్డు మెంబర్లు రాజబోయిన రాజు, కాశీ మల్ల జంగయ్య, పల్లేటి కర్ణాకర్.గ్రామ VOA పసునూరి వెంకటమ్మ, రవీందర్ రెడ్డి, మహిళా సంఘం అధ్యక్షురాలు పల్లేటి లక్ష్మమ్మ.గ్రామ పెద్దలు యువకులు రాజబోయిన వెంకటయ్య, పగిళ్ల ఈదయ్య, మందలపు కోటయ్య, దండిగా లింగయ్య, పెరికేటి జగన్, పల్లేటి ఆంజనేయులు, ఉగ్గపల్లి నరసింహ, రాజబోయిన శ్రీరామ్, ఎడ్ల మహేష్, ఎడ్ల రాములు, చేపూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు



# నకిలీ పత్రాలతో భూదందా

## మణికొండలో ఐదు అంతస్తుల భవనం స్వాధీనం

## హైడ్రా కొరడా.. బట్టబయలైన అక్రమ లేఅవుట్ భాగోతం

**మైలర్ దేవ్ పల్లి ఫిబ్రవరి 4 ( వార్త వేదిక సూర్య) :** మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ వెంకటేశ్వర కాలనీలో హైడ్రా అధికారులు భారీ ఆక్రమణను వెలుగులోకి తెచ్చారు. ప్రజల ఉమ్మడి అవసరాల కోసం కేటాయించిన స్థలాలను నకిలీ పత్రాల సాయంతో ఆక్రమించి నిర్మించిన ఒక ఐదు అంతస్తుల భవనాన్ని అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. 1996లో రూపొందించిన ఒక తాత్కాలిక లేఅవుట్‌ను ఆమోదిత లేఅవుట్‌గా నమ్మించి భూకబ్జాదారులు ఈ దందాకు తెరలేపారు. కాలనీలో కమ్యూనిటీ హాల్ (సామూహిక భవనం) మరియు సెప్టిక్ ట్యాంక్ (మలజల నిల్వ) కోసం కేటాయించిన స్థలాలను సైతం వదలకుండా ఆక్రమించారు. అక్రమంగా పొందిన ఇంటి నంబర్ల ఆధారంగా, హెచ్ఎండీఏ నుంచి తప్పుడు అనుమతులు పొందినట్లు హైడ్రా పరిశీలనలో తేలింది. దీనిపై లోతుగా విచారించిన హెచ్ఎండీఏ అధికా రులు.. సదరు లేఅవుట్ క్రమబద్ధీకరణ పత్రాలు పూర్తిగా నకిలీవని ధృవీకరించారు. తమ కాలనీకి చెందిన బహిరంగ స్థలాలు కబ్జాకు గురవ్వడంపై శ్రీ వెంకటేశ్వర కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ న్యాయ స్థానంలో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. కోర్టు ఆదేశాలు మరియు హైడ్రా విచారణ నేపథ్యంలో ఈ అక్రమ కట్టడంపై చర్యలు తీసుకున్నారు. ప్రజా అవసరాలకు కేటాయించిన స్థలాలను తిరిగి స్వాధీనం చేసుకునే ప్రక్రియ వేగవంతం కావడంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ స్థలాల ను లేదా ప్రజల వినియోగం కోసం కేటాయించిన స్థలాలను తప్పుడు పత్రాలతో ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హైడ్రా అధికారులు హెచ్చరించారు. ఈ భూకబ్జా వెనుక ఉన్న సూత్రధారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసే దిశగా అధికారులు అడుగులు వేస్తున్నారు.




# ఏసీబీ వలలో జూనియర్ అసిస్టెంట్



**మైలార్ దేవ్ పల్లి ఫిబ్రవరి 4 ( వార్త వేదిక సూర్య ):** బండ్లగూడ, హైదరాబాద్‌లోని డెప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీస్‌లో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ శివ ప్రసాద్‌ను ఏసీబీ (యాంటీ కరప్షన్ బ్యూరో) అధికా రులు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. బుధవారం , ఏసీబీ సిటీ రేంజ్–2 యూనిట్ అధికారులు నిర్వహించిన దాడుల్లో, శివ ప్రసాద్ అనే జూనియర్ అసిస్టెంట్ ఫిర్యాదుదారుడి నుండి రూ.10,000/- లంచం డిమాండ్ చేసి స్వీకరిస్తున్న సమయంలో పట్టుబడ్డారు. ఎస్సెస్సీ బోర్డు ఎగ్జామినేషన్ సెంటర్స్ జాబితా నుంచి ఫిర్యాదు దారుడి స్కూల్ పేరును తొలగించకుండా ఉండేందుకు ఈ లంచం కోరినట్లు అధికారులు తెలిపారు.లంచంగా తీసుకున్న రూ.10,000/- టెయింటెడ్ అమౌంట్‌ను నిందితుడి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగిగా విధులు నిర్వర్తించడంలో నిర్లక్ష్యం వహిస్తూ, అక్రమ లాభం పొందేందుకు ప్రయత్నిం చినట్లు ఏసీబీ అధికారులు పేర్కొన్నారు.ఈ వ్యవహారంలో నిందితుడిని అరెస్ట్ చేసి, అదనపు స్పెషల్ జడ్జి (ఎస్పీఈ & ఏసీబీ కేసులు), నాంపల్లి కోర్టు ఎదుట హాజరు పరచి జుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. కేసు ప్రస్తుతం ఇన్వెస్టిగేషన్ దశలో ఉంది. భద్రతా కారణాల దృష్ట్యా ఫిర్యాదు దారుడి పేరు, వివరాలను గోప్యంగా ఉంచారు. ప్రజలకు విజ్ఞప్తి : ఏదైనా ప్రభుత్వ ఉద్యోగి లంచం డిమాండ్ చేసిన ట్లయితే, ప్రజలు వెంటనే ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064కు సమాచారం ఇవ్వాలని అధికారులు కోరారు.అలాగే వాట్సాప్ నంబర్ 9440446106, ఫేస్‌బుక్ (తెలంగాణ ఏసీబీ), ఎక్స్ / ఫార్మర్లీ ట్విట్టర్ (తెలంగాణ ఏసీబీ) ద్వారా కూడా సంప్రదించవచ్చు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఏసీబీ క్యూ ఆర్ కోడ్ ప్రదర్శించబడిందని తెలిపారు. ఫిర్యాదుదారుల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని ఏసీబీ స్పష్టం చేసింది.

# అర్ధరాత్రి ఎంజీయూ విద్యార్థి నాయకుల అరెస్టులు

**నల్లగొండ , ఫిబ్రవరి 4 (వార్తా వేదిక సూర్య )** నల్గొండ జిల్లా మిర్యాలగూడ కు రేవంత్ రెడ్డి పర్యటనను అడ్డుకుంటామని ప్రకటన చేయకపోయినా, తెల్లవారుజామున రాత్రి మూడు గంటల సమయంలో హాస్టళ్లలోకి వెళ్లి విద్యార్థి నాయకులను అరెస్ట్ చేసి నార్కెట్పల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని విద్యార్థి వర్గాలు మండిపడుతున్నాయి. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ.. ప్రజల మధ్యకు రావాల్సిన నాయకుడు పోలీసు బలగాల అండతో పర్యటనలు నిర్వహించడం ఆయనకు విద్యార్థి ఉద్యమాలపై ఉన్న భయాన్ని చూపిస్తోందని విమర్శించారు. ప్రశ్నించే స్వరాలను అణచివేయడానికి అక్రమ అరెస్టులు చేయడం సరైన విధానం కాదని, ఇలాంటి చర్యలతో విద్యార్థి ఉద్యమాలను ఎప్పటికీ ఆపలేరని స్పష్టం చేశారు. విద్యార్థుల అభిప్రాయాలు, నిరసనలు ప్రజాస్వామ్యంలో భాగమని, వాటిని అణచివేయాలని చూసిన నాయకత్వాలు చరిత్రలో నిలవలేదని హెచ్చరించారు.సంభాషణకు బదులుగా నిర్బంధాన్ని ఎంచుకోవడం ప్రజాస్వామ్యానికి ముప్పని పేర్కొన్నారు.అరెస్టు చేసి న వారిలో యూనివర్సిటీ బిఆర్ఎస్వీ అధ్యక్షులు వాడపల్లి నవీన్, ఏబీవీపీ అధ్యక్షులు హనుమాన్ చారి, ఎస్ఎఫ్ఐ నాయకుడు కర్రెం రవికుమార్ తదితరులు ఉన్నారు.




# బీజేపీ జాతీయ అధ్యక్షుడికి తోకల శ్రీనివాస్ రెడ్డి ఘన స్వాగతం

**మైలర్ దేవ్ పల్లి ఫిబ్రవరి 4 ( వార్త వేదిక సూర్య ):** భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా తెలంగాణ రాష్ట్రానికి విచ్చేసిన నితిన్ నబీన్ సిన్హా గారికి శంషాబాద్ విమానాశ్రయంలో అపూర్వ స్వాగతం లభించింది. రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు భారీ ఎత్తున తరలివచ్చి ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా కాటేదన్ లోని బిజెపి పార్టీ కార్యాలయం నుంచి భారీ ఎత్తున నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా బయలుదేరి విమానాశ్రయానికి చేరుకున్నారు. జాతీయ అధ్యక్షులకు తోకల శ్రీనివాస్ రెడ్డి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. డప్పు వాయిద్యాలు, బాణాసంచా వేడుకల మధ్య విమా నాశ్రయ పరిసరాలు పండుగ వాతావరణాన్ని తలపించాయి. నియోజకవర్గంలోని వివిధ డివిజన్ల నుండి పార్టీ కార్యకర్తలు భారీగా తరలిరావడంతో సందడి నెలకొంది. ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. నితిన్ నబీన్ సిన్హా నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని, ఆయన రాక రాష్ట్ర కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు



# ప్రధానిని ఘెరావ్ చేసేందుకు మహిళా ఎంపీల యత్నం?

**న్యూఢిల్లీ :**
బుధవారం సాయంత్రం రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై జరిగే చర్చకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమాధానం ఇచ్చే అవకాశం ఉందనే సంకేతాల మధ్య, ప్రతిపక్షాలకు చెందిన మహిళా ఎంపీలు సభలో ఆయన సీటు చుట్టూ ఉన్న ప్రదేశం నుండి కదలడానికి నిరాకరించడంతో లోక్‌సభ వాయిదా పడిందని తెలుస్తోంది.
బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే నెహ్రూపై చేసిన వ్యాఖ్యల నుంచి ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తన మాజీ సహచరుడు, ప్రస్తుత బీజేపీ ఎంపీ రవనీత్ సింగ్ బిట్టూను మిత్ర ద్రోహి అని పిలవడం వరకు పార్లమెంటు బుధవారం అట్టుడికింది. లోక్‌సభ తిరిగి సాయంత్రం 5 గంటలకు సమావేశమైనప్పుడు, వివిధ అంశాలపై ప్రతిపక్షాలు చేస్తున్న గందరగోళం మధ్య స్పీకర్ సభను వాయిదా వేశారు.



**మోడీని ఘెరావ్ చేద్దామనుకున్నారా?**
ప్రతిపక్షాలకు చెందిన, ముఖ్యంగా కాంగ్రెస్‌కు చెందిన మహిళా ఎంపీలు సభలో మోడీ కూర్చునే స్థానం వద్ద అడ్డుగా నిలబడ్డారని పార్టీ వర్గాల కథనం. ఆయన ఆ స్థానం వద్దకు చేరుకోవడానికి అటుగా నడిచి రావలసి ఉంటుంది. కాంగ్రెస్ ఎంపీలు వర్షా గైక్వాడ్, జ్యోతిమణి సహా పలువురు మోడీ సీట్ వద్ద నిలబడి అక్కడి నుంచి కదిలేందుకు నిరాకరించారు. కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ వారికి నచ్చచెప్పేందుకు యత్నించి విఫలమైనట్టు తెలుస్తోంది.
తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా మాట్లాడుతూ, కేంద్రమే ప్రతిపక్షాల ఉపన్యాసాన్ని రాసివ్వలేదని, మాకు కావాలనుకున్నది మేం మాట్లాడతామని అన్నారు. ప్రతిపక్షానికి చెందిన మహిళా ఎంపీలు ప్రధానిని అడ్డుకోవాలనుకుని, సభ ప్రారంభం కాకముందే వచ్చేశారని కొన్ని వర్గాల కథనం. వారి వైఖరి చాలా మొండిగా కనిపించిందని, గురువారం ప్రధాని ఉపన్యాస సమయంలో వారు అంతరాయం కలిగించేందుకు ప్రయత్నిస్తారని తెలుస్తోంది. ప్రధానమంత్రి సభలోకి నడుచుకుంటూ వెళ్తున్నప్పుడు మహిళా ఎంపీలు ఆయనను ఘెరావ్ చేయడానికి ప్రయత్నిస్తారని ప్రభుత్వం భావిస్తోందని వారు చెప్పారు, అందుకే ఆ రోజుకు సభను వాయిదా వేయాలని నిర్ణయించారు. దీని ఫలితంగా, లోక్‌సభను ఆ రోజుకు వాయిదా వేయడంతో మోదీ ప్రసంగం ఆలస్యమైంది.

# బడ్జెట్‌లో లోపాలు చెప్పగలరా?



**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సవాల్ విసిరారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ సమగ్రంగా లేదని రాహుల్ చేసిన వ్యాఖ్యలపై సీతారామన్ మాట్లాడుతూ.. ఆయన చేసిన వ్యాఖ్యలకు ఎటువంటి ఆధారం లేదని అన్నారు. బడ్జెట్‌లో లోపాలు ఉన్నాయని చేస్తున్న ఆరోపణలను నిరూపించే అంశాలను కాంగ్రెస్ నేత తన ముందు నిలబడి చెప్పగలరా?అని సవాల్ చేశారు. ఆయన చేసిన వ్యాఖ్యలకు తగిన ఆధారాలు చూపించాలన్నారు.
తమ ప్రభుత్వం యువత నైపుణ్యం, వ్యవస్థాపకత, కృత్రిమ మేధస్సు వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలపై బడ్జెట్‌లో ప్రధానంగా దృష్టి సారించిందని నిర్మలా సీతారామన్ తెలిపారు. దేశంలో అభివృద్ధి చెందుతున్న కార్మిక మార్కెట్ అవసరాలను తీర్చడానికి వ్యవసాయం, గ్రామీణ ఉపాధి, యువతకు ఉపాధి శిక్షణ కేంద్రాలు వంటి వాటి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై రాహుల్ గాంధీ ఇటీవల తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ సమగ్రంగా లేదని..దేశం ఎదుర్కొంటున్న నిజమైన సంక్షోభాలపై దృష్టి సారించలేకపోయిందని పేర్కొన్నారు. యువతకు ఉద్యోగాలు లేవని, తయారీ రంగం పతనమవుతోందని ఆరోపించారు. పెట్టుబడిదారులు పెట్టుబడులను ఉపసంహరించుకుంటున్నారన్నారు. రైతుల ఇబ్బందులు, ప్రపంచ దేశాల నుంచి తగులుతున్న ఎదురు దెబ్బలు వంటి అంశాలను ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు.

# పుస్తకానికి, పుస్తకం

## పార్లమెంటులో అధికార, విపక్షాల ఆరోపణ, ప్రత్యారోపణలు



**దుబే వ్యాఖ్యల కారణంగా, రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమాధానం ఇవ్వడానికి ముందే సభ వాయిదా పడింది. సాయంత్రం 5 గంటలకు సభ తిరిగి ప్రారంభమైనప్పటికీ, చివరి క్షణంలో దానిని ఆ రోజుకు వాయిదా వేయడంతో మోదీ ప్రసంగం కూడా వాయిదా పడింది.**

**న్యూఢిల్లీ :**
బుధవారం పార్లమెంటులో పుస్తకాల యుద్ధం సభను రెండుగా చీల్చేసింది. ప్రచురితమైన, అప్రచురితమైన పుస్తకాల నుంచి పరస్పర విరుద్ధమైన భాగాలను చదవడం సభలో అంతరాయాలకు దారి తీసింది. బీజేపీ ఎంపి నిషికాంత్ దూబే, నెహ్రూ గాంధీ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని, ఎడ్వినా అండ్ నెహ్రూ వంటి వివాదాస్పద పుస్తకాల నుంచి ఉటంకించిన తర్వాత మోడీ ప్రభుత్వం ద్వంద్వ ప్రమాణాలను పాటిస్తోందంటూ ప్రతిపక్షం విరుచుకుపడింది. నిజానికి ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని మాట్లాడకుండా నిలిపివేసిన విషయం తెలిసిందే.
పార్లమెంటు పనితీరు నరేంద్ర మోడీ ప్రభుత్వానికి ఎక్కువ అనుకూలంగా ఉందని విమర్శిస్తూ, కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ, దుబేపై తీవ్రంగా మండిపడ్డారు. భారతదేశపు తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, ఆయన కుమార్తె ఇందిరా గాంధీ, సోనియా గాంధీతో సహా గాంధీ కుటుంబాన్ని అయ్యాషీ, మక్కారీ, భ్రష్టాచార్ (విలాసవంతమైన జీవితం, మోసం, అవినీతి)కి పాల్పడ్డారని ఆరోపిస్తూ, దూబే పలు పుస్తకాల నుండి కొన్ని భాగాలను ఉటంకించిన తర్వాత ఈ ఘటన జరిగింది.
తాను మాత్రమే పార్లమెంటును నడుపుతామని చూపించుకోవాలని మోడీ ప్రభుత్వం అనుకుంటుందని, ఇది స్పీకర్ పదవికి, హోదాకి, పార్లమెంటుకి, ప్రజాస్వామ్యానికి, ఈ దేశ ప్రజలకు కూడా అవమానమేనని పార్లమెంటు బయట మాట్లాడుతూ ప్రియాంక విమర్శించారు.
సభ తిరిగి మధ్యాహ్నం రెండుగంటలకు సమావేశం కాగానే, రాహుల్ గాంధీ అప్రచురితమైన పుస్తకం నుంచి కొన్ని వాక్యాలు చదివినందున, గాంధీ కుటుంబాన్ని బహిర్గతం చేయడం తన వంతంటూ, మాట్లాడేందుకు దూబే లేచి నిలబడ్డారు. ఆయన తన ఉపన్యాసంలో పలు పుస్తకాలను ప్రస్తావించారు.
గాంధీ కుటుంబంపై పుస్తకాల జాబితాను బీజేపీ ఎంపి చదవడాన్ని కొనసాగిస్తుండగా, లోక్‌సభ స్పీకర్ జోక్యం చేసుకున్నారు.
సభ కార్యకలాపాలకు సంబంధించిన విషయాలు తప్ప, సభ్యులు ఏ పుస్తకం, వార్తాపత్రిక లేదా లేఖ నుండి చదవడాన్ని నిషేధించే నియమం 349ను ఉటంకిస్తూ, స్పీకర్ ఈ విషయాన్ని తాను అనుమతించలేనని అన్నారు.
గత రెండు రోజులుగా రాహుల్ గాంధీ మాజీ సైన్యాధ్యక్షుడు జనరల్ నరవణే ప్రచురితం కాని జ్ఞాపకాల పుస్తకంతో లోక్‌సభలో నిలబడినప్పుడు ఈ విషయంపై ఇప్పటికే ఒక తీర్పు ఇచ్చినట్టు ఆయన పేర్కొన్నారు.
దూబే వ్యాఖ్యలకు నిరసనగా ప్రతిపక్ష సభ్యులు ఏకమై నిలబడటం, ఆయన తన ప్రసంగాన్ని ఆపే సూచనలు కనిపించకపోవడంతో, స్పీకర్ లోక్‌సభను సాయంత్రం 5 గంటల వరకు వాయిదా వేశారు.
శాసనసభ చర్చల్లో తన కుటుంబం పేరును పదే పదే ప్రస్తావించడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రియాంక గాంధీ, మోదీ ప్రభుత్వం సభను అడ్డుకోవాలనుకున్నప్పుడు, నిషికాంత్ దుబేను మాట్లాడమని చెబుతుంది అని మండిపడ్డారు.
ఒకవైపు, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని పార్లమెంటులో ప్రచురించని ఒక పుస్తకం నుండి ఉటంకించడానికి అనుమతించరు. మరోవైపు, నిషికాంత్ దుబే ఆరు పుస్తకాలతో కూర్చుని, వాటిని బహిరంగంగా ప్రదర్శిస్తూ, వాటి నుండి ఉటంకిస్తున్నా, అతని మైక్రోఫోన్‌ను మాత్రం ఆపివేయరు," అని ఆమె అన్నారు.
జనరల్ నరవణే చేసిన పనిని ప్రస్తావించకుండా ప్రతిపక్ష నాయకుడిని అడ్డుకోవడం ద్వారా, నరేంద్ర మోడీ ప్రభుత్వం మొత్తం ప్రతిపక్షాన్ని, ప్రతిపక్ష ఎంపీలకు ఓటు వేసిన కోట్లాది మంది ప్రజల నోళ్లు మూయించాలనిచూస్తోందని ప్రియాంక గాంధీ ఆరోపించారు.
ఒకవైపు ప్రతిపక్ష నాయకుడిని మాట్లాడకుండా అడ్డుకుంటున్నారు, మరోవైపు ఎవరో ఒకరికి లేచి అన్ని రకాల అసంబద్ధమైన విషయాలు మాట్లాడటానికి అనుమతిస్తున్నారు. సభలో నెహ్రూ పేరును పదే పదే ప్రస్తావిస్తున్నారు, అని ఆమె అన్నారు.
భారత్ దృష్టిని మళ్లించడానికి ఇదొక ఎత్తుగడ అని ఆరోపిస్తూ, జనరల్ నరవాణె ఏం రాశారో ప్రజలకు తెలియడం మోడీ ప్రభుత్వానికి ఇష్టం లేదు. మన సరిహద్దులలో చైనా సైన్యం నిలిచినప్పుడు, ఏం చేయాలో మన నాయకులు నిర్ణయించుకోలేకపోయారని ఆమె విమర్శించారు.
ఇప్పుడు యుద్ధానికి రంగం సిద్ధమైంది. ప్రచురితం కాని ఒక పుస్తకం నుండి ఉటంకించడానికి ప్రయత్నిస్తూ, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రాజీపడ్డారని రాహుల్ గాంధీ ఆరోపించిన తర్వాత, బుధవారం బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే కాంగ్రెస్‌పై ఎదురుదాడికి దిగారు. నెహ్రూగాంధీ కుటుంబం దశాబ్దాలుగా చేసిన మోసం, ద్రోహం, అవినీతి వివరాలు ఉన్నాయని తాను చెప్పిన అనేక పుస్తకాలను ఆయన ప్రదర్శించారు.

# వాణిజ్య ఒప్పందంతో ఆ రంగాలకు ముప్పులేదు

**పీయూష్ గోయల్**

**న్యూఢిల్లీ :** అమెరికాతో వాణిజ్య ఒప్పందం చేసుకున్నప్పటికీ వ్యవసాయం, పాడి రంగాల్లో భారత్ తన ప్రయోజనాలను వీడలేదని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్‌గోయల్ పేర్కొన్నారు. దేశంలోని ముఖ్యమైన రంగాల్లో దేనినీ విస్మరించలేదన్నారు. ఇరుదేశాల ప్రయోజనాలను దృష్టిలోపెట్టుకొని దౌత్య సంబంధాలపై ఒప్పందాలు చేసుకున్నామన్నారు. ఇందులోభాగంగా 140 కోట్ల మంది దేశ ప్రజల ఇంధన భద్రతకు ప్రాధాన్యం ఇచ్చామన్నారు. ఏడాది పాటు అమెరికాతో పలుమార్లు చర్చలు జరిపిన అనంతరం దీనిపై ట్రంప్ ప్రకటన వెలువరించారని తెలిపారు.
భారత్‌అమెరికా వాణిజ్య ఒప్పందంపై లోక్‌సభలో మాట్లాడుతూ పీయూష్ గోయల్ ఈ వ్యాఖ్యలు చేశారు. అగ్రరాజ్యంతో ఒప్పందం వల్ల భారత్‌లోని తయారీదారులు, ఎగుమతిదారులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు బలపడతారని గోయల్ పేర్కొన్నారు. తోలు ఉత్పత్తులు, సేంద్రియ రసాయనాలు, రబ్బరు ఉత్పత్తులు, యంత్రాలు, విమాన తయారీ రంగంలోని కార్మికులకు మరిన్ని అవకాశాలు లభిస్తాయని వెల్లడించారు. చైనా, బంగ్లాదేశ్, మలేసియా, కంబోడియా, వియత్నాంల కన్నా తక్కువ సుంకాలే మనకు అమలు కానున్నాయని పేర్కొన్నారు. దీనిపై త్వరలో రెండు దేశాలు సంయుక్త ప్రకటన చేయనున్నాయని, అందులో మరిన్ని వివరాలు వెల్లడవుతాయన్నారు.



# అవినీతి ఆరోపణల్లో మాజీ ఎమ్మెల్యే అరెస్టు

**జైపూర్:**
ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో తన నియోజకవర్గంలోని పాఠశాలలకు నాణ్యత లేని క్రీడా సామగ్రిని సరఫరా చేయడంలో ఎమ్మెల్యే నిధులను దుర్వినియోగం చేశారనే ఆరోపణలపై ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మాజీ స్వతంత్ర ఎమ్మెల్యే బల్జీత్ యాదవ్‌ను అరెస్టు చేసింది. అతడిని జైపూర్‌లోని ఈడీ కోర్టులో ప్రవేశపెట్టగా, కోర్టు ఆయనను మూడు రోజుల రిమాండ్‌కు పంపింది. ఒక రాజకీయ కుట్రలో భాగంగానే తనను ఇరికిస్తున్నారంటూ కోర్టుకు వెడుతున్న సమయంలో బల్జీత్ యాదవ్ ఆరోపించారు.
**నిర్బంధం, అరెస్టు**
మంగళవారం రాత్రి అల్వార్‌లోని షాజహాన్‌పూర్ టోల్ ప్లాజా వద్ద (ఢిల్లీ-జైపూర్ జాతీయ రహదారిపై ఉన్న ఎన్‌హెచ్‌ఏఐ కార్యాలయం సమీపంలో) యాదవ్‌ను ఈడీ జైపూర్ ప్రాంతీయ యూనిట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విచారణ నిమిత్తం అతడిని జైపూర్‌లోని ఈడీ కార్యాలయానికి తీసుకువచ్చి, విచారణ తర్వాత అరెస్టు చేశారు.



**ఎమ్మెల్యే నిధుల దుర్వినియోగం ఆరోపణలు**
స్థానిక ప్రాంత అభివృద్ధి నిధి (ఎమ్మెల్యే ఫండ్) నుంచి రూ. 3 కోట్లకు పైగా నిధులను దుర్వినియోగం చేసి, స్వాహా చేశారనే ఆరోపణలపై యాదవ్‌ను నిందితుడిగా పరిగణించారు..
**సోదాలు, పీఎంఎల్‌ఏ కేసు**
జనవరి 2025లో, ఈడీ జైపూర్‌లో ఎనిమిది చోట్ల, దౌసా, బహ్రోర్‌లో ఒక్కో చోట సహా యాదవ్‌కు చెందిన ఆవరణలలో సోదాలు నిర్వహించింది. ఈ సోదాల్లో కీలక పత్రాలు, నేరారోపణకు సంబంధించిన ఆధారాలు లభించాయి. ఈ విషయంలో ఈడీ పీఎంఎల్‌ఏ చట్టం కింద కేసు నమోదు చేసింది. దీనితో పాటుగా, రాజస్తాన్‌కు చెందిన యాంటీ కరప్షన్ బ్యూరో కూడా యాదవ్, మరో ఎనిమిదిమందిపై కేసు నమోదు చేసింది.
**అవినీతి వ్యతిరేక ఇమేజ్**
గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో స్వతంత్ర ఎమ్మెల్యేగా సేవలు అందిస్తున్న తరుణంలో బల్జీత్ యాదవ్ తనను తాను అవినీతి వ్యతిరేక పోరాట యోధుడిగా చిత్రీకరించుకున్నాడు. ఉదయం నుండి సాయంత్రం వరకు నల్లటి దుస్తులు ధరించి జైపూర్‌లోని సెంట్రల్ పార్క్‌లో అతను పరుగెత్తడమే కాక అవినీతిని బయటపెట్టిన వారికి 51,000 రూపాయల బహుమతిని ప్రకటించే పోస్టర్లను తన నియోజకవర్గంలో ప్రదర్శింప చేశాడు.

# గత 5 ఏళ్లలో 70 వేలకు పైగా చిత్రాలకు ధ్రువీకరణ జారీ చేసిన సీబీఎఫ్‌సీ

**న్యూఢిల్లీ :**
సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ పరిధిలోని చట్టబద్ధ సంస్థ 'సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్' (కేంద్ర చలనచిత్ర ధ్రువీకరణ మండలి).. సినిమాటోగ్రాఫీ చట్టం 1952, సినిమాటోగ్రాఫీ సర్టిఫికేషన్ నియమాలు 2024, సంబంధిత మార్గదర్శకాల ప్రకారం సినిమాల ప్రదర్శన కోసం వాటికి ముందుగా ధ్రువీకరణ పత్రాలను జారీ చేస్తుంది.
దేశ సార్వభౌమాధికారం, సమగ్రత, భద్రత, శాంతిభద్రతలు, సభ్యత, నైతికత, పరువు నష్టం, కోర్టు ధిక్కరణ లేదా నేరానికి ప్రేరేపించడం వంటి చట్టపరమైన నిబంధనలను ఉల్లంఘించినప్పుడు మాత్రమే చిత్రాల్లో కోతలు, మార్పులు సిఫార్సు చేస్తుంది.
గత ఐదేళ్లలో (2020-21 నుంచి 2024-25 వరకు) మొత్తం 71,963 సినిమాలకు సీబీఎఫ్‌సీ ధ్రువీకరణ పత్రాలను జారీ చేసింది. సినిమాటోగ్రాఫీ చట్టం ప్రకారం బోర్డు ఇచ్చే ఉత్తర్వులకు వ్యతిరేకంగా హైకోర్టులో అప్పీల్ చేసుకునే అవకాశం ఉంది. అటువంటి కేసులను న్యాయపరమైన విచారణ ఫలితాల ఆధారంగా పరిష్కరిస్తారు.
సృజనాత్మక స్వేచ్ఛను కాపాడుతూనే, సినిమాటోగ్రాఫీ చట్టం కింద తన విధులను నిర్వర్తిస్తూ.. పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన ధ్రువీకరణ ప్రక్రియను కొనసాగించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. మనీష్ తివారీ, టి.ఆర్. బాలు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా సమాచార, ప్రసార, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ లోక్‌సభలో ఈ సమాచారాన్ని అందించారు.




# పశ్చిమ బెంగాల్‌ను లక్ష్యంగా చేసుకొని, అణచివేస్తున్నారు

**ఇసిఐ పై మమత ఆరోపణలు**


**న్యూఢిల్లీ :** తమ రాష్ట్రంలో జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక విస్తృత సవరణను (ఎస్ ఐఆర్)ను సవాలు చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌పై వాదించడానికి భారత ప్రధాన న్యాయమూర్తి ఛాంబర్‌లోకి బుధవారం మధ్యాహ్నం ప్రవేశించిన పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఎన్నికల సంఘంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. న్యాయం మూసిన తలుపుల వెనుక ఏడుస్తోందని ఆమె సుప్రీంకోర్టులో గగ్గోలు పెడుతూ, ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ ఎదుట తన వాదనను వినిపించేందుకు ఐదు నిమిషాల సమయం కోరారు. అందుకు ప్రధాన న్యాయమూర్తి అంగీకరించి, ధర్మాసనం ఎదుట మాట్లాడటానికి ఆమెకు 15 నిమిషాలు కేటాయించారు. కాగా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రం ఇప్పటికే ఒక పిటిషన్ దాఖలు చేసిందని, నిజాయితీగల నివాసితులను మినహాయించడం గురించి విధానపరమైన సవాళ్లు, భయాలను గతంలో ఎత్తిచూపిన కపిల్ సిబల్ సహా సీనియర్ న్యాయవాదులు రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించారని భారత ప్రధాన న్యాయమూర్తి పేర్కొన్నారు.అయినప్పటికీ మమత తాను వ్యక్తిగతంగా వాదించాలని నిర్ణయించుకున్నందున, రాష్ట్రంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐఆర్) ప్రక్రియను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై ఉద్వేగభరితమైన వాదనలు ప్రారంభించారు. తన విజ్ఞప్తులను భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ) విస్మరించిందన్న ఆరోపణలు చేస్తూ, భారత ఎన్నికల సంఘపు అపారదర్శక, తొందరపాటు, రాజ్యాంగ విరుద్ధమైన, చట్టవిరుద్ధమైన చర్యలు పెద్ద ఎత్తున ఓటుహక్కుల హరించడానికి దారి తీస్తున్నాయని ఆమె ఆరోపించారు.
సమస్య ఏమిటంటే, అంతిమంగా మాకు న్యాయం ఎక్కడా లభించదు. నేను ఇసిఐకి ఆరుసార్లు లేఖలు రాశాను కానీ ఇంతవరకూ నాకు జవాబు రాలేదని సీఎం ఆరోపించారు. అనంతరం అది ఎన్నికల సంఘంపై పూర్తిస్థాయి దాడిగా మారింది. ఆమె విజ్ఞప్తి వాస్తవమైందని, ప్రతి సమస్యకు పరిష్కారముంటుందని జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, విఎం పంచోలీలు కూడా భాగమైన ధర్మాసనం పేర్కొంది.ఎస్ఐఆర్ నోటీసులు పంపే సమయంలో జాగ్రత్తగా ఉండాలని పేర్కొంటూ కోర్టు ఇసిఐకు నోటీసు జారీ చేసింది. నోబెల్ బహుమతి గ్రహీత అమర్త్య సేన్, ప్రముఖ బెంగాలి కవి జాయ్ గోస్వామి, తృణమూల్ ఎంపీ దీపక్ అధికారి వంటి ప్రముఖ వ్యక్తులకు పంపిన ఎస్ఐఆర్ నోటీసుల గురించి మమత లిఖిత పూర్వకంగా చేసిన ఫిర్యాదుకు స్పందిస్తూ, మీ అధికారులను కాస్త తెలివిగా ప్రవర్తించమని చెప్పండి అంటూ ఇసిని కోర్టు కోరింది. తదుపరి విచారణను కోర్టు సోమవారానికి వాయిదా వేసింది.
బెంగాల్‌ను లక్ష్యంగా చేసుకుంటున్నారు, అణచివేస్తున్నారు..
ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారుల అధికారాలను తీసేసి, వారి స్థానంలో బిజెపి పాలిత రాష్ట్రాల నుండి తీసుకున్న 8,300 మంది సూక్ష్మ పరిశీలకులను నియమించారని, సరైన ధృవీకరణ లేకుండా పేర్లను తొలగిస్తున్నారని ముఖ్యమంత్రి ఆరోపించారు. ఫారం 6 దాఖలు చేయడానికి అనుమతి లేదని, ఫలితంగా లక్షలాది మంది తొలగింపులు, జీవించి ఉన్న వ్యక్తులు కూడా చనిపోయినట్లు ప్రకటించారని, ఈ ప్రక్రియను "మహిళా వ్యతిరేకం" అని ఆమె అన్నారు. కేవలం భాషా పరమైన సమస్యలు, అక్షర దోషాల కారణంగా వ్యక్తులను వోటర్ జాబితాల నుంచి మినహాయించకూడదని బెనర్జీ వాదించారు. ఒక మహిళ తన అత్తగారింటి ఇంటిపేరును ఉపయోగించినందున ఆమె పేరును జాబితా నుంచి తొలిగించిన ఉదాహరణను పట్టి చూపారు. వివాహానంతరం ఒక మహిళ తన ఇంటి చిరునామా మార్చుకుంటే, ఆ పేరును ఇసి తార్కిక వ్యత్యాసాల జాబితాలో ఉంచిందని ఆమె పేర్కొన్నారు. ఆధార్‌ను అనుమతించకుండా కోర్టు ఆదేశాలను ఇసిఐ ఉల్లంఘిస్తోందని, ఎన్నికలకు ముందు పశ్చిమ బెంగాల్‌ను ఎంపిక చేసుకొని చేసుకుంటున్నారని ఆమె ఆరోపించారు. ఇతర రాష్ట్రాలలో డొమిసైల్ సర్టిఫికెట్‌ను, కుల సర్టిఫికెట్‌ను అనుమతిస్తున్నారని, వారు ఎన్నికల ముందు కేవలం బెంగాల్‌ను మాత్రమే లక్ష్యం చేసుకున్నారన్నారు. నాలుగు రాష్ట్రాలలో ఎన్నికలు జరగబోతున్నాయి. దాదాపు 24 ఏళ్ల తర్వాత, మూడు నెలల్లో దీన్ని పూర్తి చేయాలన్న హడావిడి ఎందుకని ఆమె ప్రశ్నించారు. ఈ విషయంలో తీర్పు రిజర్వ్‌డ్‌లో ఉందని కోర్టు సూచించింది. ముఖ్యమంత్రి ఎస్ఐఆర్ ప్రక్రియకు ముడిపడి ఉన్న బూత్ స్థాయి అధికారుల (బీఎల్ఓల) మరణాల విషయాన్ని కూడా ప్రస్తావిస్తూ, పంట కోత కాలంలో, ప్రజలు ప్రయాణాలు చేస్తున్నప్పుడు, 100 మందికి పైగా చనిపోయారు. బీఎల్ఓలు మరణించారు. చాలా మంది ఆసుపత్రిలో చేరారు. మరి అస్సాంలో ఎందుకు కాదు? అని అన్నారు.విచారణ ముగిసే ముందు, బెంగాల్‌ను అణచివేస్తున్నారని మమత ఆరోపించారు. చేతులు జోడించి అయ్యా, దయచేసి ప్రజల హక్కులను పరిరక్షించండి అని న్యాయస్థానం ముందు విజ్ఞప్తి చేస్తున్నప్పుడు నాటకీయత స్పష్టంగా కనిపించింది.



# ప్రాణాలు తీసిన ఆన్‌లైన్ గేమింగ్ వ్యసనం

## ఆత్మహత్య చేసుకున్న 3 అక్కచెల్లెళ్లు

**గాజియాబాద్:**
చౌకగా మొబైల్ ఫోన్స్, ఇంటర్నెట్ రావడంతో యువత ఫోన్‌లో ఆన్‌లైన్ గేమింగ్‌కు బానిసలవుతున్నారు. ఆడవద్దంటూ తండ్రి కటువుగా చెప్పినందుకు ముగ్గురు అక్కచెల్లెళ్లు గాజియాబాద్‌లో ఆత్మహత్య చేసుకోవడం సంచలనాన్ని సృష్టించింది.
ఉత్తర ప్రదేశ్‌లోని గాజియాబాద్‌లోని ఒక టౌన్‌షిప్‌లో నివసిస్తున్న ఒక కుటుంబానికి చెందిన ముగ్గురు టీనేజీ అక్కచెల్లెళ్లకు కరోనా కాలంలో ఫోన్ చూడటం, ఆన్‌లైన్ గేమ్స్ ఆడటం ఒక వ్యసనమైంది. ఇందులో పడి చదువును నిర్లక్ష్యం చేయడం మొదలుపెట్టారు. బడికి వెళ్లకుండా రోజంతా ఫోన్‌లోనే ఉంటుండడంతో, తండ్రి ఫోన్ వినియోగం తగ్గించమని పిల్లలను మందలించినా వారు దారిలోకి రాలేదని పోలీసులు చెబుతున్నారు. మంగళవారం రాత్రి ఈ విషయంలో గొడవ జరిగినట్టు చుట్టుపక్కల వారి కథనం. దీని తర్వాతే ముగ్గురు అక్కచెల్లెళ్లూ ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుని, 9వ అంతస్తు నుంచి దూకేశారు. ఈ ఘటన అర్ధరాత్రి జరిగిందని భావిస్తున్నారు. అందరూ నిద్రిస్తున్న సమయంలో పెద్దగా శబ్దం వినిపించడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చి, పోలీసులకు సమాచారం అందింది. వారు వచ్చి మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం ఆసుపత్రికి పంపి, సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు.



**తమను తాము కొరియన్**
గేమింగ్ యాప్‌తో మమేకం అయిపోయారంటే, వారు తమను తాము కొరియన్ రాజకుమార్తెలుగా భావించేవారే తప్ప భారతీయ పౌరులుగా కాదని పోలీసులు చెబుతున్నారు.
కాగా, తన కుమార్తెలు ఆడుతున్న ఆన్‌లైన్ ఆటలో ఆత్మహత్యే చివరి టాస్క్ అని బాలికల తండ్రి మీడియాకు వెల్లడించారు. 'రెండున్నరేళ్లుగా మా ముగ్గురు పిల్లలు ఈ గేమ్ ఆడుతున్నారు. దీంతో వీరు క్రమక్రమంగా కుటుంబానికి దూరమవుతూ వచ్చారు. ఎప్పుడూ ఫోన్లు పట్టుకొని వారి గదుల్లోనే ఉండేవారు. వారిలో ఒకరు ఇన్‌స్ట్రక్టర్‌గా ఉంటే.. మిగతా ఇద్దరు ఆదేశాలు పాటించేవారు. వారి ఫోన్లలో చివరి టాస్క్ సూసైడ్ అని ఉందని
కాగా, పోలీసులు మాత్రం వారు ఏ టాస్క్ ఆధారిత గేమ్ ఆడుతున్నట్టు తమకు సమాచారం లభించలేదని, వారు ఆన్‌లైన్‌లో గేమ్స్ ఆడినా అవి గూగుల్ ప్లేస్టోర్‌లో అందుబాటులో ఉన్నవే తప్ప కొరియన్ గేమ్స్ కావని చెప్పారు.
ఇప్పటి వరకూ తాము చేసిన దర్యాప్తు ప్రకారం, ఈ ముగ్గురు ఆడపిల్లలూ కొరియన్ సినిమా, సంగీతం, కొన్ని ఆటలు సహా కొరియన్ సంస్కృతితో తీవ్రంగా ప్రభావితమయ్యారు. వారు సాధారణంగా కూడా తమ మొబైల్ ఫోన్లకు బానిసలయ్యారు అని, డిసిపి పాటిల్ వెల్లడించారు. ఇంతవరకూ, ఆన్‌లైన్ గేమింగ్ గురించి ఏ రకమైన వాస్తవాలు లేదా ఆ ఆటల్లో ఇచ్చిన టాస్క్‌ల గురించి

# హిట్ & రన్ రాజకీయాల శకం ముగిసింది

## గొగోయ్ వ్యాఖ్యలపై హిమంత స్పందన



**న్యూఢిల్లీ:**
రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ కుటుంబం 12వేల బీఘాల భూమిని ఆక్రమించిందని అస్సాం కాంగ్రెస్ అధ్యక్షుడు గౌరవ్ గోగోయ్ ఆరోపించిన కొద్ది గంటల్లోనే, ఈ ఆరోపణలు తప్పుడు, హానికరమైన, పరువుకు భంగం కలిగించేవిగా ఉన్నాయంటూ ముఖ్యమంత్రి స్పందించారు. తాను గోగోయ్, మరో ముగ్గురు కాంగ్రెస్ నేతలపై ఫిబ్రవరి 9వ తేదీన తాను సివిల్, నేరపూరిత పరువు నష్టం ప్రొసీడింగ్‌లను ప్రారంభిస్తామంటూ బుధవారం ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. నేటి విలేకరుల సమావేశంలో తనకు వ్యతిరేకంగా తప్పుడు, హానికరమైన, పరువుకు భంగం కలిగించే వ్యాఖ్యలు చేసిన జితేంద్ర సింగ్ ఆళ్వార్, భూపేష్ బఘేల్, గౌరవ్ గొగోయ్, దేవవ్రత సైకియాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 9న క్రిమినల్ ప్రొసీడింగ్స్‌కు శ్రీకారం చుడతానని శర్మ సామాజిక మాధ్యమం ఎక్స్‌పై చేసిన పోస్ట్‌లో పేర్కొన్నా
వారు చేసిన ప్రతి ఆరోపణను రుజువు చేయనివ్వండి. నేను దుష్ప్రచారానికి, సమన్వయంతో కూడిన బురదజల్లుడికి లేదా గాంధీ కుటుంబ బానిసల రాజకీయ నాటకీయతతో తాను బెదిరిపోనని ఆయన అన్నారు.
అంతకు ముందు, గువాహతిలో విలేకరుల సమావేశంలో ప్రసంగిస్తూ, కాంగ్రెస్ పార్టీ ఒక విచారణ జరిపిందని, దానిలో కొన్ని దిగ్భ్రాంతికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయని, అస్సాం రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యమంత్రి, ఆయన కుటుంబ సభ్యులు దాదాపు 12,000 బిఘాల భూమిని ఆక్రమించుకున్నారని గౌరవ్ గొగోయ్ ఆరోపించారు.
శర్మ పరువు నష్టం దావా బెదిరింపుపై స్పందిస్తూ, ఈ రోజు మా పత్రికా సమావేశానికి హిమంత బిశ్వ శర్మ భయపడ్డారని స్పష్టంగా తెలుస్తోంది. త్వరలోనే, అతని అవినీతి, ఆస్తుల వివరాలు అస్సాంలోని ప్రతి గ్రామంలో ప్రజలకు తెలియజేస్తాం. అతనికి ధైర్యం ఉంటే, ఆశ్రయం కోరడానికి బదులుగా ప్రజాన్యాయ

# జమ్మూకశ్మీర్‌లో భారీ ఎన్‌కౌంటర్.. ఇద్దరు ఉగ్రవాదులు హతం

**శ్రీనగర్ :** జమ్మూకశ్మీర్‌లో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు ఉగ్రవాదులను భద్రతా బలగాలు హతం చేశాయి. వారు జైషే మహ్మద్‌కు చెందిన వారీగా గుర్తించారు. అధికారుల వివరాల ప్రకారం.. జైషేకు చెందిన ఇద్దరు ఉగ్రవాదుల గురించి నిఘా సమాచారం అందింది. వెంటనే భద్రతా దళాలు, సీఆర్‌పీఎఫ్ బలగాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ సందర్భంగా ఉగ్రవాదులు కాల్పులు జరపడంతో ఎన్‌కౌంటర్ ప్రారంభమైంది. అనంతరం మిలిటెంట్లు పారిపోయారు. ఉదంపూర్ ప్రాంతంలోని గుహల్లో వారు ఉన్నట్లు సమాచారం రావడంతో మళ్లీ గాలింపు చేపట్టారు. గుహలో ఉన్న వారిపై కాల్పులు జరపగా, ఇద్దరు మిలిటెంట్లు హతమయ్యారు. వారిలో ఒకరు పాకిస్థాన్ జాతీయుడు కాగా, మరొకరు స్థానిక వ్యక్తి అని తెలిపారు. వారి నుంచి ఎం4 కార్బైన్ రైఫిల్స్, ఏకే-47 రైఫిల్స్, మందుగుండు సామగ్రిని భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్నాయి.



# మణిపూర్ సీఎంగా ఖేమ్‌చంద్ ప్రమాణ స్వీకారం

**ఇంఫాల్ :** మణిపూర్ నూతన సీఎంగా యుమ్నమ్ ఖేమ్‌చంద్ సింగ్ ప్రమాణస్వీకారం చేశారు. గవర్నర్ అజయ్ కుమార్ భల్లా ఆయనతో ప్రమాణం చేయించారు. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలనను ఎత్తివేస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. జాతుల మధ్య ఘర్షణలతో మణిపూర్ 2023 మే నుంచి అట్టుడికింది. గతంలో ఫిబ్రవరిలో అప్పటి సీఎం బీరెన్‌సింగ్ రాజీనామా చేయడంతో రాష్ట్రం రాష్ట్రపతి పాలనలో ఉంది.




# బైకర్ పవర్ ఫుల్ గ్లింప్స్ విడుదల

అభిలాష్ రెడ్డి కంకర దర్శకత్వంలో చార్మింగ్ స్టార్ శర్వానంద్ హీరోగా తెరకెక్కుతున్న లేటెస్ట్ చిత్రం 'బైకర్'. 1990-2000 కాలం నాటి పీరియాడిక్ బ్యాక్డ్రాప్‌లో సాగే ఈ కథలో శర్వా ఒక ప్రొఫెషనల్ మోటార్‌సైకిల్ రేసర్‌గా కనిపించబోతున్నాడు. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా గ్లింప్స్, సాంగ్స్‌కు ఆడియన్స్ నుంచి అదిరిపోయే రెస్పాన్స్ వచ్చింది. ఈ క్రమంలోనే తాజాగా మేకర్స్ సినిమా రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. వచ్చే ఏడాది సమ్మర్ కానుకగా ఏప్రిల్ 3న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నట్లు అనౌన్స్ చేశారు. రిలీజ్ డేట్ పోస్టర్‌లో శర్వానంద్ బైకర్ లుక్ చాలా స్టైలిష్‌గా ఉండి అంచనాలను పెంచేసింది. 'బైకర్' అంటే కేవలం రేసింగ్ యాక్షన్ మాత్రమే కాదు, ఇందులో హార్ట్ టచింగ్ ఫ్యామిలీ డ్రామా కూడా ఉండబోతోంది. మూడు తరాలకు చెందిన వ్యక్తులు ఒకే రేసింగ్ కలకోసం ఎలా పోరాడారు? వారి మధ్య ఉండే ఎమోషనల్ బంధాలు ఏంటి? అన్న కోణంలో ఈ సినిమా ఉండబోతోంది. స్పీడ్, అంబిషన్, ఫ్యామిలీ రిలేషన్స్‌తో కూడిన ఒక మల్టీ జనరేషనల్ వండర్‌గా ఈ చిత్రాన్ని రూపొందించారు.

ఈ చిత్రంలో మాళవిక నాయర్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమాలో మరో బిగ్ సర్ప్రైజ్ ఏంటంటే, యాంగ్రీ మ్యాన్ రాజశేఖర్ ఒక కీలక పాత్రలో నటిస్తున్నారు. ఈరోజు రాజశేఖర్ పుట్టినరోజు కావడంతో మేకర్స్ ఆయన పాత్రను పరిచయం చేస్తూ ఒక పవర్ ఫుల్ గ్లింప్స్‌ను రిలీజ్ చేశారు. రాజశేఖర్ ఇందులో 'బుల్లెట్ సునీల్' అనే మాజీ రేసర్ పాత్రలో కనిపిస్తున్నారు. వింటేజ్ రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌పై రఫ్ అండ్ టఫ్ మేకోవర్‌లో ఉన్న రాజశేఖర్‌ను చూస్తుంటే పాత వింటేజ్ యాంగ్రీ మ్యాన్ గుర్తొస్తున్నారు. ఇది కేవలం అతిథి పాత్ర మాత్రమే కాదు, కథను పూర్తిగా మలుపు తిప్పే కీలక పాత్ర అని తెలుస్తోంది. యూవీ క్రియేషన్స్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి జిబ్రాన్ సంగీతం అందిస్తున్నారు. శర్వానంద్ వంటి నేచురల్ యాక్టర్‌తో రాజశేఖర్ వంటి సీనియర్ స్టార్ తోడవ్వడంతో 'బైకర్' బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి స్పీడ్ చూపిస్తుందో అని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# అసహ్యంగా మార్చకండి

సోషల్ మీడియాలో వ్యక్తిగత విషయాల గురించి మాట్లాడటానికి ఆసక్తి చూపని లావణ్య.. ప్రస్తుతం చేసిన పోస్ట్ వైరల్‌గా మారింది. రామ్‌చరణ్- ఉపాసన దంపతులకు ఇటీవల కవలలు జన్మించడంతో మెగా అభిమానులు సంబరాలు చేసుకున్నారు. ఈసందర్భంగా చిరంజీవి కూడా మీడియాతో మాట్లాడుతూ తన ఆనందాన్ని వ్యక్తంచేశారు. అయితే, కొందరు చిరంజీవి ప్రెస్‌మీట్‌ను తప్పపడుతూ విమర్శలు చేశారు. ఈతరంలో కూడా వారసుడి కోసం కోరుకునేవాళ్లు ఉన్నారా.. అని ఒక వ్యక్తి పెట్టిన పోస్ట్‌కు లావణ్య స్పందించారు. స్ట్రాంగ్ కౌంటర్ ఇస్తూ పోస్ట్ పెట్టారు. "సాధారణంగా నేను ఇలాంటి పోస్ట్‌లపై స్పందించను. వాటిని అసలు పట్టించుకోను. కానీ, మీలాంటి వారి నుంచి ఇలాంటి వ్యాఖ్యలు ఊహించలేదు. మీ పోస్ట్ చాలా అభ్యంతరకరంగా ఉంది. ఆనంద క్షణాలను మీ కామెంట్స్‌తో అసహ్యంగా మార్చకండి. చిరంజీవి మా అందరితో ఎలా ఉంటారో మీకు తెలుసా.. ఆయన కుటుంబంలోని మహిళలను ముఖ్యంగా మనవరాళ్లను ఎలా చూసుకుంటారో మీకు తెలియదు. ఆయన మహిళలపై చూపే గౌరవంలో ఒక్క శాతం చూపే పురుషులు కూడా బయట తక్కువే. మీకు తెలియని విషయాల గురించి కామెంట్స్ చేయకపోవడం మంచిది" అని తన పోస్ట్ లో రాసుకొచ్చారు. లావణ్య స్పందించిన అనంతరం ఆ వ్యక్తి తన పోస్ట్ ను తొలగించడం గమనార్హం.



# ఆయనతో నన్ను పోల్చొద్దు

రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ బాబు హీరోగా రానున్న 'వారణాసి' ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండింగ్ అవుతోంది. ఎన్నో రోజుల నుంచి అప్‌డేట్స్ కోసం ఎదురుచూసిన అభిమానులకు ఈరోజు చాలా విశేషాలు వచ్చేశాయి. చిత్రబృందం ఓ హాలీవుడ్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో 'వారణాసి' గురించి పంచుకుంది. దీంతో ఈ చిత్రం ఒక్కసారిగా సోషల్‌మీడియాలో ట్రెండ్ అవుతోంది. రాముడిగా కనిపించనున్నట్లు మహేశ్‌బాబు అధికారికంగా వెల్లడించారు. ఇక రాజమౌళి ఈ సినిమా నిడివితో పాటు 'అవతార్'తో పోల్చడం గురించి మాట్లాడారు.

''నాకు ఉన్న కొన్ని కమిట్‌మెంట్‌ల కారణంగా మహేశ్‌బాబుతో సినిమా ఆలస్యం అయింది. లేదంటే 15 ఏళ్ల క్రితమే తీసేవాడిని. ఇప్పుడు వారణాసిని భారీ స్థాయిలో విడుదల చేస్తున్నాం. ప్రపంచ వ్యాప్తంగా ఐమ్యాక్స్ లలో సందడి చేయనుంది. నేను సినిమాలు ఆలస్యం చేస్తాననే చెడ్డపేరు ఉంది. ప్రొడక్షన్ పనులు లేట్ చేస్తానని వాయిదాలు వేస్తానని అంటారు. ఈ విషయంలో నెటిజన్లు కూడా చాలాసార్లు కామెంట్స్ చేశారు. 'వారణాసి' 3.20 గంటల నిడివితో విడుదలవుతుంది. ఇంత ఎక్కువ నిడివిలో మూడు నిమిషాలు ఆసక్తిగా లేకపోయినా వెంటనే ఆడియన్స్ ఫోన్ తీసుకుంటారు. మేం అందుకే చాలా జాగ్రత్తగా ఎక్కడా బోర్ కొట్టకుండా దీన్ని రూపొందిస్తున్నాం. ప్రేక్షకుడికి ప్రతి క్షణం ఆసక్తి కలిగేలా.. కొత్త అనుభవాన్ని ఇచ్చేలా దీన్ని తీర్చిదిద్దుతున్నాం'' అని రాజమౌళి తెలిపారు.

హాలీవుడ్ దర్శకుడు జేమ్స్ కామెరూన్ సృష్టించిన ప్రపంచం 'అవతార్'తో రాజమౌళి 'వారణాసి'ని పోల్చడంపై ఆయన మాట్లాడారు. ''అలాంటి వ్యక్తితో పోల్చడాన్ని చాలా గౌరవంగా భావిస్తున్నా. కానీ, ఆయనతో నన్ను పోల్చొద్దు. ఆయన ఒక శిఖరం. ఆయన మాస్టర్. నేను ఇంకా విద్యార్థినే. 'వారణాసి'లో 25 నిమిషాలు పురాణాలపై చిత్రీకరించాం. ప్రేక్షకులు ఎప్పటికీ ఆ సన్నివేశాలను మర్చిపోలేరు. ప్రస్తుతం ఇంతవరకూ మాత్రమే చెప్పగలను'' అని దర్శకధీరుడు తెలిపారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

ఇక ఈ సినిమాలో మహేశ్ బాబుతో పాటు ప్రియాంక చోప్రా కూడా ప్రధాన పాత్రలో కనిపించనున్నారు. తాజా ఇంటర్వ్యూలో ప్రియాంక తాను ఈ సినిమాను అంగీకరించేముందు రాజమౌళికి ఓ విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. దాని గురించి ఆమె మాట్లాడుతూ.. ''నేను ఇండియన్ సినిమాలో నటించి 6 సంవత్సరాలు అయింది. ఈ చిత్రంలో హీరోయిన్ పాత్ర చాలా గొప్పగా ఉంటుందని రాజమౌళి చెప్పినప్పుడు ఆయనకు ఒక విజ్ఞప్తి చేశా. 'దయచేసి నాకు ఈ సినిమాలో డ్యాన్స్ వేసే అవకాశం ఇవ్వండి. మంచి పాట ఉండేలా చూడండి' అని చెప్పా. ఆయన చాలా పాటలు ఉన్నాయని చెప్పారు. మేం ఇప్పటికే ఒక పాట షూటింగ్ కూడా పూర్తిచేశాం. అది నాకు చాలా నచ్చింది. రోజూ దాన్ని పాడుకుంటూనే ఉన్నాను. అందులో డ్యాన్స్ అదిరిపోతుంది'' అని ప్రియాంక పంచుకున్నారు.






# లెజెండ్ శరవణన్ లీడర్ గ్లింప్స్



వ్యాపారవేత్త అరుళ్ శరవణన్ 'ది లెజెండ్'తో నటుడిగా మారిన సంగతి తెలిసిందే. లెజెండ్ శరవణన్ గా గుర్తింపు పొందారు. ఆయన కథానాయకుడిగా దురై సెంథిల్‌కుమార్ దర్శకత్వంలో 'లీడర్' సినిమా రూపొందుతోంది. ప్రమోషన్స్‌లో భాగంగా గ్లింప్స్ ను బుధవారం విడుదల చేశారు. తండ్రీకూతుళ్ల అనుబంధం నేపథ్యంతో ఈ సినిమా తెరకెక్కుతున్నట్లు గ్లింప్స్ చూస్తే అర్థమవుతోంది. 'పిల్లలకు తండ్రే హీరో' అంటూ హీరో చెప్పిన డైలాగ్ ఆకట్టుకునేలా ఉంది.

# కథ విన్నప్పుడు చాలా భయపడ్డాను




ఈ సినిమాలో తన పాత్రకు హుందాతనం చాలా కీలకమని, ముఖ్యంగా శ్రీరాముడిగా కనిపించే సందర్భాల్లో శరీర భాష, నిలబడి మాట్లాడే తీరు వంటి ప్రతి అంశంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామని చెప్పారు. పాత్రలోకి పూర్తిగా వెళ్లేందుకు దాదాపు ఏడాది పాటు శిక్షణ తీసుకున్నానని, ఇందులో భాగంగా 2-3 నెలలు కలరీ వంటి యుద్ధవిద్యను కూడా నేర్చుకున్నానని ఆయన వెల్లడించారు. అంతేకాదు, రాజమౌళి సూచన మేరకు తన రన్నింగ్ స్టైల్‌ను మార్చుకోవాల్సి వచ్చిందని, కేవలం రెండు నిమిషాల షాట్ కోసం ఆరు నెలల పాటు కఠినమైన ట్రైనింగ్ తీసుకున్నానని చెప్పారు. 6 నెలల ట్రైనింగ్ తర్వాత.. ఆ షాట్‌ను స్క్రీన్‌పై చూసినప్పుడు తనకు ఎంతో సంతోషం కలిగిందని.. ఆ ఒక్క షాట్ కోసం ఆరు నెలలు చేసిన శిక్షణ నిజంగా విలువైనదిగా అనిపించిందంటూ ఎమోషనల్ అయ్యారు. అంతేకాకుండా తన నడక మారింది.. నిలబడే విధానం మారింది.. అన్నీ మారిపోయాయి" అంటూ మహేష్ బాబు చెప్పుకొచ్చారు.

# సెన్సార్ కంప్లీట్ చేసుకున్న సుమతీ శతకం

సీరియల్స్ తో ఫేమస్ అయిన అమర్ దీప్ చౌదరి గురించి స్పెషల్‌గా చెప్పాల్సిన పనిలేదు. ఆ తర్వాత బిగ్ బాస్ హౌస్‌లో అడుగు పెట్టి అక్కడ తన గేమ్‌తో రన్నరప్‌గా నిలిచారు. ఇక బయటకు వచ్చాక వరుస షోస్, సినిమాలతో ఫుల్ బిజీగా ఉంటున్నాడు. అలాగే బీబీ జోడీలో తన డ్యాన్స్‌తో అదరగొడుతున్నాడు. ఇక బిగ్ బాస్ హౌస్ నుంచి బయటికి వచ్చాక అమర్ దీప్, సైలీ చౌదరి హీరోహీరోయిన్లుగా నటిస్తున్న తాజా చిత్రం 'సుమతీ శతకం'.

ఎం. ఎం. నాయుడు దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఫిబ్రవరి 6న మైత్రీ మూవీస్ డిస్ట్రిబ్యూటర్స్ సంస్థ ద్వారా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. జీరో కట్స్‌తో ఈ సినిమా యు.ఏ సర్టిఫికెట్ పొందిందని, సెన్సార్ వారు కూడా అభినందించారని మేకర్స్ తెలిపారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఓ స్పెషల్ పోస్టర్‌ను షేర్ చేస్తూ.. 'U/A సర్టిఫైడ్.. కుటుంబాలు మరియు హృదయాలను ఒకేలా చూసే చిత్రం.. ఫిబ్రవరి 6న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలవుతోంది' అని రాసుకొచ్చారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది.

కాగా అమర్ దీప్ మాస్ మహారాజ్ రవితేజ వీరాభిమాని అన్న సంగతి తెలిసిందే. అయితే ఈ సినిమాకు సంబంధించిన కంటెంట్ చూసిన రవితేజ తాజాగా స్పందిస్తూ.. సినిమా కంటెంట్ నాకు బాగా నచ్చింది. ఈ మూవీ మంచి హిట్ కావాలని, అతని భవిష్యత్తు అద్భుతంగా ఉంటాలంటూ ఎక్స్ వేదికగా ఓ వీడియో పోస్ట్ చేశాడు. దీంతో ఈ సినిమాపై మరింత హైప్ పెరిగిపోయింది. మరి ఈ సినిమాతో హీరోగా అమర్ దీప్ ఎలాంటి విజయం సాధిస్తాడో చూడాల్సి ఉంది.



# అదొక్కటే చాలు..

'ఇచ్చట వాహనములు నిలుపరాదు' సినిమాతో తెలుగు ఆడియన్స్ కు పరిచయమైన స్టార్ బ్యూటీ మీనాక్షి చౌదరి మనందరికీ సుపరిచితమే. ఆ తర్వాత 'హిట్:ది సెకెండ్ కేస్', 'గుంటూరు కారం', 'లక్కీ భాస్కర్', 'గోట్:ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్', 'సంక్రాంతికి వస్తున్నాం', 'అనగనగా ఒక రాజు' వంటి సినిమాలతో ఈ భామ మంచి హిట్లను తన ఖాతాలో వేసుకుంది. అలా దాదాపు అన్ని సినిమాలు హిట్ కావడంతో అతి తక్కువ కాలంలోనే స్టార్ హీరోయిన్ స్టేటస్‌ను దక్కించుకుంది. తాను నటించిన సినిమాలన్నీ మంచి సక్సెస్ అవుతున్న నేపథ్యంలో మీనాక్షి లక్కీ హీరోయిన్ అయిపోయింది. రీసెంట్‌గా నటించిన 'అనగనగా ఒకరాజు' మూవీతో మరో హిట్‌ను తన ఖాతాలో వేసుకుంది. నవీన్ పొలిశెట్టిహీరోగా నటించిన ఈ చిత్రానికి మారి దర్శకత్వం వహించాడు. ఇక సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ మరియు ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. సంక్రాంతి కానుకగా రిలీజ్ అయిన ఈ సినిమా బ్లాక్ బస్టర్ టాక్ తెచ్చుకుంది. ప్రజెంట్ ఈ ముద్దుగుమ్మ అక్కినేని హీరో నాగ చైతన్య సరసన 'ఎన్‌సీ-24' మూవీతో పాటు యంగ్ హీరో ప్రదీప్ రంగనాథన్ సరసన ఓ సినిమాలో యాక్ట్ చేస్తోంది. అలా ఓ వైపు సినిమాల్లో నటిస్తూనే మరోవైపు సోషల్ మీడియా లో యాక్టివ్ గా ఉంటుంది మీనాక్షి. ఈ క్రమంలో ఈ భామకు సంబంధించిన ఓ వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. వైరల్ అవుతున్న వీడియోలో.. లైఫ్‌లో స్ట్రైట్ ఏమ్ వద్దు.. ఓన్లీ ఫుడ్ చాలు అని చాలా ఫుడ్ ఐటమ్స్ ముందు పెట్టుకుని తింటున్నది. బిర్యానీ తింటూ ఇదే నా మోటివేషనల్ వీడియో.. డెకెట్.. సెంచరీ అని చెబుతూ నవ్వేస్తుంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారగా.. నెటిజన్లు వివిధ రకరకాలుగా స్పందిస్తున్నారు.

Printed, Published and Owned by POLOJU SRINIVASA CHARY, and Printed at SURYA DIGITAL PRINTERS, H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252., and Published at H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252. Editor: POLOJU SRINIVASA CHARY. RNI. Title-Code:- TELTEL12333, Cell:9985389183. EmailId:vaarthavedhikasurya.yadadri@gmail.com